
# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 463
వెల : రూ.20/-
అక్టోబర్ 2023
ISSN 0971-278X




జనసాహితి ప్రచురణ

# సెప్టెంబర్ 12, 13తేదీలలో విశాఖపట్నంలో జరిగిన అఖిల భారత ఆదివాసీ సదస్సులో ప్రదర్శించిన కళారూపాలు









# చైనా జాతి అంతరాత్మ, ప్రముఖ సాహితీవేత్త లూషున్‌ను

## 87వ వర్ధంతి సందర్భంగా స్మరించుకుందాం....

ఒక పుష్పం వికసించడానికి తోడ్పడినంతకాలం,
నేను ఎరువుగా ఉపయోగపడడానికి కూడా
సంతోషంగా సిద్ధపడతాను. జీవనపథంలో
నా రక్తం ఒకొక్కక్క చుక్కే
యితరులను కాపాడడానికి ప్రవహించనీ.
ఇది నన్ను బలహీనపరిచినా
అలా చేయడం నాకు సంతోషాన్నిస్తుంది

జయంతి : 25-09-1881



వర్ధంతి : 19-10-1936

జనసాహితి ప్రచురణ

47 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

463

సంపుటి : 47
సంచిక : 03
అక్టోబర్ 2023

*website :* **www.prajaasaahithi.com**


## ఈ సంచికలో...


| | | | | |
|---|---|---|---|---|
| ముఖచిత్రం | : | రాజధర్మంపై – కార్టూన్ : సతీష్ ఆచార్య | అంతర్జాలం నుండి | .....01 |
| రెండవ అట్ట | : | సెప్టెంబర్ 12, 13లలో విశాఖపట్నంలో జరిగిన అఖిలభారత ఆదివాసీ సదస్సులో ప్రదర్శించిన కళారూపాలు; లూషన్ వర్ధంతి సందర్భంగా | | .....02 |
| మూడవ అట్ట | : | తదాత్మానం సృజామ్యహమ్ (కవిత) – ఎ.కె. ప్రభాకర్ | | .....35 |
| నాల్గవ అట్ట | : | శ్రమ జీవన సౌందర్యం – శీలా వీర్రాజు గీసిన చిత్రం | | .....36 |
| సంపాదకీయం | : | మహిళా రిజర్వేషన్ బిల్లు – ఎన్నికల వంచనా శిల్పం!! | | .....05 |
| కథ | : | అనామికగా ఇక ఏమాత్రం వుండను<br>ఇంగ్లీషు : రమణికా గుప్తా | తెలుగు – కొత్తపల్లి రవిబాబు | .....07 |
| నవలా పరిచయం | : | "మలగనిబత్తి" నవలా పరిచయం | – బి.వి.ఎన్. స్వామి | .....09 |
| ధారావాహిక | : | దేశ విభజన వస్తువుగా సాహిత్యం (14)<br>దేశ విభజనపై స్పందించిన చిత్ర కళారంగం | – కొత్తపల్లి రవిబాబు | .....11 |
| పుస్తక పరిచయం | : | "స్వయంసిద్ధ" కథాసంకలనం | – బి. సూర్యసాగర్ | .....13 |
| | | "ఫౌండేషన్స్ అండ్ పబ్లిక్ పాలసీ : ది మాస్క్ ఆఫ్ ప్లూరలిజం" | – జి.వి. భద్రం | .....19 |
| సినిమా సమీక్ష | : | రెండవ ప్రపంచ సినీ ఉత్సవం నుండి రెండు సినిమాలు | – బాలాజీ (కోల్‌కతా) | .....15 |
| జాతీయ అక్షరయోధులు | : | హబీబ్ తన్వీర్ | – సింగంపల్లి అశోక్‌కుమార్ | .....18 |
| స్పందన | : | సనాతన ధర్మ పునరుద్ధరణవాదులకు జవాబు | – ప్రసన్న | .....26 |
| కవితలు | : | నేతాజీ (**25**); ఏటూరి నాగేంద్రరావు (**27**); లలితానంద్ (**28**); ఈతకోట సుబ్బారావు (**29**); | | |
| పాట | : | ఉప్పెన (**29**) | | |
| వివిధ | : | ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**06**); సాహిత్య సాంస్కృతిక సామాజికాంశాలు (**32, 34**); చైతన్యవాహిని (**30**) ఈ పుస్తకాలు అందాయి (**33**); వార్తాసాహితి (**34**) | | |
| సంతాపాలు | : | హోమియో డాక్టర్ సోహన్‌సింగ్ (**04**) | | |



**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు ఫోన్ : 9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 70759 57010 prajasahithi1977@gmail.com

*రచనలు పంపవలసిన చిరునామా :*
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com



ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 0971-278X
LIBRARY OF CONGRESS
LCCN 94903393

**'ప్రజాసాహితి'**
**కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు**
**"అకౌంట్ నెం.**
***0680101004936***
***IFSC No. CNRB0000680***
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
**మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.**
**చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.**
డి.డి.లపై *'ప్రజాసాహితి, విజయవాడ'* అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
**1/4 డెమ్మీ పరిమాణం**

| | |
|---|---|
| **2వ, 3వ అట్ట మల్టీకలర్** | **రు. 20,000** |
| **లోపలి పూర్తి పేజి** | **రు. 15,000** |
| **లోపలి అరపేజి** | **రు. 7,000** |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# హోమియో డాక్టర్ సోహన్‌సింగ్ మరణం




**హోమియో** కింగ్‌గా ప్రసిద్ధి చెందిన డా॥ సోహన్‌సింగ్ తన 80వ యేట 2023 సెప్టెంబరు 22న హైదరాబాదులో మరణించారు. ఆయన కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త, బెల్లపు వేణుగోపాలరావు రెండో కుమారుడు. వారి స్వగ్రామం గుడివాడ దగ్గర రావులపాడు.

సోహన్‌సింగ్ బాల్యమంతా గుడివాడలోనే గడచింది. పియూసీ తర్వాత హోమియోపతీలో డిప్లొమా చదివారు. హైదరాబాదు ప్రభుత్వ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా చేస్తూ హోమియో వైద్యంలో క్రమంగా ఉన్నత స్థానానికి చేరారు. ఆయన భార్య విమల తాపీ రాజమ్మ, మోహనరావుల కూతురు. మోహనరావు తాపీ ధర్మారావు (తాతాజీ) కొడుకు. తాపీ రాజమ్మ ప్రజానాట్య మండలి కళాకారిణి. 1979లో సోహన్‌సింగ్ మెదడువాపు వ్యాధికి హోమియో మందు ఉచితంగా ఇచ్చి ఎందరినో కాపాడారు.

హైదరాబాదు హోమియో కళాశాలలో అధ్యాపకునిగా ప్రిన్సిపల్‌గా, సూపరింటెండెంట్‌గా పనిచేశారు. రామంతపూర్ ప్రభుత్వ హోమియోపతి వైద్యశాలలో తన సొంత నిధులు 20 లక్షలతో 80 పడకల ఆస్పత్రి నిర్మించి ఇచ్చారు.

తన కుమారుడు ధర్మకిరణ్ ఇంజనీరింగ్ చదువుతూ రోడ్డు ప్రమాదంలో మరణించగా, అతని పేరుమీద ధర్మకిరణ్ ట్రస్టు స్థాపించి రోగులకు తక్కువ ఫీజుతో వైద్యం చేసేవారు. దీర్ఘవ్యాధుల చికిత్సలో పేరొందిన వీరి వైద్యం కొరకు తెల్లవారుఝూమున 4 గంటల నుండి క్యూ కట్టేవారు.

తన తండ్రి వేణుగోపాలరావు, అత్తామామలు తాపీ రాజమ్మ మోహనరావుల అడుగుజాడల్లో వామపక్ష అభిమానిగా అనేక ప్రజాహిత కార్యక్రమాలకు ఆయన చేయూతనిచ్చేవారు.



సంపాదకీయం

# మహిళా రిజర్వేషన్ బిల్లు - ఎన్నికల వంచనాశిల్పం

**27** సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లు ఎట్టకేలకు దాదాపు ఏకగ్రీవంగా ఈనెల 20వ తేదీన పార్లమెంటులో ఆమోదం పొందింది. అయితే దాని నిజమైన అమలు ఎప్పుడు అన్నది నిర్దుష్టంగా లేదు. ఒక్క భాజపా పార్టీ వారికి తప్ప ఈ బిల్లు పార్లమెంటులో రాబోతోందని ఇతరులు ఎవరికీ తెలియనివ్వకుండా ప్రవేశపెట్టటంలోనే జిత్తులమారితనం అర్థమవుతుంది. అంతేకాక దాని అమలుకు అనేక మెలికలు చట్టంలోనే ఇమిడ్చారు. ఈ చట్టం ప్రకారమే మహిళలకు మూడవ వంతు రిజర్వేషన్ అమలు జరగాలంటే మరొక 10-15 సంవత్సరాలు ఎదురు చూడవలసి వచ్చినా ఆశ్చర్యం లేదు. వచ్చే సంవత్సరం జరగవలసి వున్న లోక్‌సభ ఎన్నికలకు ఖాయంగా వర్తించని ఈ చట్టాన్ని దాదాపు రహస్యంగా, ప్రత్యేక ఏజెండాగా, హడావిడిగా కొత్త పార్లమెంటు తొలిసమావేశంలోనే ఎందుకు తెచ్చినట్లు? వారు అనుసరిస్తున్న అభివృద్ధి నిరోధక విధానాలు, అవి పెంచుతున్న సామాజిక అసమానతల పట్ల ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని, వ్యతిరేకతను తగ్గించుకుందామనే ప్రయత్నంలో భాగంగా మహిళా ఓటర్లను ఆకర్షించే పథకం దీని వెనుక స్పష్టంగా ఉంది.

దేశానికి స్వాతంత్రం వచ్చిందని చెప్పి 75 సంవత్సరాలు గడిచిపోయినా పార్లమెంటులో మహిళల స్థానం (15%) నూటికి పదిహేను వంతులే. అదే అసెంబ్లీలలో అయితే దాదాపు 20 రాష్ట్రాలలో నూటికి పదివంతులు కంటే తక్కువ ఉన్నారు. ఇప్పటివరకు జరిగిన ఎన్నికలలో అన్ని పార్టీలు పోటీకి నిలిపిన మహిళా అభ్యర్థులు ఒక్కసారి కూడా నూటికి తొమ్మిది మందికి మించ లేదు. దేశ జనాభాలో దాదాపు నూటికి సగం మంది (50%) మహిళలు ఉండగా మూడో వంతు రిజర్వేషన్ (33%)లో ఔచిత్యం లేక హేతుబద్ధత ఏముంది? 27 సంవత్సరాల క్రితం అలా డిమాండ్ చేసి ఉండవచ్చు. ఇన్ని సంవత్సరాలు గడిచినా "50 శాతం సీట్లు మహిళలకు కేటాయించాలి" అనే డిమాండ్ ఒక బహుజన సమాజ పార్టీ సభ్యురాలు నుండి తప్ప పార్లమెంటులో వినిపించనే లేదు. ప్రధాన పాలక పార్టీలకు మహిళల హక్కుల పట్ల ఉన్న గౌరవం అలాంటిది! చేసిన చట్టం ఇచ్చిన రిజర్వేషన్ అమలులోకి రావడానికి సాధ్యమైనంత ఆలస్యమయ్యే విధంగా మెలికలు పెట్టటం, పాలక భాజపా ప్రభుత్వపు నిజాయితీ హీనతకు నిదర్శనం.

2024 ఎన్నికల అనంతరం జరిగే జనాభా గణన పిదప, దాని ప్రాతిపదికగా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ (delimitation) జరిపిన తర్వాత మహిళల రిజర్వేషన్ అమలుకి పూనుకుంటారట! అది కూడా 15 సంవత్సరాల పాటు మాత్రమే అమలులో ఉంటుందట!! చిత్తశుద్ధి లేని శివపూజలు చేయడంలోనూ, జిత్తుల మారి ఎత్తుగడలు పన్నటంలోనూ భారతీయ జనతా పార్టీకి మించిన వారు లేరా అన్నట్లు తయారైందీ బిల్లు. ఈ తరహా బిల్లును ఎవరు ఆకాశానికి ఎత్తగలరు!! ఆదాని, అంబానీల్లాంటి వారికి అమ్ముడుపోయి, మోడీకి భజన చేసే గోది మీడియా తప్ప!!!

2021లో పూర్తయి ఉండవలసిన జనాభా లెక్కింపు, కోవిడ్ పేరుతో కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసినప్పటికీ, అది తగ్గిన తర్వాత నిర్వహించి ఉండొచ్చు. 2031 దాకా సరికొత్త జనాభా లెక్కల కార్యక్రమం వాయిదా పడవచ్చు. దాని తదనంతరం చేపట్టే లోక్ సభ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో కర్ణాటక మినహా 100 లోక్‌సభ స్థానాలు కలిగిన మిగిలిన నాలుగు దక్షిణాది రాష్ట్రాలలో సుమారు 24 పార్లమెంటు సీట్లు కోల్పోయే విపత్తు పొంచి ఉంది. ఈ రాష్ట్రాలు భారతీయ జనతా పార్టీకి చాలా బలహీన స్థావరాలు అని అందరికీ తెలుసు. పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ఒక రాజకీయ వివాదమై మహిళల రిజర్వేషన్ బిల్లు మరింత వెనక్కి పోయే ప్రమాదం ఉంది.

భాజపావారు పూర్తి మెజారిటీతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత తొమ్మిదిన్నర సంవత్సరాల పాటు గమ్మున ఉండి, రానున్న ఎన్నికలలో అమలులోకి రాని ఈ బిల్లుని ఇంత హడావిడిగా తీసుకు రావడం వెనక, త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలలో గెలుపొందాలనే కుత్సితమే ఉంది తప్ప నిజాయితీ ఎంత మాత్రం లేదు.

లోక్‌సభలాగా రద్దుని ఎరగని రాజ్యసభలో 2010లో ఒకసారి ఆమోదం పొందిన ఇదే బిల్లుకు, 2014కు ముందు లోక్ సభ ఆమోదం లభించక పోవడం వెనుక, ఓ బి సి, మైనారిటీ వర్గాల మహిళలకు కూడా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ హక్కు ఈ చట్టంలోనే పొందుపరచాలి అనే బహుజనుల చిరకాల డిమాండ్ ఒక ముఖ్య కారణం. ఇన్ని సంవత్సరాలు గడిచిన తరువాత అయినా దాన్ని నేటి చట్టంలో భాజపా ప్రభుత్వం పొందుపరచకపోవడం వెనుక బ్రూట్ మెజారిటీతో ప్రదర్శిస్తున్న అగ్రవర్ణ ఏకపక్ష అనుకూలతత్వం తెలిసిపోతోంది.

మహిళా రిజర్వేషన్ బిల్లుకు పెట్టిన హిందీ పేరులోనే భూస్వామ్య పితృస్వామిక కంపు మిళితమై ఉంది.

భగవంతుని తరఫున మతం మాట్లాడినట్లు, మహిళల తరఫున పురుషులు మాట్లాడటం లాగా ఇది ఉంది. "నారీశక్తి వందన్ అధినియం"లో అధినియం అంటే చట్టం. వందన్ అంటే స్తుతి (ప్రార్థన) అని అర్థం. బిల్లుపై జరిగిన చర్చలో హోంమంత్రి అమిత్ షా ఇలా అన్నారు "తమ అక్క చెల్లెళ్ళ, తల్లుల సంక్షేమం గురించి ఆలోచించటం మాట్లాడటం

అనేది ఈ దేశపు సాంస్కృతిక వారసత్వం." దీనికి దీటైన జవాబు డిఎంకె సభ్యురాలు కనిమొళి ఇచ్చారు. "మాకు (మహిళలను) మొక్కటాన్ని ఆపండి. ఎవరి ఆధారం మీదనో మేము నిలబడాలని అనుకోవడంలేదు. మమ్ము ప్రార్థించాలని మేము భావించటం లేదు. మేము సమానులుగా గౌరవం పొందాలని కోరుకుంటున్నాము". కాలంచెల్లిన "న స్త్రీ స్వాతంత్ర మర్హతి" తరహా భావాలకు ఇది స్పష్టమైన సూటి జవాబు.

ఇక దేశ ప్రధాని నరేంద్ర మోడీ "ఈ చట్టం చేయించే అవకాశం భగవంతుడు తనకు ఇచ్చినట్లు" చెప్పుకున్నారు. బిల్ కీస్ బాను, ఉన్నావ్, హత్రాస్ సంఘటనలలో మహిళలపై అత్యాచారాలు జరిగిన సమయంలోనూ, మణిపూర్‌లో మహిళలపై జరిగిన దురాగతాల పట్లనూ మౌనంగా ఉండమని దేవుడు ఆదేశించాడని ప్రజలు అనుకోవాలేమో! మహిళా మల్ల యోధులు తమను వేధించారని ఆరోపించిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ని పార్లమెంటులో తమ కనుసన్నలలో నిలుపుకోమని కూడా దేవుడే చెప్పాడేమో!! మహిళా రిజర్వేషన్ బిల్లు లాంటి పుణ్య కార్యాలతో తాము చేసిన ఎన్ని పాపాలయినా ప్రక్షాళన అయిపోతాయేమో!!!

రాజ్యాంగ చట్టంలో ఉన్న ప్రజా అనుకూల అంశాలను పాలకవర్గాలు తమకు అనుకూలంగా మలుచుకోవడంలో గొప్ప నిపుణత పొంది ఉన్నారు. బలహీన వర్గాలకు కల్పించిన రిజర్వేషన్లతోనే వారి సమస్యలన్నీ పరిష్కారమైపోతాయన్నట్లు ఒకవైపు భ్రమలు కల్పిస్తూనే, మరొకవైపు అదే రిజర్వేషన్ల పేరుతో ప్రజా సమూహాల నడుమ వైరుధ్యాలు, చీలికలు తెచ్చిపెట్టడం వారికి వెన్నతో పెట్టిన విద్య. మణిపూర్‌లో కుకీ తెగలకు మెయిటీ జాతికి నడుమ విద్వేషాలు రగుల్కొల్పింది రిజర్వేషన్ల పేరుతోనే! నేడు ఆమోదం పొందిన ఈ చట్టాన్ని కూడా రేపు అలా తమకు అనుకూలంగా వాడుకోరని చెప్పలేము. పెరిగిపోతున్న మహిళల శ్రమ దోపిడి, విపరీతంగా పెరుగుతున్న లైంగిక దోపిడి – అత్యాచారాలు, విలాస, వ్యాపార వస్తువులుగా, సెక్స్ సింబల్స్‌గా వాడుకుంటున్న తీరులు, వివిధ రూపాల పితృస్వామిక అణచివేతలు, ఈ చట్టంతో కొట్టుకుపోతాయని భ్రమలపాలు చేయడం కూడా పాలకవర్గాల వారి మీడియా శక్తుల కుయుక్తులలో భాగమే! మహిళల జీవితానికి భద్రత లేకుండా చేస్తున్న మాదకద్రవ్యాలు (డ్రగ్స్), మద్యం వ్యాపారాలనైనా అదుపు చేయని పాలకులకు మహిళల ఓట్లు మీద తప్ప మరొక ఆసక్తి లేదు.

గడచిన 70 సంవత్సరాలుగా ఎన్నికల వ్యవస్థను దిగదార్చుకుంటూ రాగా.. రాగా.. ఈరోజు ఆర్థికంగా సంపన్నులు, సామాజిక అసాంఘిక శక్తులు , కుల మత ఉన్మాదాలను ఓట్ల కింద మార్చుకునేవారు తప్ప ఎన్నికల ప్రక్రియలో నిలువ లేని పరిస్థితులు దాపురించాయి. వీటిని ఎదుర్కొని ఎన్నికలలో గెలుపొందగల మహిళలు మాత్రమే పార్లమెంటులో ప్రవేశించగలరు.

కొన్ని రాష్ట్రాలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు ఇప్పటికే అమలు జరుగుతున్న స్థానిక పంచాయతీరాజ్ ఎన్నికల అనుభవాలు దేశం ముందు ఉన్నాయి. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులుగా ఎన్నికవుతున్న అత్యధిక మహిళలపైనలనే, నేటి రిజర్వేషన్‌తో గెలుపొందేవారిపైన కూడా పితృస్వామిక ఆధిపత్యం కొనసాగదని ఎవరూ చెప్పలేరు. ఇవన్నీ ఉండగానే పైన పేర్కొన్న సాంస్కృతిక విధ్వంసం కొనసాగుతూ ఉంది. ఈ పరిస్థితులను మొత్తానికి మొత్తంగా మార్పు చేసుకోవాల్సిన కర్తవ్యం మహిళలకు అత్యంత కీలకమైనది. పాలక ముఠాల భ్రమల నుండి ప్రజలను విముక్తి చేయవలసిన ఉద్యమ బాధ్యత మహిళలు చేపట్టవలసి ఉంది. "ఆధునిక మహిళలు చరిత్రను తిరగ రాస్తారు" అని గురజాడ వంద ఏళ్ల క్రితం చెప్పిన మాటలు నేటికీ విలువైనవే!!

**26-9-2023** ✺

## ముప్పై ఏళ్ళక్రితం ప్రజాసాహితి

## సంపుటి : 17, సంచిక : 03, అక్టోబర్ 1993

**'మరట్వాడా** భూకంపం వచ్చి వెళ్ళేక....' అనే ముఖచిత్రంతో 'ప్రకృతి విపత్తు – ప్రభుత్వ నిర్లక్ష్యం' అనే సంపాదకీయంతో ఈ సంచిక వెలువడింది. డా॥ బాలగోపాల్ ప్రసంగవ్యాసం 'డంకెల్ ముసాయిదా నేపథ్యం' మిగతా భాగాన్ని ఈ సంచికలో ప్రచురించారు. కాసుల ప్రతాపరెడ్డి రాసిన 'నడుం నొప్పి' కథనూ, ఓల్గా 'రాజకీయ కథలు'పై "స్త్రీల జీవిత రాజకీయాల కథలు" అనే సమీక్షా వ్యాసాన్ని కాత్యాయని రాయగా, ఫెమినిస్టు "రాజకీయ కథలు" అనే వ్యాసాన్ని డా॥ బి. సూర్యసాగర్ రాశారు. బజరా రాసిన '$(a+b)^2=(a-b)^2$' గల్పికనూ డా॥ రామకోటిశాస్త్రిగారి రెండవ వర్ధంతి (అక్టోబర్ 28) సందర్భంగా – కౌతవరపు రామకోటి రాసిన "మేధావి వర్గాలు, దృక్పథాలు" అనే వ్యాసాన్నీ, ఏఐఎఫ్‌టియు, నౌజవాన్ భారత సభల ఆధ్వర్యంలో సెప్టెంబరు 29, 30 తేదీల్లో లక్నోలో జరిగిన 'సామ్రాజ్యవాద వ్యతిరేక, మతతత్త్వ వ్యతిరేక' సదస్సుకు సమర్పించిన 'మతతత్త్వ సంస్కృతి' అనే దివికుమార్ ప్రసంగవ్యాసాన్ని ప్రచురించారు. సురేష్ రాసిన 'దీపస్తంభం', మిత్ర రాసిన 'నీ కోసం, నా కోసం, మనందరి కోసం' కవితలనూ రసూల్ రాసిన 'రాముని పేరుతో' పాటనూ ప్రచురించారు. రెండవ, మూడవ కవర్‌పేజీల్లో కొత్తపల్లి రవిబాబు అనువాదం చేసిన "స్వేత హస్తమా – నల్లని చేయి" గ్రీకు కవితనూ, నాల్గవ కవరు పేజీలో మహారాష్ట్ర భూకంప బాధితుల సహాయార్థం విరాళాలకై జనసాహితి చేసిన విజ్ఞప్తిని ప్రచురించారు.

1/8 డెమ్మీలో 64 పుటలు; వెల : రూ. 5/– ✺

కథ

# అనామికగా ఇక ఏమాత్రం వుండను

ఇంగ్లీషు మూలం : రమణికా గుప్తా

తెలుగు : కొత్తపల్లి రవిబాబు

**నేనొక** స్త్రీని. నా పేరేమిటో నాకు తెలియదు. నిజానికి ప్రపంచంలో ఏ స్త్రీకి తన పేరేమిటో తనకు తెలియదు. ఎందుకంటే ఆమె పేరుతో సాధారణంగా ఎవరూ ఆమెను పిలవరు. కేవలం ఆమె రక్త సంబంధీకుల బంధుత్వం ద్వారానో, భౌగోళిక పరిమితుల ద్వారానో మాత్రమే ఆమె గుర్తింపబడుతుంది. ఆమెకు ఒక పేరు ఇవ్వకపోవడమనేది కుట్రపూరితంగా జరిగిందని చెప్పవచ్చు. కనుకనే నాకు పేరు లేదు.

అయితే నాకు పేరు పెట్టుకోవాలనే ఆసక్తి ఇటీవల కలిగింది. కానీ ఏ పేరు? ఏదైనా శబ్దకోశం చూడాలేమో! దానిలో నేను పేరు పెట్టుకోడానికి అవసరమైన కొన్ని పదాలైనా దొరుకుతాయి. వేదాలలో, పురాణాలలో చూస్తే ఎవరైనా పేరు పెట్టుకున్న వనితలు కనబడవచ్చు.

చరిత్రలోకి వెళ్తే ప్రసిద్ధులైన అసాధారణమైన అతివల పేర్లు కనబడవచ్చు. ఇంకా తీవ్రంగా ఆలోచించడం మొదలుపెడితే ఆకాశంలో చుక్కలు అక్షరాల్లా కనిపించ సాగాయి. వాటిని అటూ, ఇటూ పేర్చి కొన్ని పదాలు తయారుచేసి నాకు కావాల్సిన పేరు కోసం వెదకటం మొదలెట్టాను.

ఆ విధంగా మొట్టమొదట రూపొందిన పదం 'ఈవ్'. ఈమె పురుషునికి నిషిద్ధ ఫలాలిచ్చి దోషిగా నిలబడింది. ఆ ఫలాన్ని రుచి చూసినవాడు దోషి కాదు. ఆ ఫలాన్ని ఇచ్చిన ఆమె దోషి! ఈ పేరు లాభం లేదు. నాకు కావాల్సిన పేరు కోసం వేరే చోట వెదకాలి.

ఒక ఎడారిలోని సుడిగాలిలో గిర్రున తిరుగుతూ కన్పించింది ప్రవక్త మహమ్మదు కూతురి పేరు 'ఫాతిమా.' ఈమె చాలా ధైర్యశాలి. తన నాన్నను రక్షించుకోడానికి ఎంత ప్రమాదాన్నైనా ఎదుర్కొనడానికి ఏ మాత్రం సందేహించలేదు. అయితే అది ఒక కూతురుకు సంబంధించిన కథ. ఒక స్త్రీది కాదు. అది బంధుత్వపు కథ. అక్కడ స్త్రీ ఎక్కడ?

సామాజిక కట్టుబాట్లను ధిక్కరించి 'మేరీ' జీసస్‌కు జన్మనిచ్చింది. అందుకు ఆమెను పొగిడారు. నిజానికి మేరీ ఒక దోషి. ఒక వ్యభిచారిణి. ఆమె కొడుకు జీసస్ కాకపోతే ఆమె పేరు ఈనాడు ఎవరికి తెలిసేది? ఆమె కూడా తీవ్రమైన శిక్షకు గురి అయ్యేది.

నేను ముందుకు సాగాలా? గతంలోకి తిరిగి వెళ్లాలా? నేనొక డోలాయమానమైన స్థితిలో వున్నా. అప్పుడు గాలి నా చెవిలో గుసగుసగా చెప్పింది 'నీవు సీత పేరు పెట్టుకో' అని. గాలి కూడా స్త్రీ లింగమే. అది ఒక పేరును నా చెవిలో వూది మరుక్షణం అదృశ్యమైంది.

సీత పేరా! ఓహో! ఆ సీతా! రాముడి ముందు తన పవిత్రత నిరూపించేందుకు నిప్పుల్లో దూకిన ఆవిడా! తన కొడుకులు రాముణ్ణి ఓడించి, హనుమంతుణ్ణి ఖైదు చేయగా, ఆ కొడుకులు రాముడికే పుట్టారని ఋజువు చేయడానికి భూమాతకు విజ్ఞప్తి చేసినావిడే కదూ ఆవిడ? భూమి కూడా మరి స్త్రీ యేగా. ఆమె గుండె వ్రక్కలై, సీతను తనలో కలుపుకుంది. సీత ఆ విధంగా పోరాటరంగం నుంచి తప్పుకుంది. కనుక ఆ పేరు వద్దు.

అంతేకాదు. ఇదంతా వాల్మీకి కుట్ర అన్న విషయం సీత గాని, భూమాత గాని అర్థం చేసుకోలేకపోయారు. రాముడు నిర్దేశించిన ప్రమాణాలను పొగడటానికి వాల్మీకి సీత తన తల్లి వొడిలో చేరిందని రాశాడు. పురుషుడు సృష్టించిన ఈ వ్యవస్థపై సీత మనసులో కూడా నమ్మకం తొంగి చూస్తూ వుంది. లేకపోతే ఆమె తన ఇద్దరు కుమారులతోనో లేక తాను ఒక్కతే పోరాడి వుండేది. రాముడిపై విజయం సాధించ గలిగేది. ప్రజల సానుభూతిని గెలుచుకునేది. రాముడి ముసుగు తొలగిపోయేది. సీత తాను కేవలం స్త్రీననే గాక ఒక మనిషినన్న విషయం మరిచిపోయింది. మానవత్వం కంటే సామాజిక నియమాలకే ఆమె ఎక్కువ విలువను ఇచ్చింది. మానవుల మానవత్వాన్ని కురుచ బరిచింది. తన అస్తిత్వ బలాన్ని తక్కువ అంచనా వేసింది. లేదు గుడ్డి ఆరాధనతో విధేయతతో వ్యవహరించిన ఆమె పేరును నేను పెట్టుకోలేను.

నా పేరు కోసం కుస్తీ పడుతుండగా 'ద్రౌపది' నా తలుపు తట్టింది. ఆమె చాలా ధైర్యవంతురాలు. జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకోవడం ఆమెకు బాగా తెలుసు. అయితే తన అభీష్టానికి వ్యతిరేకంగా కుంతి ఆదేశం ప్రకారం ఐదురుగురిని భర్తలుగా స్వీకరించడం ద్వారా ఆమె తనలోని స్త్రీ మనస్తత్వాన్నే గాక మొత్తం స్త్రీత్వాన్నే గాయపరిచింది. ఆమె అర్జునుడిని ప్రేమించింది. మరి ఇతరులను ఎందుకు అంగీకరించింది? తనకు జరిగిన అవమానానికి ప్రతీకారం ఐదుగురు పాండవుల ద్వారా తీర్చుకోడానికి పన్నిన వ్యూహమా అది? కాదు. ఆమె వస్త్రాలపహరిస్తుంటే ఆ అయిదుగురూ మౌనంగా చూస్తూ వుండిపోయారు. అయినా వారిని సహించింది. తనను రక్షించడానికి ఒక పురుషుడిని వేడుకుంది. ఆమె తనంతట తానే పోరాడగలదు. తమపై పోలీసులు చేస్తున్న లైంగిక దాడులను నిరసిస్తూ భారతదేశా న్నంతటినీ కుదిపివేసిన మణిపూరు మహిళలు నగ్న ప్రదర్శన చేసినట్లు తానూ చేయగలదు. ఆ ప్రదర్శనతో హిమాలయాల నుండి

కన్యాకుమారి వరకు దేశం అణువణువూ అవమానింపబడింది. ద్రౌపది బట్టలు విప్పేసి నగ్నంగా నిలబడివుంటే దుర్యోధనుడూ అతని దర్బారూ అవమానంతో సిగ్గు పడి వుండేవారు కదా. కానీ పాండవులైదుగురూ తాను ప్రేమించిన అర్జునుడితో సహా ఆమెను ఒక వస్తువుగా, ఒక ఆస్తిగా పరిగణించారు. కనుకనే ఆమెను పందెంలో ఒడ్డారు. ఈ పిరికివాళ్ళను వదిలి వెళ్లిపోతే వాళ్ళకు పెద్ద అవమానంగా వుండేది కదా.

ద్రౌపది పేరును నా ఆలోచనలనుండి వెనక్కు నెట్టేశాను.

'సావిత్రి' లాంటి పేర్లు ఆ ఆలోచనా పరిధిలోనే లేవు. ఎందుకంటే ఈ సావిత్రులు తమ భర్తలు లేకుండా తమకు అస్థిత్వం లేదనుకుంటారు. కానీ నేను స్త్రీ అస్తిత్వాన్ని విశ్వసిస్తాను. కనుకనే ఆమె అస్థిత్వం కోసమే ఒక పేరు కోసం వెదుకుతున్నాను.

సొంత నిర్ణయాలు తీసుకున్న 'రజియా'ను చంపివేయడం భయంకరమైన విషయం. ఆమె చరిత్రలో ఎక్కడో అదృశ్యమైంది. ఆమెకు సరితూగగల మరో రజియా నాకు ఎక్కడ కనబడలేదు. కానీ రజియా పేరు ఒక స్త్రీ ఉనికికి, అస్తిత్వానికి, తన నిర్ణయాల ఫలితాలు తానే అనుభవించడానికి ఉదాహరణగా నిలుస్తుంది.

సరిగ్గా ఆ సమయంలో శివపార్వతులిద్దరూ పరస్పరం వాదించుకుంటూ వచ్చారు. శివుణ్ణి పెళ్లి చేసుకోడానికి పార్వతి తన తండ్రిపై తిరుగుబాటు చేసింది. శివుడు ఒకసారి సుదీర్ఘకాలంపాటు ఎటో వెళ్ళిపోయాడు. అప్పుడు శివుని కోసం వేచి వుండకుండా పార్వతి గణేశుని తలుపు దగ్గర కాపలా పెట్టింది. పురాణాల ప్రకారం ఆమె చర్మంపై 12 ఏళ్లపాటు పేరుకుపోయిన మట్టితో ఒక విగ్రహం తయారుచేసి తన స్నానాలగది బయట పెట్టింది. కొన్నేళ్ళ తరువాత శివుడు తిరిగి వచ్చాడు. గణేశుడు శివుణ్ణి ఆపాడు. 'మా అమ్మ స్నానం చేస్తోంది. లోపలికి వెళ్లకూడదు.' అంటూ అటకాయించాడు. శివుడు నొసలు చిట్లించి 'ఇన్నేళ్లుగా నేను ఇక్కడ లేను. నాకు నీవు కొడుకెలా అవుతావు? అంటూ వాడి తల నరికేసాడు. తల తెగిన గణేశుని చూసి పార్వతి కోపం కట్టలు తెంచుకుంది. నరికివేసిన తల కాకుండా ఒక ఏనుగు తల తెచ్చి గణేశుకు అతికించి బతికించాల్సి వచ్చింది. తన శరీరంపై 12 ఏళ్ల పాటు పేరుకుపోయిన మట్టితో తయారైన కొడుకు తన అస్థిత్వంలో ఒక భాగమని నమ్మింది. భర్త వీర్యం ద్వారా మాత్రమే పిల్లలను కని తీరాలనే సూత్రం ఆమెకు అంగీకారయోగ్యం కాదు. వీర్యం ఎవరిదైనా కావచ్చు. స్త్రీ గర్భకోశం మాత్రం ఆమె సొంతం. అమ్మ అనేది వాస్తవం. నాన్న అనేది నమ్మకం.

ఈ విషయంలో పార్వతి స్త్రీని, గర్భకోశాన్ని, స్త్రీగా వుండే గర్వాన్ని పురుషునితో సమానంగా నిలిపింది. ఆమె శివుడికి సేవకురాలు కాదు. భర్తను యమలోకం వరకు అనుసరించిన సావిత్రిలాగా, విష్ణువు ఒడిలో కూర్చుని భర్తకు అంకితమైన లక్ష్మిలాగా లేదు. ఆమె సతీ కాదు. సావిత్రి కాదు. శివుడికి భార్య అయినా బానిస కాదు. ఆమె తన జీవితం పార్వతిలాగా గడిపింది. శివుడితోపాటు ఆమె కూడా నందిపై స్వారీ చేసింది. భూమిపై జరిగే అన్యాయాలు చూస్తూ పార్వతి అవసరమైనవారికి వరాలు ఇవ్వమని శివుడికి చెబుతూ వుంటుంది.

కనుక పార్వతి పేరు పెట్టుకుందామా అనిపించింది. కానీ నా అంతరాత్మ తొందర పడవద్దని వారించింది. ఒక తప్పు పేరు ఎన్నుకున్నట్లైతే నీ మొత్తం ప్రయాణం విఫలమౌతుంది.

ఆ సమయంలో వాసుదేవుడి ఎనిమిదో శిశువు, ఆడపిల్ల గట్టిగా అరిచింది. కృష్ణుడిని రక్షించడానికి ఆమెను మార్పిడి చేశారు. ఆమె ఇలా అంది : 'శివుడేమీ అమాయకుడు కాదు. అతనికీ పురుషాహంకారం వుంది. శివుడు పార్వతిని పలుసార్లు మోసం చేశాడు. ...నేను కూడా పురుషుల కుట్రకు బలైనదానినే.... కృష్ణుడికోసం నేను చనిపోవాల్సి వచ్చింది.'

శివుడి అహంకారం గురించిన రహస్యం ఒకటి అతని కాలిగజ్జె నాతో చెప్పింది. పార్వతిని ఒక ప్రదేశం నుంచి వెళ్ళగొట్టడానికి తాండవ నృత్యం చేస్తూ ఆమెను వెంటాడినప్పుడు ఆ గజ్జె వూడిపోయి వుండవచ్చు. అబ్బ! అది ఎంత అద్భుత దృశ్యం! పార్వతి తన లాస్య నృత్యంతో అందర్నీ ముగ్ధులను చేస్తోంది దేవుళ్ళందరూ తన్మయత్వంతో ఆనందిస్తున్నారు. శివుడి అహం బహిర్గతమౌతోంది. అతడిలో అసూయ చోటుచేసుకుంది.

'నాట్యంలో పార్వతికి ఎక్కువ పాయింట్లు వస్తాయేమో! ఆమె గెలిచి నేను ఓడిపోతానేమో!

అది అసాధ్యం.,' అనుకుంటూ సుడిగాలిలా ఒకే కాలుపై గిర్రున తిరగడం మొదలెట్టాడు. దుమ్ము ఆకాశాన్ని అంటుకుంది. దేవుళ్ళందరూ నిశ్చేష్టులయ్యారు. అయినా పార్వతి తన నాట్యాన్ని, ప్రేమను కురిపిస్తూ కొనసాగించింది. శివుడి అహంకారాగ్ని ముందు ప్రేమకు చోటు ఏది? పార్వతి అక్కడి నుండి వెళ్లలేదు. ఆమెను వెళ్లగొట్టడానికి ఇక శివుడు నగ్ననృత్యం చేయసాగాడు!

అప్పుడు పార్వతి ఆ చోటును వదలి పారిపోయింది. అశ్లీలాన్ని ఆమె భరించలేదు. శివుడి కాలికి వున్న గజ్జెల్లో ఒకటి వూడి దూరంగా పడి మౌనంగా వుండిపోయింది.

'మరి నేనేమి చేయాలి? గాఢాలోచనలో పడ్డాను.

'పార్వతి ఎందుకు పారిపోయింది? పదే పదే ఆ మువ్వను అడిగాను. 'అక్కడి అశ్లీలానికి ఆమె జవాబియ్యలేదెందుకని? ఈ పురుషాహంకారం నేనొక పేరును ఎంచుకోడానికి అనుమతినీయదా? ఈ పురుషాహంకారమేనా స్త్రీగా నన్ను పేరులేనిదానిగా చేసింది?

కనుక ఇప్పుడు నేను ఏ పేరు పెట్టుకోవాలి? తెల్లారింది కానీ నేను పెట్టుకోడానికి ఏ పేరూ దొరకలేదు. మళ్ళీ ఒకసారి పేరు కోసం వెదుకులాట మొదలెట్టాను. ఏదో ఒక రోజు తప్పనిసరిగా ఒక పేరు నాకు దొరుకుతుంది. ఎన్నో ఉదయాలు ఇలా గడుస్తుంటాయి. నాపై నాకు విశ్వాసం వుంది. పేరు లేకుండా మాత్రం ఇక ముందు కొనసాగనంటే కొనసాగను.✺

తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట సాహిత్య పరిచయం-1 :

# రేసులు చింపిన విస్తరి

## 'మలగనిబత్తి' నవల పరిచయం

- బి.వి.ఎన్. స్వామి

భారతదేశపు రైతాంగ పోరాటాల చరిత్రలో తెలంగాణా సాయుధ పోరాటం ముఖ్యమైనది. నిర్మాణాత్మక కృషిలో, పోరాట విస్తృతిలో, సైద్ధాంతిక దృక్పధాల సంఘర్షణలో, విశాల ప్రజారాసుల భాగస్వామ్యంలో విలువైన అనుభవాలను అందించిన పోరాటం అది. దేశవిభజన కాలపు ప్రజాజీవితాలపై విడుదలైన అతి ఎక్కువ సాహిత్యం తర్వాత తెలంగాణా పోరాటంపై కూడా చాలా ఎక్కువ సాహిత్యమే వెలుగుచూసింది. ఈ రెండు సందర్భాలు కూడా కోట్లాదిమంది జీవితాలతో ముడిపడి ఉండడమే కాకుండా రెండు మూడు తరాలను ప్రభావితం చేసినవి. ఇప్పటికీ ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. ఆనాటి ప్రజల జీవితాల్లోని ప్రతి మలుపుని అక్షరీకరించిన విలువైన సాహిత్యాన్ని కొత్త తరాలకు అందించే సాహిత్యోద్యమ బాధ్యతను జనసాహితి చేపట్టింది. 1981 జులై, ఆగస్టు 'ప్రజాసాహితి'ని తెలంగాణా సాయుధ పోరాట సాహిత్య ప్రత్యేక సంచికగా వెలువరించింది. 2007లో అదే సంచికను పునర్ముద్రించింది. ఆ పోరాటాన్ని గానంచేసిన అన్నాభావూ సాథేని తెలుగు సామాజానికి పరిచయం చేసింది. పూజారిగా వుంటూ ఈ పోరాటంలో కీలక పాత్రపోషించిన పణిహారం రంగాచారి చరిత్రను వెలుగులోకి తెచ్చింది. కథా సంకలనాన్ని ప్రచురించింది. జనసాహితి జంటనగరాలశాఖ ఆధ్వర్యంలో నవాలాసాహిత్య పరిచయాలను పుస్తకంగా వెలువరించింది. తెలంగాణా పోరాట చరిత్రపై విషం కక్కుతూ పాలకవర్గాలు సాగిస్తున్న ప్రచారాల నేపథ్యంలో నవలా పరిచయాలను వీలువెంబడి ప్రచురించే ప్రయత్నం చేస్తాం - సం॥)

**స్వాతంత్ర్యానంతరం** తొలిదశ భారతంలో కాంగ్రెస్ పాలనాపగ్గాలు చేపట్టాక ఉద్యమాలు తగ్గుముఖం పట్టాయి. కాని హైదరాబాద్ రాజ్యంలో మాత్రం రెట్టింపయ్యాయి. కేంద్ర ప్రభుత్వ పాలన సంస్థానాల్లోకి రాలేకపోయింది. నవాబు రాజ్యంలో భారత జెండా రెపరెపలాడలేదు. ఆ మేరకు ఇక్కడి ప్రజలు అస్వతంత్రులు. స్వతంత్రం కోసం ఉవ్విళ్ళూరారు. నిజాం స్టేట్‌లో పాలన అణచివేత పునాదిగా సాగింది. నిజాం స్టేట్‌లో పాలకుల అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాటాలు సాగాయి. నిజాం పోలీసులు, రజాకార్ల సహాయంతో దొరలు, దేశ్‌ముఖ్‌లు గ్రామాల్లో అరాచకాలు సృష్టించారు. నిజాం అధికారానికి వెన్నెముకగా దొరలు, దేశ్‌ముఖ్‌లు నిలవడం, వారిని పావులుగా వాడుకొని నిజాం అధికారం చెలాయించడం జరిగింది. ఈ క్రమంలో ఇరువురు కలిసి గ్రామాల్లోని ప్రజలకు నరకాన్ని చూపించారు. ఆ క్రమంలో వేలాదిమంది మరణించారు. ప్రతీ మరణం పోరుబాటను మరింత ఎరుపెక్కించింది. భూమి కోసం జరిపిన పోరాటం దొరల, దేశ్‌ముఖ్‌ల అహంను రెచ్చగొట్టింది. దాంతో వారు దమనకాండకు పూనుకున్నారు. దాన్ని ఎదుర్కోవడానికి సంఘం ఏర్పడింది. గ్రామ రాజ్య నిర్మాణం కోసం సంఘం ప్రజల్ని సాయుధుల్ని చేసింది. తుపాకి పట్టటం నేర్పింది. ఆత్మాభిమానం అందించింది. అలా ఒకొక్కరు గెరిల్లాలుగా మారినారు. ప్రతీ గెరిల్లా ఒక్కో ఊరిని ఏకతాటిపైకి తెచ్చారు. ఆ ఊరి గడీకి సమాంతరంగా ప్రజారాసులు కొలువుతీరాయి. ముఖాముఖి యుద్ధం జరిగింది. ఆనాటి యుద్ధం నిజాంను గద్దె దింపేంతవరకు సాగింది. తెలంగాణ యుద్ధ భూమిగా మారింది. ఓపికగా రాయపూనుకుంటే ఆనాటి ప్రతి ఊరు దుఃఖం ఒక నవలగా మారుతుంది. యాతన పడుతున్న ఊర్లన్నీ ఒక నమూనాగా దర్శనమిస్తాయి. ఆ నమూనా పేరు తెలంగాణ. అలాంటి తెలంగాణలో తిమ్మాపురం ఒక ఊరు. అక్కడ అంటుకుంది మలగనిబత్తి. పోరాట విరమణ తరువాత వచ్చిన నవలల్లో 'మలగనిబత్తి' నవల ఒకటి. ఆనాటి పోరాటంలో జరిగిన ఒకటి రెండు సంఘటనలను, అవసరాన్ని బట్టి వాడుకోవడం జరిగింది అని రచయిత నిజాయితీగా సెలవిచ్చాడు. రాజన్నలాంటి వీరుల్ని తలచుకోవడం, స్ఫూర్తి పొందడం తెలంగాణకు తప్పనిసరి. ఆ క్రమంలో వచ్చిందే 'మలగనిబత్తి'.

ఒక స్త్రీని ఉద్దేశించి "వీడు నాకు పుట్టిండా, నీ మొగనికి పుట్టిండా?" అని ప్రశ్నించడం.

"నాకెట్ల తెలుస్తది దొర" అంటూ కన్నీటిని ఆ స్త్రీ దిగమింగటం.

"సరే తీ బూమిల ఎవడు ఇత్తనం నాటినా గది మొక్కై మొలుస్తది" అని దొర జవాబు చెప్పడం.

ఈ తతంగం అంతా దేన్ని సూచిస్తుంది?

పెనం మీంచి పొయ్యిలో పడ్డ హృదయం, కండకావరంతో మదమెక్కిన దొరతనం ఒకేసారి పై సంభాషణల్లో కనిపిస్తాయి. ఈ సన్నివేశానికి తెలంగాణ వేదికయింది. ఆ స్త్రీ మూర్తి కన్నకొడుకు పుట్టిన ఊరును, కన్నతల్లిని విముక్తం చేసిన తెలంగాణ సాయుధ విప్లవ వీరుడయ్యాడు. ఇతని తండ్రి "నీ బాంచెన్ కాల్మొక్త" అనుకుంటూ బతికిన బానిసగాను, దొరతనం ఒక రాచపుండుగాను తెలంగాణ చరిత్రలో మిగిలిపోయాయి. ఇక్కడ జీవితం, పోరాటం పెనవేసుకొని సాగినయి. పొయ్యి మీది పొంగు ఆవేశంగాను, పొయ్యిలో పడ్డ నురగ త్యాగంగాను మారి మార్పుకు దోహదపడింది. ఇలాంటి విషయాలు గాథలుగా తెలంగాణలో వినిపిస్తాయి. ఇప్పటికీ మలగని బత్తిలా వెలుగుతూ స్ఫూర్తినిస్తాయి. సంఘటనలు కథలుగా, కథలు నవలలుగా మారి సాహిత్య చరిత్రలో చోటుచేసుకుంటున్నవి. ఆ కోవలోకి ఎస్.ఎమ్. ప్రాణ్‌రావ్ కలం నుండి జాలువారిన 'మలగనిబత్తి' నవల చేరింది.

తిమ్మాపురంలో జరిగిన పోరును ప్రధానంగా చేసుకొని నవల సాగింది. అనేక తిమ్మాపురాల కూడలి తెలంగాణ. ఒక్కో ఊరులో ఒక్కో రాజన్న నిలిచి తెలంగాణ గ్రామాల్ని విముక్తం చేసారు సీనయ్య-చంద్రమ్మ దంపతులు. చంద్రమ్మ చక్కని చుక్క. సీనయ్య దొర పాలేరు. దొర కన్ను చంద్రమ్మ మీద పడింది. అలా ఆమె మనసొకరితో, తనువొకరితో పంచుకుంటూ జీవచ్ఛవంలా బతికితే, సీనయ్య దొర

వద్ద పనిచేస్తూ అవిటివాడై, ఔసిపోయిన హృదయంతో బతుకీడ్చాడు. వీరి కొడుకే రాజన్న. ఆరవ తరగతి వరకు చదివిన రాజన్న ఈ ప్రాంతానికి అందివచ్చిన గెరిల్లా. జన్మభూమి సంకెళ్ళను తెంచిన అమరుడు. కమ్యూనిస్టులు, రజాకార్లు, దొర, నిజాం అనే వాస్తవ పాత్రలు తమ తమ పరిధుల్లో విషయాన్ని తేటపరిచాయి. ఆడబాప, తాసీల్దార్, అమీన్, శెగెదార్, గుమస్తా మొదలయినవారు వ్యవస్థ నిర్మించిన పరాన్నజీవులు. అయినా వీరి ఆగడాలు చెప్పనలవికాదు. వీరు అధికారానికీ వెన్నెముకగా నిలిచి, పీడనను కొనసాగించిన పనిముట్లు – కొమురం భీం, బందగీ, చాకలి అయిలమ్మ, దొడ్డి కొమురయ్య, యాదగిరి లాంటి పేర్లు నవలలో పోరాటానికి ఆజ్యం పోసిన జ్ఞాపకాలు. రాజద్రోహం, ప్రజాద్రోహం, పేదల రాజ్యం, దొరల రాజ్యం, సల్తనట్ – ఆసిఫియా ఇస్లామియా అనే భావనలను రచయిత సందర్భానుసారంగా విడమరచి చెప్పడం వల్ల జరుగుతున్న తతంగం నిరక్షరాస్యులైన ప్రజలకు అవగతం అయింది. ఫలితంగా సంఘం రూపుదాల్చింది. ఆ క్షణాన "నా బిడ్డల గుత్పల సంఘం నా కడుపున పుట్టిన కట్టెలు ఇచ్చిన నా రుణాన్ని ఇన్నాళ్ళకు నా పిల్లలు తీర్చుకున్నరు" అని అడవి అనుకోవడం హృద్యంగా ఉంది.

"తయారుగున్నరు. అది చెబుదామనె వచ్చిన, మగోల్లు వడిసెలలోని, గుత్పలలోని తయారున్న కొందరు గొడ్డల్లు పట్టుకున్నారు. వడిశెలలు తిప్పెటోల్లకు రాల్లు అందియ్యనీకి ఆడోల్లు వాళ్ళ పక్కనే నిలబడి ఉన్నారు. కొందరు కారం అందుకున్నారు. కడమోల్లు నీల్లు ఉడుకు చేస్తున్నరు" చెప్పింది పార్వతి. ఇలాంటి వర్ణనలు వాస్తవికతను దృశ్యమానం చేసాయి. ఇదేకాక రైఫిల్ లాంటి ఆయుధాలను వాడే విషయాన్ని విడమర్చి చెప్పడం వల్ల, గెరిల్లా వార్ గురించి విశదీకరించడం వల్ల నాటి దళం యొక్క పోరాబాట తెలిసింది. దళ సభ్యులు మారువేషాల్లో తిరగడం, ఎదుటివారిని నమ్మించడం, శత్రువుల కళ్ళల్లో కారం కొట్టడం లాంటి సందర్భాల్లో నాటకీయత పండింది.

బలీయమైన విశ్వాసాలున్న వ్యక్తులు తమకు అనుగుణమైన తాత్విక భూమికను తయారుచేసుకుంటరు. దాన్నొక అవసరంగా వృద్ధి చేసుకుంటరు. ఆ క్రమంలోనే తోటి మనుషులకు చెప్పి ఒప్పిస్తరు. తమ భావజాలాన్ని వ్యాప్తిలోకి తెస్తరు. అది వారికి బలాన్నిస్తుంది. నరహరిరావు దొర, జానకిరామయ్యల విషయంలో ఇది రుజువైంది. వీరిద్దరు శక్తివంతమైన రెండు సిద్ధాంతాలకు ప్రతినిధులు. సిద్ధాంతం వారి జీవితాల్లో రక్తగతమై ఆచరణలో తేలింది. ఈ రెండు పాత్రల మాటల్ని వింటే అది అవగతమవుతుంది.

తన వద్దకు వచ్చిన వారితో దొర ఇలా అంటాడు.

"ఆ దేవుడు కొందరిని పల్లకీల ఎక్కితిరిగేటందుకు పుట్టించిండు. కొందరిని మోపెటందుకు పుట్టించిండు. మనం దేమున్ని అడిగి పుట్టినాంరా!, ఆయన ఎట్ల పుట్టిస్తె అట్ల పుట్టినం. లేకుంటె అందరము నిజాం నవాబులమై పుట్టకపోదుముగా".

"కోడె చేను దున్ననంటె నీవు ఊకుంటావుర. రాని పిచ్చలు రోకలి మీద పెట్టి ఇనుప గూటంతోటి నరాలు పప్పుపప్పు అయ్యేట్టు గుద్దవుర. అట్ల శేర్లు కొట్టి తోవకు తెచ్చుకుంటవు. ఇంకా మొండికేస్తె ముడ్లె ముల్లుగర్రతోని పొడుస్తవు. అంతనె కదర".

ఇలా చెప్పి దొర తను చేసే పనులను సమర్థించుకుంటుడు. నేను కూడా అలానే చేస్త అనే విషయాన్ని నేరుగా విడమర్చి భయాందోళనలకు గురిచేసి, తనది పై చేయిగా నిరూపించుకుంటాడన్నది అతని ఆచరణ.

ఊరి ప్రజలు దొర దాష్టీకానికి విసిగి, తిరగబడడానికి తయారుగున్న సమయంలో, నవాబుల వద్ద దొరల వద్ద ఉన్న ఆస్తి వారి సొంతం అని నమ్మిన ప్రజలతో జానకిరాముడు ఇలా చెబుతాడు.

"ఏడి నుంచి సంపాదించిండు. బావులు తవ్వించిండా, మోటలు గొట్టిండా, చాళ్ళు చేసిండా, అరక కట్టిండా, తుకం పోసిండా, నాట్లు ఏసిండా, బట్టలు నేసిండా, బట్టలుతికిండా, కుండలు చేసిండా" చెప్పులు కుట్టిండా, ఏ కార్ఖానాలనన్నా ఎక్కడయిన చుక్క చెమట కార్చిండా", అంటూ మొహాల్లోకి చూస్తూ అడిగాడు జానకిరామయ్య.

"అసుంటి పనులు ఆయన ఎందుకు చేస్తడు. అవి దొరలు చేస్తరా" అడిగాడు విస్తారి.

"చెయ్యరు. నిజాం నవాబు, దొరలు కష్టం చెయ్యరు. పేదోల్లతోని కష్టం చేపించి ఆ కష్టం దోసుకబోయే నిజాం నవాబు పెద్ద దొంగ, వీల్లు చిన్న దొంగలు" అన్నాడు జానకిరామయ్య.

పై మాటలు దొరలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న శక్తులవి. తమ భావాలకు అనుకూలంగా, దొరకు వ్యతిరేకంగా ప్రజల్ని సమాయత్తం చేయడానికి మాట్లాడిన మాటలవి. అలా నవలలో సంఘర్షణాపూరిత వాతావరణం, వర్గ స్పృహ కమ్ముకొని ఉంది.

వీర తెలంగాణ పోరాట గాథ అనే సబ్ టైటిల్‌తో ఉన్న నవల 'మలగనిబత్తి'. పోరాట గాథ అనగానే తెలిసిన కథలే అని అనుకునే అవకాశముంది. ఇదివరకు వచ్చాయి కదా అనే నిరాసక్తత కూడా ఆవరిస్తది. ఇలాంటి ప్రతికూల మనసుతో చదవడం మొదలుపెట్టిన పాఠకుణ్ణి, వదలకుండా ఆసాంతం చదివిస్తుంది నవల. తన రచనా శిల్పంతో పాఠకుణ్ణి మంత్రముగ్ధుణ్ణి చేసి తీసుకెళతాడు. ప్రతి సన్నివేశం, సంభాషణ, సంఘటన, వేదన, అణచివేత, శృంగారం, వ్యంగ్యం, వర్ణన, బోధనలతో పాఠకుడు తాదాత్మ్యం చెందేలా రచనా శైలి ఉంది. ముఖ్యంగా అలంకారాలు ఆకట్టుకుంటాయి. అందులో రచయిత ఆత్మ ఒదిగి ఉన్నట్టు కనిపిస్తుంది. "బాగా బలిసిన దొర పసులు తనకు రంగురంగుల దయ్యాలోలె అగుపడ్డయి", "చంద్రమ్మ బస్తానెత్తుకుంది. దుర్మార్గుల భారం మోస్తున్న భూదేవిలా గడీల నుంచి ఇవతలకి వచ్చింది". "పుష్టిగా ఉన్న దొరసాని వంటినిండా సొమ్ములున్నట్లు, అడవి నిండా చెట్లున్నాయి". ఇలాంటి పోలికల వల్ల పాఠకుడికి పాత్ర పట్ల మమేకత ఏర్పడుతుంది.

"శరీరాన్ని ఆవిరి మీద ఉడికించింది", "పూలు చూపించి పుర్సాలు మాయం చేస్తరు", "కడుపుల నిప్పుల కుండ బోర్లించినట్టయింది". "కోళ్ళాగ ఉరికచ్చి ఎదను కుమ్మినట్లయింది" "కొంగుల అగ్గి ముడేసుకొని బతుకుతున్న" లాంటి వాక్యాలు సన్నివేశ తీవ్రతను పరాకాష్టకు చేర్చాయి. దొర చంద్రమ్మను దున్నపోతులా కుమ్మేసినపుడుగాని, రాజన్న శరీరాన్ని మాటలతో చీల్చినపుడుగాని, తహసీల్దార్, అమీన్‌సాబ్‌లను ప్రజలపైకి ఉసిగొల్పినపుడుగాని, మంగమ్మకు లేఖ ఇచ్చి ప్రజల వద్దకు రాయబారిగా పంపినపుడుగాని సంయమనం కోల్పోకుండా సన్నివేశ చిత్రణ జరిగింది. ఆ రచనా నైపుణ్యమే నవలకు శక్తినిచ్చింది. దొర, వారి తాబేదారుల పదఘట్టనల కింద నలిగిన ప్రజల ఎముకల చప్పుడు వినవచ్చినట్లుగానే, సాయుధ వీరుల రైఫిల్ గర్జనలు వినపడతాయి. వర్గ భావజాలం, కిందివర్గాల వరకు చాపకింద నీరులా చేరిందన్నది. ఈ నవల నాటి కాలపు సజీవ సాక్ష్యం. ఒకానొక రక్తము మరకకు సజీవ దర్పణం. కకావికలైన మనసులను పట్టించే చిరునామా. నాటి బాంచెన్ బతుకుల ప్రదర్శన. నరరూప రాక్షసుల ఆధిపత్యాల్ని తెలిపిన నమూన. మాండలికాల పట్ల అభిరుచి కల్గిన రచయిత వాటిని తక్కువగా వాడడం, వాటిపట్ల అతనికి గల శ్రద్ధను తెలుపుతుంది. రచయితకు అభినందనలు. ✺

## దేశ విభజన వస్తువుగా సాహిత్యం-14

# దేశ విభజనపై స్పందించిన చిత్రకళారంగం

- కొత్తపల్లి రవిబాబు

**ప్రజల** జీవన పోరాటం నుండి ఉద్భవించినవే లలితకళలు. వాటిలో చిత్రలేఖనం ఒకటి. ఆదిమానవుడు తను వుండే గుహల గోడలపై తాను వేటాడాలనుకున్న జంతువు బొమ్మగీసి, ఏ కీలకమైన భాగంలో కొడితే ఆ జంతువు మరణిస్తుందో గుర్తుపెట్టేవాడు. దాని ప్రకారం వేట సాగించేవాడు. అలా చిత్రకళ కూడా మానవుడి జీవన పోరాటం నుండి పుట్టినదే అని అర్థం అవుతుంది.

రచయితలు, చిత్రకారులు, శిల్పులు, నాట్యకళాకారులు, సంగీతకారులు - లలితకళల్లో కృషిచేస్తున్నవారందరూ తమ కార్యక్రమాలకు, తమ కళలకు నేపథ్యంగా తమ సమకాలీన సంఘటనలను స్వీకరిస్తారు. ప్రపంచ చరిత్రలోనే అత్యధిక ప్రజానీకం మరణించడం, వలస పోవడం, భౌతిక మానసిక గాయాల పాలవడం మన దేశ విభజన సందర్భంగా చూశాం. దీనిని కథావస్తువుగా స్వీకరించిన రచయితలు తమ రచనలు - కథలు, నవలలు, నాటకాలు, కవితలు ద్వారా మరోసారి ఇటువంటి పరిస్థితి రాకూడదనే సందేశాన్నిచ్చారు. ఈ రచనలు అత్యధికంగా బెంగాలీ, ఉర్దూ, హిందీ, పంజాబీ, ఇంగ్లీషు, సింధీ భాషలలోనూ, కొంతవరకు డోగ్రీ, గుజరాతీ, మరాఠీ భాషలలోనూ వచ్చాయి. ఒక్క పంజాబీ భాషలోనే 500 నవలలు వచ్చినట్లు తెలుస్తోంది.



మరి చిత్రకారుల స్పందన ఏమిటి? అందమైన ప్రకృతి దృశ్యాలనూ, దేవుళ్ళు, దేవతల చిత్రాలనూ, నైరూప్య చిత్రాలనూ చిత్రించే చిత్రకారులను పక్కన పెడదాం. చిత్రకళారంగంలో సామాజిక చైతన్యంతో కృషిచేసిన సంస్థలు, వ్యక్తుల గురించి ఈ వ్యాసంలో తెలుసుకుందాం. ఆధునిక కాలంలో బెంగాల్‌లోని కరువు బాధితుల చిత్రాలు గీసిన ప్రజా చిత్రకారుడు చిత్తప్రసాద్‌ను మనం ఈ సందర్భంగా ముందుగా గుర్తు తెచ్చుకోవాలి. చుట్టూ వున్న సమాజాన్ని చిత్రకారులు పరిశీలించాలి. అధ్యయనం చేయాలి.

దేశ విభజన తర్వాత డిశంబరు 1947లో బొంబాయి ప్రోగ్రెసివ్ ఆర్టిస్ట్స్ గ్రూపు (ప్రగతిశీల చిత్రకారుల బృందం) ఈ క్రింది చిత్రకారులు సభ్యులుగా ఏర్పడింది. 1. ఎఫ్.ఎన్.సౌజా; 2. ఎం.ఎఫ్. హుసేన్; 3. ఎస్.హెచ్. రాజా; 4. ఎస్.కె.బక్రే; 5. హెచ్.ఏ.గడే; కె.హెచ్.అరా. వీరిలో ఎస్.కే.బక్రే ఒక్కరే శిల్పకళాకారుడు. ఈ బృందంలో ఆ తర్వాత రాంకుమార్, అక్బర్ పదంశీ, తయాబ్ మెహతాలు చేరారు. వీరు తరచు దేశ విభజన సమయంలో జరిగిన సంఘటనలు తమకు స్ఫూర్తినిచ్చి, చిత్రకళారంగంలో ఆధునికతకు అంకురార్పణ చేశామని చెప్పుకున్నారు. వీరిలో కొందరు వివిధ రకాలైన చిత్రకళా శాఖలలో కృషిచేశారు. ఐతే ఈ బృందం 1950 నాటికే చెల్లా చెదరై పోయింది. ఈ బృందంవారు మొత్తం మూడు చిత్రకళా ప్రదర్శనలు - 1948లో బొంబాయిలో, 1950లో కలకత్తాలో, 1953లో ఏర్పాటుచేశారు. 1956లో బృందాన్ని రద్దు చేసుకున్నారు.

ఆ తర్వాత కాలంలో నళిని మాలిని, అంజలి ఎలా మీనన్, సతీశ్ గుజ్రాల్, నీలిమా షేర్, అర్పితాసింగ్, కృష్ణఖన్నా, ప్రాణ్‌నాథ్ మగో, ఎస్.ఎల్. పరేషర్, అర్పనాకౌర్; తాయేబీ బీగమ్ లిపి, మహబూబర్ రహమాన్, ప్రమోతిష్ డిపులన్, ప్రతీక్ చౌధురి, సీమా కొప్లా తదితరులు సామాజిక అవగాహనతో చిత్రకళారంగంలో పనిచేశారు. విభజన సృష్టించిన గాయాలు సతీశ్ గుజ్రాల్ చిత్రాలను ప్రభావితం చేశాయి. ఎస్.ఎల్. పరేషర్ శరణార్థుల శిబిరాలలో స్వచ్ఛందంగా పనిచేసి, వారితోపాటు జీవించి ఆ తర్వాత తన జీవితాన్ని పునర్నిర్మించుకోడానికి వెళ్ళాడు. గుజరన్‌వాలా (ఇప్పుడు పాకిస్తాన్)కు చెందిన వీరి కుటుంబం దేశ విభజన కాలంలో శరణార్థుల శిబిరాలలో కాలం గడిపింది. అంబాలా శరణార్థుల శిబిరం సూపర్‌వైజర్‌గా ఆయన విభజన వస్తువుగా శిల్పాలు చెక్కారు. చిత్రాలు వేశారు. 1951లో సిమ్లాలో స్థాపించిన స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌కు ప్రిన్సిపల్ అయ్యారు.

అర్పనా కౌర్ '1947' అనే శీర్షికతో ఒక కళాఖండాన్ని చిత్రించారు. ఇది అమృతసర్‌లోని పార్టిషన్ మ్యూజియంలో వుంది. ఈమె 1954లో జన్మించారు. దేశ విభజన సమయంలో వీరి కుటుంబం పశ్చిమ పంజాబ్ నుండి ఇండియాకు వలస వచ్చింది. ఆమె ఢిల్లీలో ఎం.ఏ. చదివారు. 1997లో అర్పనా కౌర్ విభజనపై మరో చిత్రం వేశారు. దీని పేరు 'ది గ్రేట్ డివైడ్' (మహత్తర విభజన) అటూ, ఇటూ వెళ్తున్న రైళ్ళ నుంచి కారుతున్న రక్తపు బొట్లు 'రక్తమోడుతున్న ట్రైన్స్' అనే చిత్రంలో చూస్తాం. 1984లో సిక్కులపై జరిగిన మారణకాండను అర్పనాకౌర్ చిత్రించగా దానికి 1986లో బంగారు పతకం లభించింది. కృష్ణ ఖన్నా అయితే ప్రవాసం పోతున్న ప్రజలతోపాటు, పశువులను కూడా చిత్రించారు.

ఇటీవల నీలిమా షేక్, నళిని మాలిని, రీనా సైని 'తమ కుటుంబాలు అనుభవించిన దేశ విభజన గాయాలను' చిత్రించారు. సలీమా హష్మి

'విభజింపబడిన ఉపఖండాన్ని' చిత్రించగా, జిమ్మీ ఇంజనీర్ '1947లో చెట్టు నీడన విశ్రాంతి తీసుకుంటున్న శరణార్థుల'ను చూపించారు తన చిత్రంలో.

సలీమా హష్మి విభజనపై చిత్రించిన అద్భుత కళాఖండం ఇంగ్లండ్‌లోని బ్రాడ్ ఫర్డ్ మ్యూజియంలో వుంది. కృష్ణ ఖన్నా తాను విభజనపై చిత్రించిన చిత్రాల గురించి మాట్లాడుతూ, "వీటిని విభజన జరిగిన తర్వాత చాలా కాలానికి చిత్రించాను. విభజన సమయంలో ప్రాణాలు పోకుండా అపాయాల నుండి తప్పించుకోవడమే ప్రధానం మాకు" అన్నారు.

కలకత్తాలో 2016 అక్టోబర్ నెలలో విభజన ప్రదర్శనశాల (మ్యూజియం)ను ప్రారంభించారు. 2017 అగస్టు 17న దీనిలో 15 గ్యాలరీలు ఏర్పరచారు. చిత్రకళారంగం ద్వారా విభజన గాయాలను అర్థం చేసుకోవడం లక్ష్యంగా ఈ ప్రజల మ్యూజియం ఏర్పడింది. విభజనకు గురైన ప్రజలు ప్రాణాలతో బతికి బయట పడినవారు ఉచితంగా ఇచ్చిన వస్తువులను, కళాఖండాలను ఇక్కడ భద్రపరిచారు. ప్రజలు కొన్ని తరాలుగా వున్న ఇళ్ళ నుండి, భూముల నుండి, శాశ్వతంగా తరలి వెళ్ళిపోతూ వారు కేవలం మోయదగినన్ని అత్యవసర వస్తువులే తమతో తీసుకువెళ్ళారు. ఆ మిగిల్చిన వస్తువులే ఇప్పుడు ఆనాటి చరిత్ర రచన ఆలంబనగా వున్నాయి. వంటపాత్రలు, ట్రంకుపెట్టెలు, దుస్తులు, పెళ్ళిచీరలు, నగలు, వార్తాపత్రికలు, ఫోటోలు మొదలైన వస్తువులు ఇక్కడ చూడవచ్చు. అంతేగాక బాధితులు చెప్పే మౌఖిక కథనాల వీడియోలు, శరణార్థుల ఉత్తరాలు, ప్రభుత్వ ప్రకటనలూ, ఉత్తర్వులు ఇక్కడ వున్నాయి.

18 తరాలుగా ఆమె పూర్వీకులున్న గ్రామం పిండ్ దాదన్‌ఖాన్ (Pind Dadan Khan) జ్ఞాపకాలను సీమా కోహ్లీ అనే చిత్రకారిణి, శిల్పి, కవి రికార్డు చేశారు. ఆమె బాల్యంలో తండ్రి పాడిన పాటలను విన్పించారు. ఆనాటి వారి ఇత్తడి వస్తువులను 2019లో కలకత్తా సెంటర్ ఫర్ క్రియేటివిటీలో ప్రదర్శించారు. ఆమె తండ్రి ఖడీబోలీ భాషలో స్వీయచరిత్ర 'Miter Pyaree Nu'ను రాశారు.

మనీషా గేరా బస్వాని చిత్రకారిణి, ఫొటోగ్రాఫర్. 47 మంది ఇండియా, పాకిస్తాన్ కళాకారుల ఫొటోలు తీసారు. వీరిలో 25 మంది ఇండియవారు, 22 మంది పాకిస్తాన్‌వారు. 1947లో విభజన జరిగింది గనుక 47 సంఖ్యను ఎన్నుకున్నారు. ఈ 47 మందీ కుటుంబపరంగా గానూ, వ్యక్తిగతంగా గానూ దేశ విభజన అనుభవాలతో సంబంధం వున్న చిత్రకారులే. మనీషా తల్లిదండ్రులు కూడా విభజన గాయాల ననుభవించినవారే. వారు చెప్పే 'పాతతరం నాటి ఇంటి జ్ఞాపకాలు' వింటూ ఆమె పెరిగారు. ఈ 47 మంది ఫొటోలు వాళ్ళ వాళ్ళ ఇళ్ళ వద్ద 16 ఏళ్ళ క్రితం తీశారు. నేడు పాకిస్తాన్‌కు చెందిన పై 22 కళాకారులలో అత్యధికుల మూలాలు ఇండియాలోనే వున్నాయి. వీరిలో కొందరు : అమీన్ గుల్గీ, మహమ్మద్ ఇమ్రాన్ ఖురేషీ, అదీలా సులేమాన్, రిఫత్ ఆల్వీ కాగా ఇండియన్ చిత్రకారులలో గోపీ గజ్వాని, కృష్ణ ఖన్నా, పరంజిత్‌సింగ్, నీలిమాషేక్, భారతీఖేర్, వివన్ సుందరం, సతీశ్ గుజ్రాల్, మోనిక నరూల, జరీనా హష్మి మొదలగువారున్నారు. వీరందరి వివరాలు వాట్సాప్ ద్వారా ఆమె సంపాదించారు. ఈ 47 మంది కళాకారులను – కార్డులో ఒకవైపు ఫొటో మరోవైపు వివరాలు పొందుపరచి పోస్టుకార్డులు తయారుచేశారు. దీనికి ఆమె 'పోస్ట్‌కార్డ్స్ ఫ్రం హోమ్' అని పేరు పెట్టారు. ఈ ప్రాజెక్టును ఆమె 2018లో లాహోర్‌లోనూ, 2018లోనే ఫైజ్ ఉత్సవంలోనూ, 2019లో కొచ్చీలోనూ, ఇండియా ఆర్ట్ ఫెయిర్‌లోనూ ప్రదర్శించారు.

దేశ విభజన వల్ల తీవ్రంగా గాయపడిన కుటుంబానికి చెందిన పూజాపూరి ఢిల్లీలో Shrine Empire గ్యాలరీ నిర్వహిస్తున్నారు. చరిత్రలో కల్లోల కాలపు ముద్రలు ఆమె చిత్రీకరించారు. తన బాల్య జ్ఞాపకాలేగాక, విభజనకు ముందు బ్రిటీషువారి చరిత్ర, విభజనకు సంబంధించి తన మేనత్త, మేనమామలతో చర్చల ద్వారా సేకరించిన వివరాలు ఈ గ్యాలరీలో పొందుపరిచారు. దీనిలోనే సమంత బాత్రా మెహతా, పాకిస్తాన్‌లో శిథిలం చేయబడిన గురుద్వారాలు, దేవాలయాల గురించి చేసిన అధ్యయనాలను ఇక్కడ జాగ్రత్త చేశారు. పూజాపూరీ తన చిత్రాలలో విభజన మానవులను మానసికంగా ఎలా కృంగదీసిందో వివరించారు. 'Anthem' అనే చిత్రాన్ని ఇండియా నుండి పాతకాలపు పోస్టు కార్డులు (Vintage Post Cards from India) 1945–50 పేరుతో ప్రచురించారు. మానవ నరాల వ్యవస్థను ప్రాచీన గ్రంథాల సహకారంతో Collaged imagesగా పోస్టుకార్డులపై చిత్రించారు. కొన్ని కార్డులపై 1947 అగస్టు 14–15 మధ్య రాత్రి 12:00 గంటలకు నెహ్రూ పార్లమెంటులో ఇచ్చిన ప్రసంగం 'Trust with Destiny'లోని మొదటి పేరాను ముద్రించారు.

అమృతసర్ టౌన్‌హాల్‌లో పార్టిషన్ మ్యూజియం ఏర్పాటుచేశారు. దీనిలో విభజనకు ముందూ, తరువాతా రాజకీయమైన డాక్యుమెంట్లు, వస్తువులు, కథనాలు వుంచారు.

1947 పార్టిషన్ ఆర్కైవ్ అనేది 1947 విభజన నాటి చారిత్రక పత్రాల సంస్థ. ఇది ఒక స్వచ్ఛంద సంస్థ. అన్ని మతాల, తెగలకు సంబంధించినవారు విభజన కాలంలో ప్రత్యక్షంగా అనుభవించినవారి గాథలు, ప్రజల చరిత్ర, డాక్యుమెంట్లు జాగ్రత్త చేసిన సంస్థ ఇది.

చివరగా ఇటీవల స్వాతంత్ర్య వజ్రోత్సవం సందర్భంగా గూగుల్ సంస్థ నిర్మించి ప్రసారం చేసిన మూడున్నర నిముషాల నిడివి గల ఒక కళాత్మక చిత్రం 'Re Union' (పునః కలయిక) చిత్రం కూడా విభజన వస్తువుగా రూపొందించినదే. విభజన సమయంలో విడిపోయిన ఇద్దరు మిత్రులు బలదేవ్, యూసఫ్‌లపై చిత్రీకరించిన ఈ లఘుచిత్రంపై అక్షయ ఆరాధ్య వ్యాఖ్యానిస్తూ "రాజకీయ నాయకులు గత 75 ఏళ్ళుగా సాధించలేనిదాన్ని గూగుల్ మూడున్నర నిముషాలలో సాధించింది" అని ప్రశంసించారు. దీని గురించి వివరంగా దేశ విభజన వస్తువుగా వచ్చిన చలనచిత్రాలు, డాక్యుమెంటరీలు, నాటకాలు, రూపకాలు అనే వ్యాసంలో విపులంగా చర్చిద్దాం.

వచ్చే సంచికలో : **చమన్ నహాల్ నవల 'ఆజాదీ'** ✳

పుస్తక పరిచయం


# అర్ధఫ్యూడల్ పితృస్వామ్య కుటుంబ యుద్ధభూమిలో మహిళలు

## "స్వయంసిద్ధ" కథాసంకలనం

- బి. సూర్యసాగర్

**భండారు** విజయ, పి. జ్యోతిగార్ల సంపాదకత్వంలో హస్మిత ప్రచురణలు సంస్థ ప్రచురణగా మే 2023లో వెలువడిన కథాసంకలనం "స్వయం సిద్ధ - ఒంటరి మహిళల జీవనగాథలు". నలభైమంది మహిళా రచయితలు రాసిన నలభై కథలు ఇందులో వున్నాయి. వారిలో సీనియర్ కథకులు, కొత్తగా కథలు రాసినవారు వున్నారు. ఇవి ఒంటరి మహిళల గురించిన కథలు, కథనాలు. ఇటువంటి కథలు తెలుగు సాహిత్యంలో దండిగానే వచ్చాయి. ఇప్పుడు ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాయించి తెచ్చిన కథలివి.

స్వచ్ఛందంగానో, పరిస్థితుల ఒత్తిడివల్లనో అవివాహితలుగా వుండిపోయిన స్త్రీలు, భర్త మరణం వల్ల ఒంటరులయినవారు, భర్త నుండి విడాకులు తీసుకున్నవారు, భర్త వేరొక స్త్రీతో సంబంధంలోకి వెళ్ళడం వల్ల ఒంటరులైనవారు, భర్త అయోగ్యుడయినందువల్ల ఒంటరులుగా సంసారం ఈదేవారు, వివాహానికి పూర్వం పట్టణాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు - ఇలా భిన్న కారణాల వల్ల ఒంటరులుగా జీవిత మీదుస్తున్న స్త్రీలు అనుభవించిన వేదనలు, వివక్షలు, అవమానాలు, హింసలు, వాటి నెదుర్కొని అధిగమించడానికి ఆ స్త్రీలు చేసిన కష్టతరమైన పోరాటాలు ఈ కథల కథా వస్తువులు. అందువల్ల అవి సాహిత్యపరంగా విశిష్టమైనవేగాక సమాజపరంగా ఎంతో ప్రాధాన్యత కలిగినవి.




భిన్న సామాజిక, ఆర్థికస్థాయి కుటుంబాలకు చెందిన ఒంటరి స్త్రీల బాధల గాథలు ఈ సంకలనంలోని కథలు, కథనాలు. అవి ప్రాతినిధ్య కథలు. విసుగుకు గురిచేయకుండా చదివింపజేస్తాయి.

ఒక దేశపు సామాజికార్థిక మౌలిక లక్షణాలు కుటుంబ వ్యవస్థలో ప్రతిఫలిస్తాయి. ఒంటరి స్త్రీల జనాభా అమెరికా దేశంలో అత్యధికంగా వుంది. అక్కడ 40 శాతం ప్రసవాలు అవివాహిత ఒంటరి స్త్రీలకు సంబంధించినవే. విడాకుల కేసులు కూడా ఎక్కువగా వుంటాయి. జపాన్ దేశంలో కూడా ఒంటరి స్త్రీలు అత్యధికంగా వున్నారు. అవి అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు. అక్కడ వ్యక్తి స్వేచ్ఛను ఆదర్శంగా భావిస్తారు. స్త్రీలకు ఉపాధి అవకాశాలు తక్కువ స్థాయివి అయినా అధికంగా వుంటాయి. వివాహము, కుటుంబము, మాతృత్వము, విడాకులు, పిల్లల పెంపకం పట్ల మనదేశంలో మాదిరి సామాజిక నైతిక ఒత్తిళ్ళు, విధి నిషేధాలు వుండవు. అందువల్ల అక్కడ ఒంటరి స్త్రీలు, సింగిల్ మదర్స్ సర్వసాధారణం. మరోవైపు సబ్ సహారన్ దేశాలు అనబడే 46 ఆఫ్రికన్ చిన్న పేద దేశాల్లో ఒంటరి స్త్రీలు అత్యధికంగా వుంటారనే సమాచారం వుంది. 32 శాతం స్త్రీలు సింగిల్ మదర్స్‌గా వుంటారు. కుటుంబాల ఈ అస్థిరతకు సంబంధించిన కారణాల సమాచారం తెలియదు.

భారతదేశంలో బ్రిటిష్ వలస పాలకుల పాలన నుండి అధికారమార్పిడి జరిగి 76 సంవత్సరాలు గడిచినా జాతీయ పారిశ్రామిక, ప్రజాస్వామిక సమాజం నిర్మితం కాలేదు. అన్నిరంగాల్లో భూస్వామిక ఆర్థికము, సామాజిక కట్టుబాట్లు విశ్వాసాలు, ఆచారాలు బలంగా కొనసాగుతున్నాయి. పెట్టుబడిదారీ ఆర్థికము, సంస్కృతి, రాజకీయము ఒక మేరకు పెరుగుతూ వచ్చినా భూస్వామ్య పునాది, వాటి ఉపరితల వ్యక్తీకరణలు బలంగా కొనసాగుతున్నాయి. స్త్రీల జీవన పరిస్థితులు, పరిశీలన దీనంతటినీ స్పష్టపరుస్తుంది. వారి జీవితాల్లోని అస్తిత్వ, భావజాల సంఘర్షణ వ్యవస్థాగత సంఘర్షణను స్పష్టం చేస్తుంది. వ్యక్తిస్వేచ్ఛా ఆకాంక్షలు పెరిగినా భూస్వామ్య పితృస్వామ్య కట్టుబాట్ల ఒత్తిడి, ప్రభావం తగ్గలేదు. వలస పాలకులు తీర్చిదిద్దిన అర్ధభూస్వామ్య వ్యవస్థ కొనసాగుతుండడమే అందుకు మౌలిక కారణం.

పై రెండింటి మధ్య వ్యక్తులలో, కుటుంబాలలో వ్యక్తమయ్యే భావజాల, అస్తిత్వగత తీవ్ర సంఘర్షణను "స్వయం సిద్ధ"లో సంకలితమైన కథల్లో కనుగొనవచ్చు. స్త్రీల వైపు నుండి అది అత్యంత వేదనాత్మక సంఘర్షణ. అది మూలంలో వ్యవస్థాగతమైనది. ఈ ఎరుకను పొందగలిగితేనే ఈ కథలు సార్థకమవుతాయి.

"స్వయం సిద్ధ" కథా సంకలనంలోని కథల్లో స్త్రీ పాత్రలు భరింప శక్యంగాని దాంపత్య జీవితం నుండి విడివడడానికి, సింగిల్ మదర్స్‌గా జీవించడానికి ఎదుర్కొన్న సవాళ్ళు తీవ్ర మానసిక, సామాజిక వేదనతో

కూడినవి. ఒంటరి వేదన వారికి దాంపత్య జీవితంలో కూడా అనుభూతమైనదే. శాంతి ప్రబోధగారి కథ "స్టేటస్ సింగిల్"లో ప్రథమ పురుష కథనంలో తన గాథ చెప్పే స్త్రీ పాత్ర "జనం దృష్టిలో నేను ఒంటరిని కాదు. జంట పక్షినే. కాని నా అంతరంగంలో నేను ఒంటరినే" అంటుంది. ఆమె ఇద్దరు కూతుర్ల తల్లి. అమ్మమ్మ కూడా అయిన తరువాత భర్త నుండి విడాకులు తీసుకోవడానికి నిర్ణయించుకుంటుంది. "నన్ను నేను ఎందుకు కోల్పోవాలి. నన్ను నేను వెతుక్కోవాలి" అని నిశ్చయించుకొని తన నిర్ణయాన్ని భర్తకు చెప్పినప్పుడు తనను జీవితమంతటా బానిసగా చూసిన అతను తిట్లకు లంకించుకుంటాడు. అతను భయగ్రస్తుడు కావడాన్ని ఆమె గమనిస్తుంది. "హు! ఇప్పుడు కొత్తగా ఒంటరి అయ్యేందేముందిట? ఎప్పుడూ ఒంటరేగా.... నన్ను భయపెట్టాలని చూస్తున్నాడు.... అనుకొని నా స్టేటస్ సింగిల్ అనుకొంటూ ఒంటరి జీవిత ప్రయాణానికి బయల్దేరుతుంది. ఆమెకు తన తల్లిదండ్రుల నుండి కూడా తీవ్ర నిరసన ఎదురవుతుంది.

"ఎప్పుడూ ఒంటరేగా" ప్రకటన తెలుగు సమాజంలోనే కాదు మొత్తం భారత సమాజ కుటుంబ వ్యవస్థలో ఒక సార్వత్రిక సత్యం. స్త్రీలు ఒంటరులు గావించబడి అణచివేయబడుతున్నా, విముక్తి కాంక్ష వున్నా విముక్తికాలేని నిస్సహాయత అది. స్వతంత్ర జీవనావకాశాల విస్తృతికి అడ్డంకిగా వున్న అర్ధఫ్యూడల్ సామాజికార్థిక వ్యవస్థ స్త్రీలను పరాధీనులను గావిస్తూ పితృస్వామ్య పీడనకు వ్యవస్థాగత పునాదిగా వుంది. ఇది భారతదేశంలో 30 కోట్ల కుటుంబాల గాథ.

"స్వయం సిద్ధ" కథాసంకలనంలోని చాలా కథల్లో ఒంటరి స్త్రీలు తమ జీవన పోరాటంలో నెగ్గడానికి దోహదపడిన అంశం విద్య, తద్వారా ఓ మాదిరి ఉద్యోగావకాశాలు. మనదేశంలో విద్య, ఉద్యోగావకాశాలు, అదిన్నూ స్త్రీలకు, ఏ మేరకున్నాయో గ్రామీణ సమాజాన్ని చూస్తే తెలుస్తుంది. విద్యావంతులయివుండీ ఉద్యోగాలు చేయకుండా కుటుంబ చాకిరీకే పరిమితమైన స్త్రీలు మన సమాజంలో గణనీయంగా వున్నారు. నిజానికి పట్టణాలు కూడా పెద్దసైజు పల్లెటూర్ల మాదిరి వుండడం యాదృచ్ఛికం కాదు. అది వ్యవస్థాగతం. జాతీయ పరిశ్రమల విస్తృతి దానికనుగుణంగా విద్య, ఉద్యోగావకాశాలు వృద్ధికావడం మహిళల గౌరవప్రద కుటుంబ జీవనాన్ని, ఒంటరి మహిళల ఆత్మగౌరవ జీవన పోరాటాన్ని సులభతరం గావిస్తాయి. పితృస్వామ్యాన్ని, పురుషహంకారాన్ని బలీయం చేసే భూస్వామ్య, కుల, మత, వంశ సంప్రదాయాలు స్త్రీల స్వేచ్ఛాజీవన కాంక్షను అణగార్చి పీడిస్తాయి. దాంపత్య సంబంధంలోను, ఒంటరులుగాను స్త్రీలు సర్వసాధారణంగా అనుభవించే అణచివేత, అవమానాలు, దుఃఖము ఈ సంకలనంలోని నలభై కథల్లోను గాఢంగా పరచుకొని వున్నాయి. వాళ్ళ జీవితంలో నిలదొక్కుకోవడానికి పడిన ఆందోళన ప్రయాస పాఠకుల మనసుల్ని కలచివేస్తాయి. వాళ్ళ జీవన కాంక్ష, ప్రతికూలతలను ఎదుర్కొన్న తీరు, అబ్బురపరుస్తాయి.

విద్య ఉద్యోగావకాశాలు కరువైన బీదవర్గ ఒంటరి స్త్రీల జీవన గమనంలోని సంక్లిష్టతను బాధలను తెలియపరచే కథలు కూడా ఈ సంకలనంలో వున్నాయి. "మూసొడ్డు" కథలో కళమ్మ, "మఎక్లీ"లో రుక్కి "పోశమ్మ"లో పోశాని, "ఇడుపు కాయితాలు"లో యశోద, "రత్తమ్మ" కథలో రత్తమ్మ, "యాపకాయంత ఎఱ్ఱి"లో చిట్టెమ్మ, "గుమ్మితి"లో కుమారి ఆ కోవకు చెందిన పాత్రలు.

ఒంటరి స్త్రీలు సంతానాన్ని భారంగా భావించకుండా తమతోనే వుంచుకొని పెంచి పెద్దజేయడం తమ బాధ్యతగానేగాక తమకు ఇష్టమైన విషయంగానూ తమ జీవితాన్ని అర్థవంతం చేసేదిగానూ భావించడాన్ని ఈ సంకలనంలోని చాలా కథల్లో చూడగలము. "ఇడుపు కాయితాలు" కథలో ఆఫీసు ఉద్యోగం చేసే సుధ భర్త నుండి విడాకులు తీసుకున్నప్పుడు, కూతురు సుశీల తండ్రితో వుండిపోవడం ఆమెకు ఎంతో బాధను కలిగిస్తుంది. అదే కథలో అదే ఆఫీసులో వంటమనిషిగా పనిచేసే యశోద భర్త నుండి విడిపోతే తన ముగ్గురు సంతానాన్ని పోషించుకోవలసి వుంటుందని తెలిసీ తనను భౌతిక హింసకు గురిచేస్తున్న భర్త నుండి విడాకులు వచ్చేలా సాయం చెయ్యమని సుధను అభ్యర్థిస్తుంది. "ఒంటరి పోరాటం" కథలో సుజాత మానసిక మాంద్యం (డౌన్ సిండ్రోమ్)గల ఆడపిల్లను కన్నందుకు భర్త వేధిస్తున్నందు వల్ల విడాకులు తీసుకొని ఎంతో కష్టానికోర్చి పాపను పెంచి పెద్ద చేస్తుంది. మాతృమూర్తుల మానవీయతను, పితృస్వామ్యంతో హైన్యత చెందిన పురుష స్వభావాన్ని ఈ కథలు వెల్లడిస్తాయి. పితృస్వామ్య భావజాలాన్ని అంతర్గతం చేసుకున్న స్త్రీలు తమ తోటి స్త్రీల పట్ల సానుభూతితో వ్యవహరింపజాలని పరాయీకరణ స్థితిని కూడా కొన్ని కథల్లో చూడవచ్చు. బాధిత స్త్రీలకు అండగా నిలిచిన స్త్రీ పాత్రలు కూడా కొన్ని వున్నాయి.

ఇంటా బయటా కదలికలపై ఆంక్షలు, సంప్రదాయాలు, భౌతిక, భావోద్వేగ హింస, ఆర్థిక పరాధీనత, పుట్టినింటి నుండి సహాయ శూన్యత, పిల్లలపట్ల మమకారము, వారి భవిష్యత్తు పట్ల ఆందోళన కుటుంబంలో స్త్రీల స్థితిగతుల్ని తీవ్రంగా సంక్షుభితం చేస్తాయి. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకారం భారతదేశంలో 2021 సంవత్సరంలో ఆత్మహత్య చేసుకున్న స్త్రీల సంఖ్య 46026. ఇది రైతు ఆత్మహత్యల కంటే 4-5 రెట్లు అధికం. ఆ విధంగా పరిశీలిస్తే "స్వయంసిద్ధ" కథాసంకలనంలోని ఒంటరి స్త్రీ పాత్రల బతుకు పోరాటం విలక్షణమైనది. భిన్న సామాజికార్థిక నేపథ్యాలు కలిగిన సమూహాలకు చెందిన స్త్రీల జీవన ప్రతిఫలనాలను ఈ సంకలనంలో మనం దర్శించగలం. స్త్రీలు కేంద్ర బిందువుగా తెలుగు సమాజ సంక్లిష్టత, అప్రజాస్వామికత, వెనుకబాటుతనము అర్థమవుతాయి.

భారత సామాజికవ్యవస్థ ఇప్పటికైనా జాతీయ, పారిశ్రామికీకరణము, ప్రజాస్వామికం అవ్వాల్సిన అవశ్యకత వుంది. తద్వారానే కుటుంబ వ్యవస్థ స్త్రీ జీవితాలు ప్రజాస్వామికము, స్వేచ్ఛాయుతము కాగలుగుతాయి. ఒంటరి జీవిత పోరాట ప్రయాస అంతమవుతుంది. అయితే అది సాధించుకోవలసిన సుదూర లక్ష్యంగానే వుంది. విశాల సమాజంలో ఇంటా బయటా స్త్రీలను ఒంటరులను చేసే పరిస్థితులు వారి గౌరవప్రద ఆనంద జీవన ఆకాంక్షలకు, మానవీయ హక్కులకు సవాళ్ళు విసురుతూనే వుంటాయి. ఈ సంకలనంలోని కథలు వారెదుర్కొంటున్న విషమ జీవన పరిస్థితులకు, వాటినధిగమించడంలో ఆశ్చర్యం గొలిపేవారి పోరాట చేవకు నమూనాలుగా వున్నాయి.

**(పుస్తకం పేరు : స్వయంసిద్ధ ఒంటరి మహిళల జీవన గాథలు; సంపాదకులు : భండారు విజయ, పి. జ్యోతి; తొలిముద్రణ : మే 2023; పేజీలు : 135; హస్మిత ప్రచురణలు, హైదరాబాద్; వెల : రూ. 300/-; ప్రతులకు : బండారు విజయ, హెచ్.ఐ.జి బ్లాక్-1, ఫ్లాట్-10, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్. ఫోన్ : 8801910908, 86364 68286)**


# రెండవ ప్రపంచ సినీ ఉత్సవం నుండి రెండు సినిమాలు

– బాలాజీ (కోల్‌కతా)

**ఫెడరేషన్** ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ ఇండియా (ఈస్టర్న్ రీజియన్) గత ఏడాది నుండీ కోల్‌కతాలో వరల్డ్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తూ వుంది. ఈ ఏడాది రెండో వరల్డ్ ఫిల్మ్ ఫెస్టివల్ తేదీ 22-09-2023 నుండి 27-09-2023 వరకు నందన్ థియేటర్లో జరిగింది. ఇందులో ఎన్నో దేశవిదేశీ సినిమాలతో పాటు పనామా దేశం నుండి కొన్ని ఆసక్తికరమైన సినిమాలు ప్రదర్శించారు. భారత్‌లోని పనామా రాయభారి మిస్ యసియెల్ బురిల్లో ఆ దేశపు సినిమాలను ప్రేక్షకులకు సమర్పించింది. రెండో రోజు మొదటి సినిమాగా ఆమె పరిచయం చేసిన చాలా ముఖ్యమైన డాక్యుమెంటరీ 'లా మాతామోరోస్'.

**లా మాతామోరోస్ (2017) :**

పనామాలోని జగద్విఖ్యాత కార్మిక నాయకురాలు మార్తా మాతామోరోస్ ఫిగువేరా గురించిన డాక్యుమెంటరీ ఇది. ఒక కమ్యూనిస్టు నాయకురాలి కథను ఆ దేశపు అధికార ప్రతినిధి ప్రెజెంట్ చేయడం చాలా అరుదైన విషయంలా అనిపించింది. ఈ సినిమాను వీక్షకులకు పరిచయం చేస్తూ, 'మార్తా మాతామోరోస్ పోరాటల పుణ్యమా అని నేడు పనామా మహిళలు అన్ని రంగాల్లోనూ ముందున్నారు' అని కొనియాడింది బురిల్లో. ఈ డాక్యుమెంటరీని పనామా దేశపు ప్రసిద్ధ దర్శకురాలు డెల్ఫినా విడల్ నిర్మించింది.




ఈ సినిమాను డాక్యుఫిక్షన్ అని చెప్పడం సరిగా వుంటుంది. టేప్‌లో గతంలో రికార్డు చేసిన మార్తా ఇంటర్వ్యూను ప్లే చేస్తూ అక్కడ్నుంచి ఆమె కార్మికపోరాట జీవితంలోని ముఖ్యమైన ఘట్టాల నాటకీకరణతో సాగుతుంది ఈ సినిమా. మాతామోరోస్ వివిధ ప్రాయాల్లోని పాత్రలను వేర్వేరు నటీమణులు పోషించారు. మార్తా వృద్ధ స్నేహితురాళ్లు కూడా ఈ సినిమాలో కనిపిస్తారు. వీరంతా మార్తా వ్యక్తిత్వంలోని గొప్పతనాన్ని వివరిస్తూ ఆమె ధరించిన టోపీ, చెవి రింగులూ, ఆమె స్వదస్తూరిలో రాసిన పత్రాలూ, ఆమె వివిధ అంతర్జాతీయ కార్మిక సమ్మేళనాల్లో పాల్గొన్నప్పటి ఫొటోలూ ఒక దగ్గరకు చేర్చి ఆమె పేర ఒక మ్యూజియం నిర్మించాలని సంకల్పిస్తున్న దృశ్యంతో సినిమా ముగుస్తుంది.

పనామాలో సంఘటిత కార్మిక శక్తికి మారుపేరు మార్తా మాతామోరోస్. "వయసు కారణంగా నేను ఉద్యమాల్లో పాల్గొనలేక పోతున్నాను. ఒకవేళ నేను ఇప్పటికీ ఉద్యమంలో ఉన్నట్లయితే, వారు నన్ను మళ్లీ జైల్లో పెట్టేవారని నేను ఖచ్చితంగా చెప్పగలను – ఎందుకంటే నేను ప్రతి అన్యాయాన్నీ ఖండించే మనిషిని గనుక!" – అని అంటుంది మార్తా తన వృద్ధాప్య విశ్రాంత జీవితంలో కూడా!

1909 ఫిబ్రవరి 17న పనామా సిటీకి దగ్గర్లో శాంటా ఆనా ప్రాంతంలో పుట్టింది మార్తా. తండ్రి వైపు నుండి 'మాతామోరోస్' అనే ఇంటి పేరునూ, తల్లి వైపు నుండి 'ఫిగువేరా' అనే ఇంటి పేరునూ గ్రహించి మార్తా మాతామోరోస్ ఫిగువేరా అయింది. ఆర్థిక ఇక్కట్ల కారణంగా హైస్కూల్ చదువును మధ్యలోనే ఆపేసి మొదట చెప్పుల ఫ్యాక్టరీలో షూ మేకర్‌గానూ, తర్వాత బట్టల మిల్లులో డ్రెస్‌మేకర్‌గానూ మారింది. అది 1941వ సంవత్సరం. ఎల్ బజార్ ఫ్రాన్సెస్ (లేక ఫ్రెంచ్ బజార్) అనే బట్టల కంపెనీలో పనిచేస్తున్నప్పుడు ఆమె కార్మిక పోరాట జీవితం ఆరంభమైంది. ఆ కంపెనీ కెనాల్ దళాలకూ, ప్రభుత్వ ఉద్యోగులకూ, దౌత్య దళ సభ్యులకూ బట్టలు తయారుచేసేది. ఆ రోజుల్లో వస్త్ర తయారీ పరిశ్రమలో డెబ్బై శాతం మంది మహిళలే ఉండేవారు. వీరు చిన్న చిన్న ఇరుకైన క్యూబికల్స్‌లో వేడిగా, ఉక్కపోతగా ఉండే అనారోగ్యకర, అవమానకర పరిస్థితుల్లో పనిచేసేవారు. రోజుకు 12 నుండి 13 గంటల పని. జీతం వారానికి 5 నుండి 7 డాలర్లు మాత్రమే. అదే పురుషులకైతే 15 నుండి 20 డాలర్ల జీతం వచ్చేది. సూపర్‌వైజర్లు కఠినంగా వ్యవహరించేవారు. మహిళా కార్మికులు బాత్రూముకు వెళ్ళాలన్నా వెసులుబాటు ఉండేదికాదు. ప్రసూతి సెలవులు ఉండేవి కావు. కాన్పుకు ముందురోజు వరకూ పనిచేయాలి. కాన్పు తర్వాత అతి త్వరలో డ్యూటీలో చేరాలి. లేదంటే ఉద్యోగం ఊడిపోతుంది.

1945లో, మాతామోరోస్ 'యూనియన్ ఆఫ్ టైలర్స్ అండ్ అలైడ్ వర్కర్స్ ఆఫ్ పనామా' అనే కార్మిక సంస్థలో చేరి, త్వరలోనే ఆ సంస్థకు ఆర్థిక కార్యదర్శి స్థాయికి ఎదిగింది. 1946లో ఫ్రెంచ్ బజార్ వస్త్ర పరిశ్రమ కార్మికుల సమ్మెను దీక్షతో నడిపించింది. సమ్మె 38 రోజుల పాటు కొనసాగింది. ప్రభుత్వం ఈ సమ్మెను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించి, మాతామోరోస్‌తో సహా మరికొందర్ని పనిలోంచి తొలగించింది. కానీ మిగతా సహచర నాయకురాళ్లు ఈ పోరాటాన్ని

ముందుకు తీసుకుపోవడంతో, మహిళా కార్మికులు అనూహ్యమైన విజయం సాధించారు. మార్తా ప్రతిపాదించిన ముసాయిదాను 1947లో అసెంబ్లీ ఆమోదించింది. జీతాలతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరయ్యాయి. బిడ్డ పుట్టిన సంవత్సరం పాటు సెలవులో ఉన్నా, ఉద్యోగ భద్రత ఉండేలా చట్టంలో మార్పు జరిగింది. ఇక్కడితో ఆగకుండా గతంలో ఉద్యోగం పోగొట్టుకున్న మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకోవాలని పోరాటం చేసింది మార్తా.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో పనామా కాలువ ప్రాంతంలో తిష్టవేసిన అమెరికా మిలిటరీ స్థావరాలకు రాయితీలను కల్పించేవారు. యుద్ధం తర్వాత కూడా ఆ రాయితీలను శాశ్వతంగా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి వ్యతిరేకిస్తూ పనామా కెనాల్‌ను సామ్రాజ్యవాద విముక్తం చేసే పోరాటం సాగించింది మార్తా. 1951లో 'ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కర్స్ ఆఫ్ పనామా'కు మొదటి మహిళా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైందామె. మంచి జీతాలూ, పని పరిస్థితుల కోసం యునైటెడ్ ఫ్రూట్ కంపెనీకి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో పాల్గొంది. ఆ యూనియన్ ప్రతినిధిగా 1953లో వియన్నాలో జరిగిన 'వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్' కాంగ్రెస్‌కు హాజరైంది.

1950లలో మాతామోరోస్ మార్క్స్, లెనిన్ రచనలను అధ్యయనం చేయడం ప్రారంభించింది. సోవియట్ యూనియన్‌లో కార్మికులు సాధించిన ప్రగతిని ప్రత్యక్షంగా చూసివచ్చిన తర్వాత 'పీపుల్స్ పార్టీ ఆఫ్ పనామా'లో చేరింది. ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలిగా పనిచేసింది. మెరుగైన జీతాలూ, సామాజిక సంరక్షణ కోసం బస్సు డ్రైవర్లు చేస్తున్న సమ్మెకు మద్దతు ఇచ్చినందుకు 1951లో ప్రభుత్వం ఆమెను అరెస్టు చేసింది. అరెస్టు చేసిన వందవ రోజు ఆమెను విడుదల చేస్తారని సమాచారం లభించింది. కార్మికులూ, అభిమానులూ, పార్టీ వాళ్ళూ ఆమెను జైలు గేటు వద్ద ఘనంగా స్వాగతం పలికి, ఊరేగింపుగా తమ ప్రియతమ నాయకురాలిని తీసుకుపోవాలని ప్లాను వేసుకున్నారు. 'ఈ దృశ్యం ఊహ కూడా ప్రభుత్వానికి నచ్చలేదేమో! అందుకే ఒక రోజు ముందుగానే అంటే 99వ రోజున ఆమెను విడుదల చేసింది ప్రభుత్వం' అని చెబుతాడు ఒక పార్టీ కార్యకర్త ఈ డాక్యుమెంటరీలో.

1950లలో అమెరికాలో ఉనికిలో ఉన్న మెక్‌కార్థిజం పనామాను కూడా వెంటాడింది. ఆ పరిస్థితుల్లో ఉద్యోగ భద్రత ఉండదన్న ఎరుకతో ఫ్యాక్టరీ ఉద్యోగానికి రాజీనామా చేసి, పూర్తికాలం యూనియన్ పనులపై దృష్టి పెట్టింది మార్తా. 1959లో తీవ్ర నిరుద్యోగం, ద్రవ్యోల్బణానికి నిరసనగా ఆమె చేపట్టిన "ది హంగర్ అండ్ డెస్పరేషన్ మార్చ్" అనే సమ్మెకు భారీ మద్దతునిస్తూ నిరసనకారులు కోలన్ నుండి పనామా సిటీ వరకూ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ యాత్ర ఆ దేశపు ప్రప్రథమ కనీస వేతన చట్టాన్నీ, కొత్త అద్దెదారుల చట్టాన్నీ సాధించింది. 1964-67 మధ్యకాలంలో ఆమె సాగించిన పోరాటాలు విజయం సాధించివుంటే, పనామా అమెరికా దళాల నుండి విముక్తమై మరింత అర్థవంతమైన సార్వభౌమత్వాన్ని అనుభవించేది.

పెళ్లీ, పిల్లలూ కార్యాచరణకు అడ్డంకి అని తలిచి జీవితమంతా ఒంటరిగానే బ్రతికింది మార్తా. పనామా మహిళల కోసం 'అలయన్స్ ఆఫ్ పనామేనియన్ ఉమెన్', 'వాన్‌గార్డ్ ఆఫ్ ఉమెన్', 'ఉమెన్స్ కమిషన్ ఫర్ ది డిఫెన్స్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ ఉమెన్ అండ్ చిల్డ్రెన్', 'నేషనల్ యూనియన్ ఆఫ్ పనామేనియన్ ఉమెన్' ఇత్యాది సంస్థలను స్థాపించింది. 1994లో, ఆమెకు 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమర్ టోరిజోస్ హెర్రెరా' అవార్డు లభించింది. పనామాకు చెందిన 100 మంది అత్యుత్తమ మహిళల్లో ఒకరిగా పనామా విశ్వవిద్యాలయం ఆమెను గౌరవిస్తూ 'ఇన్స్టిట్యూట్ ఫర్ ఉమెన్' విభాగానికి ఆమె పేరు పెట్టింది. 'లైబ్రరీ ఆఫ్ ది నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ వర్కర్స్ ఆఫ్ పనామా' కూడా ఆమె పేరునే వుంది. మినిస్ట్రీ ఆఫ్ లేబర్ అండ్ వర్క్‌ఫోర్స్ డెవలప్‌మెంట్‌లోని ఒక సమావేశ గదికి కూడా ఆమె పేరు పెట్టారు. 2006లో, 'ఆర్డర్ ఆఫ్ మార్తా మాతామోరోస్' అనే అవార్డును ఏర్పాటుచేశారు. పనామాలో జెండర్ ఈక్వాలిటీ కోసం, సామాజిక-ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అభ్యున్నతి కోసం పాటుపడి దేశానికి రోల్ మోడల్‌గా నిలిచే మహిళలను ఈ అవార్డుతో గౌరవిస్తారు.

ఈ ఫెస్టివల్‌లో ప్రదర్శించిన మరో ఆణిముత్యం క్యూబన్ కథా చిత్రం 'హబానాస్టేషన్'.

## హబానాస్టేషన్ (2011) :


లాటిన్ అమెరికా దేశమైన క్యూబాలో ఫిడెల్ కాస్ట్రో, చేగువేరాల నాయకత్వంలో కమ్యూనిస్టు విప్లవం విజయవంతమైంది. 1959లో సరికొత్త సోషలిస్టు రాజ్య స్థాపన జరిగింది. అమెరికా ఆంక్షల మధ్య కూడా సామాజిక న్యాయం సాధించడానికి ఎంతో కృషిచేస్తోంది ఆ దేశం. మొన్నటి కరోనా కట్టడి సంగతితో పాటు ఎన్నో ప్రజా సంక్షేమ సూచికల్లో ముందు వరుసలో ఉంటోంది క్యూబా. అయితే 'క్యూబాలో వర్గ విభేదాలు పూర్తిగా నశించాయా?' అంటే 'ఇంకా లేద'ని మాత్రమే చెప్పాలి. సామాజిక అసమానతలు సమసిపోడానికి ఇంకా చాలా కాలమే పడుతుంది. ఈ దశలో రెండు వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన ఇద్దరు టీనేజీ అబ్బాయిల అందమైన, హృద్యమైన కథ 'హబానాస్టేషన్'. ఇయాన్ పాడ్రోన్ నిర్మించిన ఈ సినిమా చూస్తున్నప్పుడు మనకు వెంటనే గుర్తొస్తుంది సత్యజిత్ రాయ్ లఘుచిత్రం 'టూ'.

ఆ ఇద్దరబ్బాయిలూ రాజధాని హవానాలోని ఒకే స్కూల్లో ఒకే క్లాసులో చదువుకుంటున్నారు. చదువుల క్లాసు ఒకటైనా వారి ఆర్థిక పరమైన క్లాసులు వేర్వేరు. మయిటో (ఎర్నెస్టో ఎస్కలోనా) సంపన్న కుటుంబానికి చెందినవాడు. అతని తండ్రి పెపే (లూయిస్ అల్బెర్టో గార్సియా) ప్రముఖ జాజ్ సంగీతకారుడు. అతడికి భౌతిక సౌకర్యాల విషయంలో కొదువలేదు. తండ్రి ఎప్పుడూ ట్రిప్పుల్లో తిరుగుతూ వుంటే తల్లి అతి గారాభంలో తల్లిచాటు బిడ్డగా గడుపుతుంటాడు. వాడి దగ్గర లేని వీడియో గేమంటూ లేదు. కానీ, ఎన్ని ఉన్నా, తోబుట్టువులు గానీ, స్నేహితులు గానీ లేని ఒంటరివాడు. కాకపోతే వీడియో గేములూ, ప్లే స్టేషన్ల కారణంగా తోటి విద్యార్థుల దగ్గరా, తలిదండ్రుల పరపతి కారణంగా ఉపాధ్యాయుల దగ్గరా అతడికి కొంచెం గుర్తింపు ఎక్కువ. మయిటో తండ్రి కొంత రీజనబుల్‌గా వుంటాడు గానీ, అతడి తల్లి మోరియామాకి (బ్లాంకా రోసా బ్లాంకో) మాత్రం కొంచెం డబ్బు గర్వం ఉంటుంది.

మరోవైపు, కార్లోస్ (ఆండీ ఫోర్నానిస్) అనే మరో కుర్రాడు హవానాలోని 'లా టింటా' అనే మురికివాడలో నివసిస్తుంటాడు. అతని తల్లి చనిపోయింది. తండ్రి జైలులో ఉన్నాడు. అంచేత నాయినమ్మ కొంచాతో (మిరియం సోక్రాస్) కలిసి జీవిస్తున్నాడు. జీవితం అతడికి నిత్య సంఘర్షణ. ఇంటి పనీ, చదువు పనితో పాటు పాతసీసాలు శుభ్రం చేసి అమ్ముకుంటూ 'చిరిన్యా' అనబడే పెద్ద గాలిపటం కొనుక్కోడానికి

డబ్బును దాచుకుంటుంటాడు. వీధి కుర్రాళ్లతో రకరకాల ఆటలాడు కోవడం తెలుసు గానీ, ప్లేస్టేషన్ అన్నదొకటుంటుందని అతడికి తెలీదు. మయిటో ఆడేవి 'వర్చువల్' ఆటలైతే, కార్లోస్ ఆస్వాదించేవి నేస్తాలతో ఆడే పచ్చి, పిచ్చి 'రియల్' ఆటలు.

మేడే ఉత్సవాల కోసం తమ స్కూలు తరుపున హవానా స్క్వేర్‌లో పాదయాత్రలో పాల్గొంటున్న కొద్దిమంది విద్యార్థుల్లో మయిటో ఒకడు. ఆ యాత్ర సందర్భంగా తన టీచర్ క్లాడియా (క్లాడియా అల్వారినో) నుండి తప్పిపోయి పొరపాటున వేరే బస్సు ఎక్కేస్తాడు. సంగతి తెలిశాక, బస్సు దిగి అనుకోకుండా కార్లోస్ ఉంటున్న వాడలోకి చేరుతాడు. కొంతమంది రౌడీ కుర్రాళ్ల నుండి పారిపోతున్న మయిటోను యాదృచ్ఛికంగా కాపాడతాడు కార్లోస్. జీవితంలో మొదటి సారి పేదల బస్తీలోకి వచ్చాడు మయిటో. అక్కడ పేదల జీవన పోరాటాన్నీ, ఆ పోరాటంలోని శ్రమజీవన సౌంధర్యాన్నీ కనుగొంటాడు. 'సమాజంలోని ఆర్థిక అసమానతలను అంతరింపజేయడమే నిజమైన మేడే స్ఫూర్తి' అని తను యాంత్రికంగా చెప్పిన ప్రసంగానికి అసలైన అర్థాన్ని ఆ మురికివాడలో అదే మేడే రోజు మేడే సాక్షిగా గ్రహిస్తాడు. వ్యక్తుల మధ్య వర్గాతీత స్నేహం కుదరాలంటే ఒకర్నొకరు వారి వారి సామాజికార్థిక నేపథ్యాలతో సహా అర్థం చేసుకోవాలని చెబుతుంది ఈ సినిమా.




దర్శకుడు పాడ్రాన్ క్యూబన్ సమాజంలో నెలకొని ఉన్న అంతరాలను చూపుతూనే, వాటిని రూపుమాపే అవకాశం ఉందని ఆశావహంగా ముగిస్తాడు. సినిమా కథ సరళంగా కన్పిస్తూనే చాలా తాత్వికంగా ఉంటుంది. సినిమా ఆరంభంలో మయిటో ఇంట్లో బెల్ పెప్పర్‌తో రోస్టు చేసిన రుచికరమైన చికెన్‌ను ఆస్వాదించే ముందు "లా విదా ఎస్టా ముయ్ దురా," (జీవితం చాలా కష్టతరమైనది) అని మయిటో నాన్న అంటాడు. జీవితం విలాసవంతంగా సాగుతుంటే అంతంత గంభీరమైన మాటల అర్థం తెలిసే అవకాశమే లేదు మయిటోకు. నిజంగానే జీవితం ఎంత దుర్భరమైనదో, కఠినమైనదో మురికివాడ బ్రతుకుల్ని కళ్ళతో చూశాక మాత్రమే అనుభవమౌతుంది అతడికి.

ఆ రోజు తన తండ్రి తెచ్చిన లేటెస్ట్ ప్లే స్టేషన్‌ను దొంగతనంగా తన బ్యాగులో పెట్టుకుని బయల్దేరాడు మయిటో. కార్లోస్‌కు ఆ గేమ్‌ని పరిచయం చేద్దామని వాళ్ల ఇంటి టీవీకి సెట్ చేసి ఆడబోతాడు. కానీ స్విచ్‌బోర్డు మల్టీ సోకెట్‌లో అగ్గి తగిలి ఆ ప్లే స్టేషన్ పాడౌతుంది. సాయంత్రానికల్లా ఆ ఖరీదైన వస్తువును రిపేరు చేయించాల్సిందే. అందుకు డబ్బు కావాలి. దాని కోసం శ్రమ చేయాలి. తనకు చాలా ఈజీగా అందే డబ్బును సంపాదించడం పేదలకు ఎంత కష్టమో అతడికి ఆ రోజు అనుభవం పూర్వకంగా అర్థమౌతుంది.

లోకల్ రౌడీల్ని ఎదిరించినపుడు పొరపాటున జరిగిన హత్య కారణంగా కార్లోస్ తండ్రి జైలుకు వెళ్లాడు. కార్లోస్ కూడా అటువంటి రౌడీల్ని నిత్యం ఎదుర్కుంటూనే ఉంటాడు. 'రౌడీల్నుంచి పారిపోయి వుంటే మీ నాన్న జైలుకు పోకుండా వుండేవాడు కదా?' అని మయిటో అంటే – 'నువ్వు మా ప్రపంచానికి చెందని వాడివి కనుక నీకీ విషయం అర్థం కాదు' అని బదులిస్తాడు కార్లోస్. ధనవంతులు పిరికివాళ్ళే. ప్రతిఘటించడం వారికి చేతకాదు. రిస్కులేని బ్రతుకు కావాలి వారికి. ఇలా రెండు ప్రపంచాల తేడాల్ని చాలా సునిశితంగా పరిశీలిస్తాడు దర్శకుడు. జైలు నుండి తన కోసం తన తండ్రి స్వయంగా తయారు చేసిన తన కలల 'గాలిపటం' (చిరిన్యా) ఆ రోజే అందుతుంది కార్లోస్‌కు. దాన్ని రౌడీ కుర్రాళ్లు చేజిక్కించుకుంటే, 'దాన్ని వదిలెయ్. మరోటి కొనుక్కోవచ్చు, గొడవపడకు' అని మయిటో సముదాయించబోతాడు కార్లోస్‌కు. 'మా నాన్న నా కోసం స్వహస్తాలతో తయారుచేసిన దాన్ని ఎలా వదిలేది?' అని కార్లోస్ ఆ రౌడీ అబ్బాయితో తలపడతాడు. మయిటో ఆలోచనా సరళి ప్రతిసారీ పెద్ద కుదుపుకు గురౌతూ వుంటుంది.


కార్లోస్ తండ్రి బ్రతికుండీ, జైలులో ఉన్నాడు. మయిటో తండ్రి జైలులో లేకున్నా కొడుక్కి అందుబాటులో ఉండడు. ఆ లోపాన్ని వీడియో గేమ్స్ కంపెన్సేట్ చేస్తుంటాయి. ఒకరకంగా మయిటోనే 'ఒక ఖరీదైన ఇంటి బందిఖానా'లో ఉన్నట్టు అర్థం. లెక్క లేనంత మంది నేస్తాలూ, వారితో ఎండా వానల్లో ఆటాడుకోడాలూ – ఈ పేదల ప్రపంచంలోనే సాధ్యం. ఈ ఆట పాటల ముందు తన ఖరీదైన వీడియో గేములు బలాదూరే!

తప్పిపోయిన పిల్లాడి ఆచూకీ కోసం టీచర్ క్లాడియా తన సగం జీతాన్ని వెచ్చించి ఊరంతా గాలిస్తూ వుంటుంది. ఆమె 'సెన్స్ ఆఫ్ డ్యూటీ' అటువంటిది. ఆమె ఇదంతా చేస్తున్నపుడు మయిటో తల్లిదండ్రులు రోజంతా కొత్త ఆల్బం రికార్డింగులో బిజీగా ఉంటారు. కానీ బిడ్డ కనిపించడం లేదని తెలియగానే క్లాడియా పడిన శ్రమను గుర్తించకుండా ముందు వెనుకలు ఆలోచించకుండా ఆమెపై విరుచుకు పడతారు. ఈ విధంగా క్లాస్‌తో ముడిపడివున్న క్యారెక్టరును నిశితంగా వర్ణిస్తుంది ఈ సినిమా.

ప్లే స్టేషన్ రిపేర్ కోసం కార్లోస్ తనకెంతో ఇష్టమైన పావురాన్ని పూజారికి అమ్మేస్తాడు. 'ఏమీ లేకున్నా అన్నీ ఇవ్వడానికి సిద్ధపడే మనసు పేదల చెంతనే వుంటుంద'ని మయిటోకు తెలిసివచ్చే సందర్భమది. తను కూడా తగు విధంగా ప్రతిస్పందించాలిగా! కార్లోస్‌కు వీడ్కోలు చెబుతున్నపుడు అతడికి తన ప్లే స్టేషన్‌ను బహుమానంగా ఇచ్చేస్తాడు మయిటో. జీవితంలో ఇంతకాలమూ కోల్పోయిన సహజానందాన్ని కార్లోస్ ద్వారా అందినందుకు కృతజ్ఞతాపూర్వక భేటీ అది. అన్నట్టు మయిటో ఆ బస్తీలోనే తన ప్రేయసిని కనుగొంటాడు. అతడికి 'తొలిముద్దు' అనుభవం కలిగింది కూడా అక్కడే!

చాలా అవార్డులు సాధించిన ఈ సినిమా క్యూబా తరుపున ఆస్కారు పోటీల కోసం ఉత్తమ విదేశీ సినిమాల విభాగంలోకి ఎంపికైంది. అమెరికా వాళ్లు క్యూబా సినిమాకు అవార్డు ఇవ్వరని మనకు తెలిసిందే. ఈ సినిమా చాలా మంచి క్వాలిటీలో యూట్యూబులో ఇంగ్లీషు ఉపశీర్షికలతో అందుబాటులో వుంది. ✵

## జాతీయ అక్షరయోధులు



# హబీబ్ తన్వీర్

**( 1923 - 2009)**

**19**

**సింగంపల్లి అశోక్‌కుమార్**

# నాటక కళల మున్నీర్

## రంగస్థల ప్రయోగాలలో సరికొత్తకోణం
## మానవీయ విలువలు తన్వీరు ప్రాణం
## సామ్రాజ్యవాద దళారీ విష సంస్కృతికి
## ప్రత్యామ్నాయ ప్రజాసంస్కృతి పోరుగానం

**'టీవీల్లో సెక్సు, హింస, నేరస్వభావం కల్గిన విభిన్న సాంస్కృతిక రూపాలు ప్రజల ముందు ప్రదర్శింప బడుతున్నాయి. ఇదంతా సరళీకరణ పేరు మీద, గ్లోబలైజేషన్ పేరుమీద కొనసాగుతున్నాయి. క్రమంగా ప్రపంచాన్నంతా సామ్రాజ్యవాద దళారీ విషసంస్కృతి కమ్మేస్తూవుంది. దీన్ని ప్రత్యామ్నాయ ప్రజాసంస్కృతితో ఎదుర్కొంటూ మనం ముందుకు సాగాల్సి ఉంటుంది' అంటూ '1994లో హైదరా బాద్‌లో జరిగిన సాంస్కృతిక సామ్రాజ్యవాద వ్యతిరేక సదస్సు'లో హెచ్చరించిన హబీబ్ తన్వీర్-అసలు పేరు హబీబ్ అహమ్మద్‌ఖాన్ తన్వీర్. భారతీయ హిందీ, ఉర్దూ నాటక రచయిత, కవి, థియేటర్ దర్శకుడు, నటుడు. హిందీ, ఉర్దూ చలనచిత్ర రచయిత.**

మునిసిపల్ హైస్కూల్ రాయ్‌పూర్‌లో మెట్రిక్యులేషన్‌నూ, మోరిస్ కాలేజి నాగపూర్‌లో బి.ఏ డిగ్రీనీ పూర్తి చేసి ఆలీఘర్ విశ్వవిద్యాలయంలో ఎం.ఏ ఒక సంవత్సరం చదివారు.

సాహిత్య కళారంగాలలో జాతీయతను రంగరించే కళాపాతాల సృజన చేసిన ప్రతిభాశాలి, అనన్యసామాన్య జనప్రయోజన ప్రగతిశీలి. 1940వ దశకంనాటి అభ్యుదయ రచయితల సంఘంలోనూ, ప్రజానాట్యమండలి(ఇప్టా)లోను అంతర్భాగమయ్యారు. బ్రిటిష్ పాలనను వ్యతిరేకించినందుకు ఇప్టాసభ్యులతో పాటు అరెస్టయ్యారు.

ప్రభుత్వ పద్మశ్రీ, పద్మభూషణ్, సంగీత నాటక అకాడమీ అవార్డులు అందుకున్నారు. 1972-78 మధ్య రాజ్యసభ సభ్యుడుగా నామినేట్ అయ్యారు.

'పోంగా పండిట్'నాటకం-మతోన్మాద దుశ్చర్యలపై గొప్ప అపహాస్య ప్రదర్శన. మతో న్మాదుల అఘాయిత్యాలను ఎదురొడ్డి సాగిన ప్రదర్శన. 'చరణ్‌దాస్ చోర్' అనే రచన స్వాతంత్ర్యం తరువాత దేశంలోని 60 ఉత్తమ రచనల జాబితాలో చోటుచేసుకుంది. ఆధునిక భారత థియేటర్‌లో కొత్త ఇడియమ్ స్థాపించింది. గాన, నృత్యాల ద్వారా వ్యాఖ్యానించే కోరస్ దీని ముఖ్యరూపం. నృత్యకళాకారుడు గోవిందరామ్ నిల్మర్కర్‌ను ఆధునిక నాటకరంగానికి పరిచయం చేశారు.

ఇంకా 'ఆగ్రా బజార్', 'గావ్‌కా నామ్ ససురాల్ మోర్ నామ్ దామాద్', 'కామ్‌దేవ్ కా అప్నా బసంత్ రితూ కా సప్నా' మొ॥ తన్వీర్ నాటక ప్రసిద్ధాలు,ప్రజాసాహిత్య సాంస్కృతిక యుద్ధాలు.

తొమ్మిది చలనచిత్రాలలో నటించారు. పలు చలన చిత్రాలకు స్క్రిప్టులు రాశారు. ఆంగ్లంలో రిచర్డ్ ఆటెన్‌బరో నిర్మించిన 'గాంధీ', అమీర్ ఖాన్ 'మంగళ్‌పాండే'(విడుదల కాలేదు) చిత్రాలలో నటించారు. 2005లో 'మోర్ నామ్ హబీబ్' పేరుతో హబీబ్ తన్వీర్ జీవిత విశేషాలను నయాథియేటర్ గ్రూప్ ఒక డాక్యు మెంటరీ నిర్మించింది. ప్రజాసాహితి 2009 జూలై సంచిక హబీబ్ తన్వీర్ విశిష్ట సంచికగా వెలువడింది.


చత్తీస్‌గడ్ గిరిజనుల జీవితంతో పెనవేసుకుపోయిన దక్షిణాసియాకి చెందిన బ్రెర్టోల్ట్‌బ్రెష్ట గానూ, భారతరంగస్థల ఆధునిక వైతాళికుడిగానూ ప్రముఖుల ప్రశంసలు అందుకున్న హబీబ్ తన్వీర్1923 సెప్టెంబర్,1న చత్తీస్‌గడ్‌లోని రాయ్‌పూర్‌లో జన్మించారు. మధ్య ప్రదేశ్ భోపాల్‌లో మూడు వారాలపాటు అనారోగ్యంతో బాధపడుతూ 2009 జూన్, 8న కన్నుమూశారు ✺

# 'పాలకవర్గాల సామాజిక - రాజకీయ ఆధిపత్యాన్ని కొనసాగించే పాత్రను ఫౌండేషన్స్ పోషిస్తున్నాయని' చెప్పిన "ఫౌండేషన్స్ అండ్ పబ్లిక్ పాలసీ : ది మాస్క్ ఆఫ్ ప్లూరలిజం"

జోవాన్ రోయెలోఫ్స్

పరిచయకర్త : జి.వి. భద్రం

**అమెరికాలో** ఫోర్డు, రాక్‌పెల్లర్, కార్నెగె, బిల్‌గేట్స్‌లాంటి ప్రపంచ ప్రఖ్యాత ఫౌండేషన్లతోపాటు, ఇంకా అనేకమయిన ఫౌండేషన్లు తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. వీటి కార్యకలాపాలను, అవి నిర్వహించే పాత్రను రాజకీయ శాస్త్రవేత్త అయిన జోవాన్ రోయెలోఫ్స్ లోతుగా అధ్యయనం చేసి తాను తెలుసుకొన్న విషయాలను "ఫౌండేషన్ అండ్ పబ్లిక్ పాలసీ : ది మాస్క్ ఆఫ్ ప్లూరలిజం" (ఫౌండేషన్లు మరియు ప్రజావిధానాలు : బహుళత్వం యొక్క ముసుగు) అనే పుస్తకాన్ని రచించారు. ఆవిడ వ్రాసిన యీ పుస్తకాన్ని స్టేట్ యూనివర్శిటీ ఆఫ్ న్యూయార్కు ప్రెస్‌వారు 2003లో ముద్రించారు.




అమెరికా దేశంలోని అత్యంత సంపన్నులయిన ఫోర్డు, రాక్‌ఫెల్లర్, బిల్‌గేట్సు లాంటివారు యీ ఫౌండేషన్లను స్థాపించిన నాటి నుండి అవి 'విద్య, ఆరోగ్య, సామాజిక సేవలు, మీడియా, కళలు, సంస్కృతి, ప్రజాహిత వ్యాజ్యాలు, సామాజిక ఉద్యమాలలాంటి రంగాలలో పలురూపాలలో విస్తృతంగా కార్యకలాపాలను నిర్వహిస్తూ ఒక ప్రత్యేకమైన పాత్రను నిర్వహిస్తున్నాయి. అవి నిర్వహించే పాత్ర యొక్క అసలు, వాస్తవ స్వభావాన్ని జోవాన్ రోయెలోఫ్స్ తన అధ్యయన సారాంశంగా ప్రపంచం ముందు బట్టబయలు చేశారు.

1892లో కార్నెగీ తనకు చెందిన హోమ్‌స్టెడ్‌లో గల ఇనుము మరియు ఉక్కు పరిశ్రమకు చెందిన కార్మికులపై సాయుధంగా దాడి జరిపించాడు. ఆ దాడిలో 16 మంది కార్మికులు చనిపోయారు.

1914లో రాక్‌ఫెల్లర్‌కు చెందిన లడ్లోలోని ఒక గనిలో కార్మికులపై జరిపిన ఊచకోతలో కార్మికులు – కార్మికుల కుటుంబ సభ్యులూ 33 మంది మరణించారు.

1936లో ఉవ్వెత్తున కార్మిక ఉద్యమాలు ఎగుస్తున్న సమయంలో ఫోర్డు మోటారు కంపెనీలో కూడా కార్మికోద్యమం ఉవ్వెత్తున సాగింది. దానిని అణచివేసే వైఖరులను – విధానాలను ఫోర్డు యజమాన్యం అవలంభించింది.

అయితే యీ కార్మిక వ్యతిరేక నరహంతక సంపన్న పెట్టుబడిదారులే ప్రజాహిత ఫౌండేషన్లను స్థాపించారు. 1911లో కార్నెగీ తన ఫౌండేషన్‌ను స్థాపిస్తే 1913లో రాక్‌ఫెల్లర్ తన ఫౌండేషన్‌ను స్థాపించాడు. 1936లో రాష్ట్రస్థాయిలో ఫోర్డ్ ఫౌండేషన్‌ను స్థాపించారు. పెట్టుబడిదారీ విధానం ప్రజలందరికీ, అత్యంత యోగ్యమైన మంచిని పెంపొందించకలిగే సామర్థ్యాన్ని కలిగి వున్నాయని చూపించటానికే ఈ ఫౌండేషన్లను స్థాపించారు.

ఈ ఫౌండేషన్లు అన్నింటికి అనంతమైన పలుకుబడి, అధికారాలున్నాయి. వీటిని స్థాపించటానికి గల మూలకారణాలు మాత్రం మన కళ్ళకు కనబడవు. 'మూడవ రంగం' (ప్రభుత్వరంగం కాని, లాభం కోసం వాణిజ్య వ్యాపారాలు నిర్వహించే రంగం కాని యితర రంగం)గా పేర్కొనబడే యీ రంగానికి చెందిన సంస్థలు 1998 నాటికే అమెరికా దేశంలో 10 లక్షల 30 వేల సంఖ్యకు మించిన 'స్వతంత్రరంగ సంస్థలు'గా పనిచేస్తున్నాయి. (వీటిలో ప్రముఖమైన ఆస్పత్రులు, యూనివర్శిటీలు కూడా వున్నాయి). 1997 నాటికి యీ సంస్థల ఆదాయం 665 బిలియన్ల డాలర్లు కాగా, వీటిలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య 1 కోటి 10 లక్షల మంది వరకూ వుంది. దీనిని బట్టి యీ 'స్వతంత్ర' సంస్థలు అమెరికా దేశపు ఆర్థికవ్యవస్థలో ఎంతటి గణనీయమైన స్థానాన్ని ఆక్రమించుకొన్నాయో అర్థం చేసుకోవచ్చు.

అటువంటి ఫౌండేషన్లను గురించి అధ్యయనం చేయాల్సిందిగా, తన తోటి రాజకీయ శాస్త్రజ్ఞులను, యిరవై సంవత్సరాలపాటు జోవాన్ రోయెలోఫ్స్ ఎంతగా బ్రతిమాలినా ఎవరూ అందుకు పూనుకోలేదు. "ఆ ఫౌండేషన్లు చాలా పలుకుబడి గలవి. అయినా అవి వాటికి గల అధికారాన్ని గురించి తక్కువ చేసి చెప్తాయి. అదేవిధంగా చాలామంది పరిశోధకులు కూడా ఆ ఫౌండేషన్ల పలుకుబడి, అధికారాలను గురించి తక్కువ చేసి చెప్తారు. ఫౌండేషన్లు తమ యొక్క "గేటు కాపలాదారుని" పాత్ర, నిధులు సమకూర్చే దాతల పాత్రల ద్వారా, తమ సంస్థలను గానీ, తమచే స్పాన్సరు చేయబడ్డ సంస్థలను గానీ విమర్శించటాన్ని

నిరుత్సాహపరుస్తాయి. విమర్శనాయుత అధ్యయనాలను నామమాత్రం చేస్తాయి". అని జోవాన్ రోయెలోఫ్స్ తన అనుభవం ద్వారా గ్రహించారు.

"పాలకవర్గాల సామాజిక – రాజకీయ ఆధిపత్యాన్ని కొనసాగించే పాత్రను" ఫౌండేషన్లు పోషిస్తున్నాయన్నది ఆవిడ అభిప్రాయం. విస్తృతమైన శ్రేణుల సంస్థల కార్యకలాపాల ద్వారా ఫౌండేషన్లు, పాలితుల యొక్క ఆమోదాన్ని తయారుచేస్తున్నాయని ఆవిడ అభిప్రాయం. అటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థలూ, వ్యక్తులూ (స్వయంగా వారు పాలకవర్గానికి చెందినవారు కాకపోయినప్పటికీ) పాలకవర్గం యొక్క అభిప్రాయాలనూ, సిద్ధాంతాలనూ, భావజాలాన్నీ అవే ప్రపంచజ్ఞానం (సాధారణ ఇంగిత జ్ఞానం) అన్నట్లుగా వాటిని వ్యాపింపజేస్తారు. పాలకవర్గ అభిప్రాయాలకు, సిద్ధాంతాలకూ భిన్న, వ్యతిరేక అభిప్రాయాలను 'తీవ్రవాదం'గా ముద్రవేస్తూనే, భిన్నాభిప్రాయాలు గల వ్యక్తులను ఫౌండేషన్లు తమలో యిముడ్చుకొని వారిలో పరివర్తన తీసుకురావటానికి ఆహ్వానిస్తాయి. అదేవిధంగా కొత్తగా తలెత్తుతున్న ధోరణులను కూడా యీ ఫౌండేషన్లు సమర్థవంతంగా తమలో యిముడ్చుకొంటున్నాయని ఆవిడ వెల్లడించారు.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం, కమ్యూనిజం ప్రపంచమంతటా వ్యాప్తి చెందటం, ప్రత్యేకించి చైనాలో కమ్యూనిజం విజయం సాధించటంతో, "ప్రజాస్వామ్యానికి సహాయం చేయటం కోసం" "కమ్యూనిజం యొక్క సవాలును ఎదుర్కోవటం" అనే లక్ష్యాలతో ఫోర్డు ఫౌండేషన్ ఒక జాతీయ, అంతర్జాతీయ ఫౌండేషన్‌గా మారింది.

మూడవ రంగంగా అభివర్ణించుకొనే యీ ఫౌండేషన్‌రంగం, పెట్టుబడిదారీ విధానానికి పలు రూపాలలో రక్షణ కవచంగా పనిచేస్తున్నదని రచయిత్రి ఈ పుస్తకంలో తెలియచేశారు. పారిశ్రామిక పతన కాలం సంభవించినపుడు ఆర్థిక మాంద్యానికి సంబంధించిన కొన్ని సమస్యలను తలకెత్తుకుని లాభం కోసంకాకుండా కొన్ని సరుకులనూ, సేవలను (నిరాశ్రయులకు శరణాలయాల నుండి, అత్యున్నత సంస్కృతి వరకూ) మార్కెట్టు అందివ్వలేని వాటిని అందిస్తాయనీ, ఆ రకంగా పెట్టుబడిదారీ విధానం యొక్క వైఫల్యాలకు మాసికలు (అతుకులు) వేస్తాయని ఆమె వెల్లడించారు. వ్యవస్థకు ఒక సవాలుగా ఎదురుకాబోయే సమస్యాత్మకపూరితమయిన పరాయీకరింపబడిన (వ్యవస్థకు వ్యతిరేకంగా) శక్తులను అవి తమలో కో–ఆప్ట (కలుపుకోవటం) చేసుకొంటాయని ఆవిడ తెలియజేశారు. అటువంటివారికి ఆసక్తికరమైన ప్రత్యేకమైన జ్ఞానం, లక్ష్యం గల ఉద్యోగాలు ఆ సంస్థలు యిస్తాయి. 'ఆ సంస్థలు ప్రజా ఉద్యమాలను మైనార్టీల "అస్థిత్వ" ఉద్యమాలుగా (ఆఖరుకు నిరుపేదలను కూడా 'మైనారిటీ'లుగా పరిగణించే ఉద్యమాలుగా) తునాతునకలుగా విడదీయటానికి, చీల్చివేయటానికి ఉపయోగపడతాయి. ఈ రకంగా విడదీయబడ్డ 'మైనారిటీ' 'అస్థిత్వవాద' ఉద్యమాలు ఉన్నత విద్యకు చెందిన కార్యకలాపాలలోను, లిటిగేషన్ (న్యాయవివాద) అంశాలపైనా కేంద్రీకరిస్తాయి. ఆఖరుగా అవి 'విచ్ఛిన్నకరమైన' లేదా విప్లవకరమైన ఉద్యమాలకన్నా ముందుగా వుండి, ఆయా సందర్భాలలో రాజకీయ మార్పును మనుగడలో వున్న పాలకవర్గాల చట్రంలోనే తీసుకురావటం అన్నదానిపై కేంద్రీకరిస్తాయి'.

ఈ ఫౌండేషన్లు, యూనివర్శిటీలు, పరిశోధనాసంస్థలు, సాంస్కృతిక సంస్థలు, మీడియా, మేధోవాతావరణాలపై తమ ప్రాబల్యాన్ని, ప్రభావాన్ని సాధించుకొని, వాటి ద్వారా సైద్ధాంతిక అభిప్రాయాలను ఆదర్శాలను (పెట్టుబడిదారీ వ్యవస్థ విధానాలను, సామ్రాజ్యవాద అనుకూల సిద్ధాంతాలను, భావజాలాన్నీ) విరివిగా ముందుకు తీసుకుపోతాయి. 1949లో ఫోర్డు ఫౌండేషన్ ఒక జాతీయ ఫౌండేషన్‌గా రూపొందటం అన్నది ఫౌండేషన్లకూ సామాజిక శాస్త్రాలకూ మధ్య ముమ్మరంగా కలిసి పనిచేయటానికి భవిష్యత్తు సూచకంగా వుంది అని ఆమె అభిప్రాయం. "ఆధునిక శాస్త్ర పరిశోధన మొత్తానికి యించుమించుగా (అమెరికా దేశంలో) ఫౌండేషన్లే నిధులను యిస్తున్నాయి" అని ఆమె తెలియజేశారు. ఫౌండేషన్లు నిధులు యిచ్చేవాటిలో ఉన్నతవిద్య పరిశోధనాగ్రాంట్లు, ఇంటర్న్‌షిప్‌లు, ఫెలోషిప్‌లు, కాన్ఫరెన్సులు, వృత్తిపర సంస్థలకు మద్దతు, పాండిత్య – పత్రికలు, గంభీరమైన పత్రికలు, ఇంటర్నెట్ డేటాబేస్‌లు, ప్రభుత్వ రేడియో, టెలివిజన్లు, ఆలోచనా కాసారాలు (థింక్‌టాంక్స్) విధాన సంస్థలు లాంటివి ఎన్నో వుంటాయి. ఈ సంస్థలన్నీ ప్రచారం చేసే అభిప్రాయాలు – సిద్ధాంతాలూ, జనాభాలోకి, మెల్లగా ప్రవహిస్తాయి. ఉదాహరణకు ఫౌండేషన్ల మద్దతుతో నిర్వహింపబడుతున్న ఆలోచనా కాసారాలు, అమెరికా దేశంలోని ఆర్థికశాస్త్రంపైనా, రాజకీయ శాస్త్రంపైనా, సామాజికశాస్త్రంపైనా వ్రాసిన పేరొందిన పుస్తకాలతోపాటు అనేకమైన పుస్తకాలను, రిపోర్టులను (నివేదికలను) ఉత్పత్తి చేస్తున్నాయి. రేడియో, టెలివిజన్, ప్రింట్ మీడియాలకు వ్యాఖ్యాతలను సరఫరా చేస్తాయి. కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తాయి. విధానాలను రూపొందించుతాయి. ఈ లక్ష్యం కోసం మొత్తం విద్యావిషయక వ్యవస్థలనే పునర్నిర్మిస్తాయి. ఫోర్డు ఫౌండేషన్ రాజకీయ శాస్త్రానికి సంబంధించిన జ్ఞానాన్ని నేర్చుకొనే పద్ధతిని, ఒక ప్రవర్తనా దిశ వైపుకు – అంటే మానవ రాజకీయ ప్రవర్తనను, గమనించకలిగే "శాస్త్రీయ" అధ్యయన దిశగా – అంటే నేరుగా గమనించ సాధ్యంకాని, తమతమ వర్గాల ప్రయోజనాలపై మానవులు ప్రవర్తించే విషయాన్ని అధ్యయనం చేయటానికి దూరమైన అధ్యయన దిశ వైపుకు మార్చివేసింది. కేవలం 1951 నుండి 1957 కాలంలోనే ఫోర్డు యొక్క ప్రవర్తనాశాస్త్రాల డివిజన్ 23 మిలియన్ల డాలర్లను వెచ్చించి, తన అభిప్రాయాలతో, అవగాహనతో విభేదించే, సాంప్రదాయబద్ధ లేదా మార్క్సిస్టు రాజకీయ శాస్త్రవేత్తలను, గుర్తింపు లేనంతటి నామమాత్రపు శాస్త్రవేత్తలుగా తగ్గించివేయగలిగింది. 1950ల నుండి 1960ల వరకూ అమెరికా దేశపు దాతృత్వ సంస్థల ద్వారా, రాజకీయ శాస్త్రానికి, ఫోర్డు కాంప్లెక్స్ 90 శాతం నిధులను ప్రవహింపజేసింది. ఆ రకంగా విద్యావేత్తలు తమ పరిశోధనాగ్రాంట్లను పొందేందుకు, ఏవిధమైన పాఠాలను నేర్చుకొన్నారో! ఆమె నిర్దిష్టమయిన ఉదాహరణలను ఇచ్చారు.

అంతర్జాతీయ వ్యవహారాలను అధ్యయనం చేసే విషయంలో కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్ (సి.ఎఫ్.ఆర్)కు ఎంతో పేరు ప్రఖ్యాతులున్నాయి. దీనిని తొలుత రాక్‌ఫెల్లర్, కార్నెగీలు స్థాపించినా, యిప్పుడు ఫోర్డు కూడా వీరితో చేరి విదేశీ విధాన విద్యావేత్తలనూ, ప్రభుత్వ అధికారులను, బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లను, కార్మిక నాయకులను, జర్నలిస్టులను ఐక్యపరుస్తున్నాయి. ఈ సంస్థలతో సి.ఐ.ఏ కూడా సంబంధాన్ని ఏర్పరచుకొని వుంది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం

ఫోర్డు ఫౌండేషన్ నిధులతో రిసెర్చి అండ్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ (ఆర్.ఎ.ఎన్.) స్థాపించబడింది. ఈ సంస్థ యొక్క పరిధి అమెరికా దేశపు వైమానిక శక్తికి అవసరమయిన ఆయుధాల పరిశోధన నుంచి అన్ని రకాల వ్యూహాత్మక వ్యవహారాల పరిశోధన వరకూ విస్తృతపరచబడింది.

అంతర్జాతీయ సంబంధాలను అధ్యయనం చేసే కేంద్రాలు, సంస్థలతోటి, ఫౌండేషన్ల సలహాతో హార్వర్డ్ కొలంబియా, మిట్ (ఎం.ఐ.టి) తదితర ప్రముఖ యూనివర్శిటీలు నెలకొల్పిన సంస్థలతోటి సి.ఐ.ఎ. దగ్గరి సంబంధాలను కలిగి వుంది. అమెరికా ప్రభుత్వంతో సహకరించని సంస్థలకు, నిధులు (ఫౌండేషన్లు గ్రాంట్ చేసిన) యివ్వకుండా నిలిపి వేయబడతాయి. ఉదాహరణకు ఎంతగానో గౌరవింపబడే, స్వతంత్ర సంస్థ అయిన హిస్పానిక్ – అమెరికన్ సంస్థ, లూసో – బ్రెజిలియన్ అధ్యయన సంస్థ (స్టేన్‌ఫోర్డులో వుంది)లను, ఫోర్డు నిధులు తీసుకోవటం కోసమని నాశనం చేయబడ్డాయి.

ఈ ఫౌండేషన్లు ప్రపంచమంతటా విస్తరిస్తాయి. మూడవ ప్రపంచానికి చెందిన భవిష్యత్తు నాయకులు, ఫౌండేషన్లు మద్ధతులో యివ్వబడ్డ ఫెలోషిప్‌లతో అమెరికా దేశపు విశ్వవిద్యాలయాల్లో శిక్షణను పొందుతున్నారు. ప్రపంచమంతటా యూనివర్శిటీలలో వున్న సామాజిక శాస్త్ర శాఖలకు ఫౌండేషన్లు తమ మద్ధతును యిస్తున్నాయి. 1961లో కాంగోలో ఫోర్డు ఒక జాతీయ న్యాయ, పరిపాలనా స్కూలును స్థాపించింది. తర్వాత ఆ స్కూలులో చదువుకొన్న 400 మందికి పైగా కులీన విద్యార్థులు కాంగో అంతటా పౌర సంబంధ పాలనాధికారులుగానూ, న్యాయాధి కారులుగానూ పరిపాలనాధికారులుగానూ నియమించారు.

1919 నుండి 1940 వరకూ గల మధ్యకాలంలో బ్రిటన్‌లోని సామాజిక శాస్త్రంలోని ప్రధాన భాగం దాదాపు 50 మిలియన్ల డాలర్లు నిధులను రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ నుండి తీసుకొని, వాటి మద్ధతుతో నిలబడింది. లండన్ స్కూల్ ఆఫ్ ఇకనమిక్స్‌తోబాటు లండన్‌లోని యితర ప్రతిష్టాకరమైన సంస్థలూ, జెనీవా, ప్యారిస్, బెర్లిన్, కోపెన్‌హాగన్, స్టాక్‌హోం, జోస్లో, నెదర్లాండ్స్ తదితర పట్టణాలలోని సంస్థలూ యీ అమెరికన్ ఫౌండేషన్ల నుండి భారీగా నిధులను అందుకొన్నాయి. ఆ రకంగా 1950ల నాటికే ప్రపంచంలోని రాజకీయశాస్త్రం, ముమ్మరంగా అమెరికనైజు అవుతున్న క్రమంలో వుంది.

యిరువైపుల వాదానికి నిధులనివ్వటం ద్వారా ఫౌండేషన్లు పాలకవర్గాల యొక్క చట్టపరిధిలోనే వుండేటట్లు కట్టుదిట్టం చేయగలవు. బ్రూకింగ్ ఇన్‌స్టిట్యూషన్‌ను ప్రధానమైన ఉదారవాద ఆలోచనాకాసారంగా పరిగణిస్తారు. అమెరికన్ ఎంటర్‌ప్రైజెస్ ఇన్‌స్టిట్యూషన్ పేరెన్నికగన్న మితవాద సంస్థ. అయితే యీ రెండు సంస్థలూ ఫోర్డు ఫౌండేషన్ నుండి నిధుల గ్రాంటులను స్వీకరిస్తున్నాయి. ఫోర్డు ఫౌండేషన్‌తోపాటు యితర ఫౌండేషన్ల నిధులతో ది ఎకనమిక్ పాలసీ ఇన్‌స్టిట్యూట్ ప్రోత్సాహాన్ని అందుకుంటోంది. ముందుకు వెళుతోంది. ఆ సంస్థ 1986 నుండీ కార్మిక సంఘాలకు పరిశోధనావసర విషయాలను సమకూర్చుతూ వాటికి తోడ్పాటునిస్తోంది. ఉదాహరణకు ఉత్తర అమెరికన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకించేందుకు అవసరమైన వివరాలను అందించి తోడ్పడింది. అదే సమయంలో ఉత్తర అమెరికన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలకు అనుకూలమైన, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనమిక్స్‌కూ, 100 లేటినో సంస్థలకూ కూడా ఫోర్డు ఫౌండేషన్ నిధులను అందించింది.

అణచబడ్డ శ్రామికులు, పేదలు ఐక్యం కావాలనే అవగాహనను వ్యతిరేకించే సిద్ధాంతాలను, భావజాలాలను యీ ఫౌండేషన్లు తమ మద్దతుతో పెంచి పోషిస్తున్నాయి. 1960లలో వివిధ అణచివేతకు గురైన సెక్షన్ల ప్రజలకు చెందిన వ్యవస్థకు వ్యతిరేకమైన సంస్థలు మధ్య ఐక్యత ఏర్పడే సూచనలు కనబడిన వెంటనే (ఉ॥ న్యూ మెక్సికోలోని బ్లాక్ బెరెట్స్ యొక్క ఒక మిలిటెంట్ సంస్థ, బ్లాక్ ఫాంథర్స్ సంస్థతోనూ, యంగ్ లార్డ్స్ మరియు అమెరికన్ ఇండియన్ల ఉద్యమంతోనూ కలవటం వారికి తన సంఘీభావాన్ని తెల్పటం లాంటివి జరిగిన వెంటనే) అమెరికా దేశపు పాలకవర్గాలు కలవరపడ్డాయి. దాంతో సామాజికంగా అణచివేతకు గురైన ప్రతి సెక్షనులోనూ "ప్రత్యేక అస్థిత్వ రాజకీయాలు" పుట్టుకు రావటం అన్నది ప్రారంభమైంది. 1970లో ఫోర్డు ఫౌండేషన్ మహిళాసమస్యల అధ్యయనం కోసం నిధులు యివ్వటం ప్రారంభించింది. ఈనాటికీ ఆ మహిళా సమస్యల అధ్యయనం అన్నది ఒక ప్రధాన అధ్యయన క్షేత్రంగా కొనసాగుతూ వుంది.

అణచివేయబడిన అన్ని సెక్షన్ల ప్రజలకు చెందిన ఒక విస్తృతమైన విముక్తి చట్రం నుండి తెగతెంపులు చేసుకొన్న వ్యక్తివాద వేర్పాటు గ్రూపుల యొక్క 'అస్తిత్వవాద రాజకీయాలు' పాలకవర్గాలకు ఎంతో మెరుగ్గా సేవచేయకలుగుతాయి. ఉదాహరణకు అమెరికా దేశపు సైన్యం మహిళలకు, మైనారిటీలకు అవకాశాలను అందచేయటమన్నది పెరిగి పోతోంది. అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని కొనసాగించటంలో, ఆఖరుకు వివిధ దేశాలలో మహిళలను, అణచివేతకు గురైన ప్రజలనూ చంపటానికీ కూడా మహిళలకూ, మైనారిటీలకు ఎక్కువ అవకాశాలను కల్పిస్తోంది. ఫౌండేషన్లు తీసుకొంటున్న యీ చొరవలు, సమరశీల ఉద్యమాలను చీల్చివేయటం కాకుండా, ఆయా సంస్థలను వృత్తితత్వంతో నాయకత్వం వహించే వారిచేత నిర్వహింపబడే విద్యుత్ సంస్థలు లేదా నిరంకుశ సంస్థలుగా మార్చివేశాయి.

ఇక మీడియా అనేది, ఆలోచనాకాసారాల గొలుసులో ఒక లింక్ (లంకె)గా వుంది. మితవాదం నుండి, వామపక్ష వాదం వరకూ గల పత్రికలు అన్నీ తదుపరి కాలంలో ('ది నేషన్', 'మదర్ జోన్స్', 'ది ప్రోగ్రెసివ్', 'ఇన్‌దీజ్ టైమ్స్' పత్రికలు కూడా) యీ ఫౌండేషన్లు నుండి నిధులు అందుకొన్నాయి. అదేరకంగా ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఆల్టర్‌నేటివ్ జర్నలిజం, పబ్లిక్ బ్రాడ్‌క్యాస్టింగ్, డేటాబేస్‌లు, ఆల్టరనేటివ్ ఆన్‌లైన్ సర్వీసులైన ఒన్ వరల్డ్ నెట్‌వర్క్ లాంటివి కూడా యీ ఫౌండేషన్లు నుండి నిధులు స్వీకరించాయి.

ఫౌండేషన్లు వ్యవస్థను ఏవిధంగా అర్థం చేసుకోవాలి అన్న విషయాన్నేకాక, సిగ్గుపడాల్సిన కన్నీరు కార్చాల్సిన అంశాలను, వ్యవస్థకు ఎలా అతుకువేయాలి అన్న విషయాన్ని కూడా పట్టించుకుంటాయి. కళలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు నిధులనివ్వటం ద్వారా, కేవలం మార్కెట్లు చేయలేని పనిని – అంటే కళాకారులను, రచయితలను, సంగీతకారులను 'ప్రమాదకరమైన రాజకీయాల' నుండి దూరంగా వుంచటాన్ని – ఫౌండేషన్లు సాధించాయి.

కొన్ని సాంస్కృతిక నిధులు విదేశాలకూ ప్రవహించాయి. ఫిలిప్పిన్స్‌పై అమెరికా జరిపే దోపిడీని అన్వేషించి, నాటకాలను ప్రదర్శించే, 1960లో

ఏర్పాటు చేయబడ్డ 'ఫిలిప్పిన్ ఎడ్యుకేషనల్ థియేటర్ అసోసియేషన్' (పెటాకు)కు ఫోర్డు ఫౌండేషన్ నిధులు ప్రవహించటంతో "ఘర్షణ పడే నాటక సమాజం"గా పిలువబడే పెటా "సాధికారతా నాటక సమాజం"గా మారిపోయింది. ఆ రకంగా పెటా సంఘం యొక్క మహిళా నాటక కార్యక్రమాలు రూపొందాయి. ఇప్పుడు యీ నాటక సమాజం దేశం అంతా పర్యటిస్తూ వివాదాస్పదంకాని గృహహింస, 'పునరుత్పత్తి ప్రక్రియలో మహిళల ఆరోగ్యం' వంటి యితివృత్తాలు గల నాటికలు, నాటకాలను ప్రదర్శిస్తోంది. ఫిలిప్పిన్స్, అమెరికా పాలకవర్గాల దోపిడీ, పీడనల గురించి విచారపడాల్సిన అవసరంలేని యితివృత్తాలను ఆ పెటా నాటక సంస్థ ఎంచుకొంది.

ప్రజాఉద్యమాలకు బదులుగా, వాటి స్థానంలో వ్యాజ్యాలు లేవనెత్తడం అన్నదానికి (లిటిగేషన్‌కి) ఫౌండేషన్లు తమ మద్దతునిస్తాయి. లిటిగేషన్ కోసం ప్రజలను భారీసంఖ్యలో సమీకరించాల్సిన అవసరంలేదు. ఈ పద్ధతి మితవాదుల యొక్క కార్యక్రమాలకు నిరపాయకరమైన, క్షేమకరమైన మార్గం. ప్రజాప్రయోజన చట్టమన్న దాన్ని యించుమించు మొత్తంగా ఫౌండేషన్లు సృష్టించినదేననీ, ఫౌండేషన్లు యీ విషయమై సుప్రీంకోర్టు (అమెరికా దేశపు) ఎజెండాను రూపొందించటంలో తోడ్పడ్డాయని ఆవిడ వివరించారు. ఫోర్డు ఫౌండేషన్ ప్రకారం తన యొక్క లక్ష్యం "నిర్మాణాత్మకంగా అవసరమైన సామాజిక మార్పును ముందుకు తీసుకుపోవడమట!. కొత్తగా తలెత్తే సమంజసమైన, న్యాయబద్ధమైన సమస్యలతో వ్యవహరించటం కోసం, సాంప్రదాయక పద్ధతులను తెరవటం వలన, చట్టాల ప్రక్రియపట్ల ప్రజల విశ్వాసం బలపడుతుందట! ఈ రకంగా తమ సమస్యల పరిష్కారం కోసం వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడవల్సిన ప్రజలను చట్టబద్ధత వైపుకి ప్రక్కదారి పట్టిస్తాయి యీ ఫౌండేషన్లు. వ్యవస్థ యొక్క దోపిడీ, ప్రజావ్యతిరేక స్వభావాలపట్ల వ్యతిరేకతతో వున్న ప్రజల యొక్క ఆగ్రహ, ఆవేశాల యొక్క మౌలిక స్వభావం నుండి, వారిని ప్రక్క దోవలకు (ఉద్యమమార్గం చేపట్టకుండా) పట్టించటమన్నది యీ ఫౌండేషన్లు ప్రజాప్రయోజన వ్యాజ్యాల ద్వారా అవలంభిస్తున్న పద్ధతి.

అమెరికాలో అత్యంత ప్రాధాన్య ప్రాముఖ్యతలు గల ప్రజా ఉద్యమాలు జాతి విద్వేష అణచివేత వ్యతిరేక ఉద్యమాలు. 1920ల–1940లకు మధ్య కాలంలో, ఎన్నో ప్రతికూల, కష్టతర పరిస్థితుల మధ్య అమెరికా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ, అనేక అణచివేతలను ఎదుర్కొంటూ, జాతి వివక్షతా సమస్యను తీసుకొంది. అందువలన ఆ పార్టీ వెనుక ఒక గణనీయమైన నల్లజాతివారి యొక్క విశ్వసనీయమైన అనుచరవర్గం సమీకృతమయింది. దీనితో పాలకవర్గాలలో కలవరం ఏర్పడింది. ఇందుకు ప్రతిగా అప్పటివరకూ నల్లజాతివారి సమరశీల చైతన్యాన్ని అదుపులో వుంచుతూ, నిలువరిస్తున్న నేషనల్ అసోసియేషన్ ఫర్ ది అడ్వాన్సుమెంటు ఆఫ్ కలర్ పీపుల్ (నల్లజాతి ప్రజల పురోభివృద్ధికై వున్న జాతీయ సంఘం)కు 1950లలో ఫోర్డు సంస్థ నిధులు సమకూర్చింది. ఆ నిధులతో ఆ సంఘం ఒక లీగల్ డిఫెన్సు ఫండ్‌ను ఏర్పాటుచేసింది.

1960లలో నల్లజాతి, యితర మైనార్టీ ప్రజల్లో చైతన్యం వెల్లువెత్తటం ప్రారంభమయింది. దానితోపాటు ఫౌండేషన్లు ప్రజా ప్రయోజనవ్యాజ్య సంస్థలను కూడా ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేశాయి. 1967–1975ల మధ్య ఫోర్డు ఫౌండేషన్ అటువంటి 23 ప్రజావ్యాజ్యాల సంస్థలను సృష్టించింది. కేవలం 1970లోనే తమ చెప్పుచేతల్లో మెలిగే నల్లజాతి సంస్థలకు ఫౌండేషన్లు 15.6 మిలియన్ల డాలర్ల నిధులను సమకూర్చాయి. తొలుత దక్షిణ క్రిస్టియన్ నాయకత్వపు మహాసభ, ఫౌండేషన్ల నుండి నిధులను స్వీకరించింది. కానీ మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ మరింత మిలిటెంట్ పంథా చేపట్టిన తర్వాత, పేదవారందరి (నల్లజాతి, తెల్లజాతి పేదల) ప్రయోజనాలన్నీ ఒక్కటేనని నొక్కి చెప్పిన తర్వాత, వియత్నాం యుద్ధంలో అణచబడుతున్నవారి, పేదవారందరి ప్రయోజనాలన్నీ ఒక్కటేనని నొక్కి చెప్పిన తర్వాత ఆ సంఘం ఫౌండేషన్ల నిధులను తిరస్కరించింది. అయితే మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ హత్యానంతరం, ఫౌండేషన్ల – కార్పొరేషన్ల యొక్క నిధులతో అట్లాంటాలో 'మార్టిన్ లూథర్ అహింసాత్మక సామాజిక కేంద్రం' నెలకొల్పబడి, అతడి జ్ఞాపకాలను ఆ రకంగా నిరపాయకరంగా 'శుద్ధి' చేశారు.

1960లలో విద్యార్థుల అహింసాయుత కోఆర్డినేట్ కమిటీ యిచ్చిన "నల్లజాతివారి అధికారం" అన్న నినాదం అమెరికన్ పాలకవర్గాలకు భయాన్ని కలుగజేసింది. అందుకు జవాబుగా ఫోర్డు, రాక్ ఫెల్లర్ ఫౌండేషన్‌లు నేషనల్ అర్బన్ కోయిలేషన్ (ఎన్.యు.సి)ని సృష్టించి "నల్లజాతివారి అధికారాన్ని", "నల్లజాతివారి పెట్టుబడిదారీ విధానం"గా మార్చబూనుకొన్నాయి. జాతుల సమానత్వ కాంగ్రెస్ (కోర్)కు చెందిన రాయ్‌ఇన్నిస్‌కు ఫోర్డు ఫౌండేషన్ ఫెలోషిప్పు యివ్వటంతో, అతడు ఎన్.యు.సి.కి బోర్డు మెంబరయ్యాడు. అణగారిన ప్రాంతాలలో చిన్న చిన్న వ్యాపారాలు, చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేయటానికి వీలైన కమ్యూనిటీ డెవలప్‌మెంటు కార్పొరేషన్లకు ఎన్.యు.సి. కోర్‌లు మద్దతునిచ్చాయి. పోలీసుల అత్యాచారాలకు వ్యతిరేకంగా 1964లో ఒక సామాజిక ఉద్యమం, న్యూయార్కులోని బెడ్‌ఫోర్డ్ ప్రాంతంలో మొబలైజేషన్ ఫర్ యూత్ అనే యువకులను సమరశీలం చేసే ఉద్యమం తలెత్తింది. ఇందుకు ప్రతిగా ఫోర్డ్ ఫౌండేషన్ బెడ్‌ఫోర్డ్ – స్టువిసాంట్ రెస్టొరేషన్ కార్పొరేషన్ (బి.ఎస్.ఆర్.సి)ని సృష్టించింది. ఈ కార్పొరేషన్ ఆ ప్రాంతంలో చిన్న వ్యాపారాలను పెంపొందించింది. బి.ఎస్.ఆర్.సి. యొక్క డైరెక్టర్ అయినా ఫ్రాంక్లిన్ థామస్ తదుపరి కాలంలో ఫోర్డు ఫౌండేషన్‌కు మొట్టమొదటి నల్లజాతి అధ్యక్షుడు అయ్యాడు. ఫౌండేషన్లు, కార్పొరేషన్లు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లలో మిలియన్ల డాలర్లు వెచ్చించి, తద్వారా నగరాల మధ్య వున్న అల్పసంఖ్యాక నల్లజాతివారు నివసించే ఘెట్టో (మురికివాడల)లోని ప్రజలను శాంతపరిచి, వారిలో మితవాద నాయకులు వృద్ధి చెందేటట్టు చేశాయి.

1952లో ఫోర్డు ఫౌండేషన్ 'రిపబ్లిక్ కోసం నిధి' అన్న సంస్థ ఏర్పాటుచేసింది. ఈ సంస్థ మెక్‌కార్థీ యొక్క చీకటి రోజుల్లో పౌరస్వేచ్ఛల వ్యాజ్యాల కోసం నిధులను వెచ్చించింది. ఒకవైపు పౌరస్వేచ్ఛల కోసం నిధులు వెచ్చిస్తూనే మరోవైపు న్యూయార్కు సిటీ మరియు ఇతర పోలీసు డిపార్ట్‌మెంటులతో కలసి రహస్య సమాచార (గూఢచర్య) సేకరణ కార్యకలాపాలు చేయమని సి.ఇ.ఎ.కు సలహా యిచ్చింది.

ప్రజాప్రయోజన వ్యాజ్యాల వలన ఒనగూడే వాస్తవమైన సామాజిక లాభం అన్నది వట్టి బూటకం అనీ, అమెరికాలో జైలుపాలు చేయటం అన్నది ఎక్కువ స్థాయిలో వుందనీ, దుర్భరంగా, ఘోరంగా జైళ్ళ పరిస్థితు

లున్నాయనీ, మరణశిక్షను ఎక్కువ సంఖ్యలో విచ్చలవిడిగా విధిస్తారని ఆవిడ తెలియచేశారు. ఫౌండేషన్ల లక్ష్యాలలో ఒకటైన 'అసంతృప్తిని, హానికరం కాని నీటిలోకి మళ్ళించటం' అన్నది విజయవంతంగా నెరవేరి పనిచేస్తోందని ఆవిడ పేర్కొన్నారు. నిరసనకారుల యొక్క శక్తులు, సమరశీల నాయకుల యొక్క శక్తులూ, హక్కుల కోసం ప్రచారం చేయబడే వ్యాజ్యాలలో వినియోగింపబడి, కరిగిపోతున్నాయి. దీనినే ఆర్డర్ ఎస్. మిల్లర్ 'న్యాయవ్యవస్థ యొక్క క్రియాశీలత' (జ్యుడీషియల్ ఏక్టివిజం) అని పేర్కొన్నాడు : అసంతృప్తిని వేరే అపాయకరంకాని రూపాలకు మళ్ళించటం. కోర్టులు పాలకవర్గాలనే పైన నిలబెడుతూ, ప్రమాదకరమైన సామాజిక అల్లర్లను (అశాంతిని) బలవంతంగా అణచివేయటానికి అవసరమైన కనీసమైనదాన్ని మాత్రమే యివ్వటం అన్నది యీ 'న్యాయ వ్యవస్థ యొక్క క్రియాశీలత' అని దాని అర్థం.

సెంట్రల్ అమెరికన్ సంఘీభావ గ్రూపులు, యుద్ధ వ్యతిరేక గ్రూపులు; పర్యావరణ గ్రూపులు, మైనారిటీ గ్రూపులు లాంటి స్వతంత్ర ప్రజాసంస్థలు పెరిగిపోవటంతో ఫౌండేషన్లు స్పాన్సర్ చేసిన సమాంతర సంస్థలు – అమెరికన్ వాచ్, శాంతి ఉద్యమ గ్రూపులు, సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ సంస్థలు, లీగల్ డిఫెన్స్ నిధుల సంస్థలు లాంటివి ఏర్పడి పనిచేయటం ప్రారంభించాయి. 1984 నాటికి శాంతి ఉద్యమ సంస్థల యొక్క ఆదాయంలో మూడు వంతులు ఫౌండేషన్లు విరాళాలుగా యిచ్చాయి. ఇటువంటి సంస్థలను ఏర్పరచటం ద్వారా అమెరికన్ సమాజం తమను, తమ అవసరాలను పట్టించుకోవటల్లేదనే అభిప్రాయంతో విచ్ఛిన్నానికి, అసమ్మతికి, హింసకు పాల్పడకుండా నిరోధించవచ్చునన్నది ఫోర్డ్ ఫౌండేషన్ యొక్క అభిప్రాయం.

అమెరికాకు చెందిన ఫౌండేషన్లు 1998 నాటికి తమ అంతర్జాతీయ కార్యకలాపాల కోసం ఒక కోటి, 60 లక్షల డాలర్లను ఖర్చుపెట్టాయి. స్నేహపూర్వకమైన ప్రభుత్వేతర సంస్థల (ఎన్.జి.ఓ.ల)కు మద్దతుగా యీ మొత్తంలోని ఎక్కువ భాగాన్ని అవి ఖర్చుపెట్టాయి. భయంకరమైన విషయం ఏమిటంటే యింతటి స్వల్ప మొత్తంతో అవి పేద దేశాలలో గణనీయమైన పలుకుబడి, ప్రభావాలను చలాయించగల స్థాయికి ఎదిగాయి.

హ్యూమన్ రైట్స్ వాచ్, దాని అనుబంధ సంస్థలయిన అమెరికాస్ వాచ్, ఆసియా వాచ్ లాంటి సంస్థలు ఫౌండేషన్ల నుండే నిధులను పొందుతున్నాయి. ఆ రకంగానే ప్రత్యామ్నాయ శిఖరాగ్ర సభలు' అనబడే గ్లోబల్ ఫోరం, (ఐక్యరాజ్యసమితి నిర్వహించిన పర్యావరణం – అభివృద్ధి అన్న కాన్ఫరెన్సుకు సంయుక్తంగా నిర్వహించిన సభ) జి.7 సంపన్న దేశాల వార్షిక సమావేశంతోపాటు సంయుక్తంగా నిర్వహించిన ది అదర్ ఇకనామిక్ సమ్మిట్ (టి.ఎ.యిఎ.స్) లాంటి శిఖరాగ్ర సభలకు కూడా యీ ఫౌండేషన్లే నిధులను సమకూర్చుతాయి. ముంబాయిలో నిర్వహింపబడిన ప్రపంచ సోషలిస్టు ఫోరం (డబ్ల్యు.ఎస్.ఎఫ్)కు కూడా నిధులను వెచ్చించింది ఈ ఫౌండేషన్లే!

సి.ఐ.ఎ. తన అంతర్జాతీయ కార్యకలాపాలను, ఫౌండేషన్ల ద్వారా నిర్వహిస్తుంది. సాంస్కృతిక స్వేచ్ఛకోసం కాంగ్రెసు (కాంగ్రెస్ ఫర్ కల్చరల్ ఫ్రీడం) అనే సంస్థ యొక్క ప్రచార లక్ష్యం మార్క్సిజాన్ని ప్రత్యేకించి యూరోపియన్ మేధావుల మధ్య అభాసుపాలు చేయటం. అవిశ్వాసాన్ని పాదుకొల్పటం. ఈ కాంగ్రెసు ద్వారా సి.ఐ.ఎ. తన అంతర్జాతీయ కార్యకలాపాలను నిర్వహించింది. 1967లో యీ వ్యవహారం బట్టబయలు కావటంతో కొంతకాలంపాటు ఆగ్రహం వెల్లడైంది. పత్రికల రిపోర్టుల ప్రకారం సి.ఐ.ఎ. కనీసం 47 ఫౌండేషన్లను ఉపయోగించుకొని నిధులను కొన్ని సంస్థలకు బదలాయించింది. ఈ రకంగా మూడవ సంస్థకు నిధులను ఫౌండేషన్ల ద్వారా బదలాయించి సి.ఐ.ఎ. తన అంతర్జాతీయ కార్యకలాపాలను కొనసాగిస్తోంది.

ఫౌండేషన్లు అమెరికా ప్రభుత్వంతో కలసి విదేశాల్లో సంయుక్తంగా కార్యకలాపాలను నిర్వహిస్తాయి. ఉదాహరణకు ఇండోనేషియాలోని ఆధునిక పరిపాలనాధికారులకు శిక్షణనివ్వటానికి, అమెరికాదేశపు శిక్షణలో పనిచేయటానికి వీలుగా ఫోర్డు ఫౌండేషన్ మిట్, కార్నెల్, బెర్కిలీ, హార్వర్డు యూనివర్శిటీల ద్వారా పనిచేసింది. ఇండోనేషియాలోని విశ్వవిద్యాలయాల్లో అమెరికా నమూనా ఆర్థిక కార్యకలాపాలను (ప్రోగ్రాంలను) నెలకొల్పింది. ఇండోనేషియా విశ్వవిద్యాలయ బోధనా సిబ్బందికి అమెరికా దేశపు యూనివర్శిటీలలో ఇండోనేషియన్ ప్రోగ్రాం నడపటానికి అవసరమైన శిక్షణను యిప్పించింది. అత్యున్నతస్థాయి ఇండోనేషియన్ అధికారులకు అమెరికా దేశంలో శిక్షణను యిప్పించింది. తిరుగుబాటు ప్రతీఘాత నైపుణ్యంలో అమెరికన్ సైన్యం చేత శిక్షణ యిప్పించింది. హార్వర్డు, సియారాక్యూస్ యూనివర్శిటీలలో వాణిజ్య పరిపాలనా నైపుణ్యాల శిక్షణను యిప్పించింది. బెర్కిలీ నుండి శలవు మీద వచ్చిన ఒక రోట్స్ (ఆర్.ఒ.టి.సి) కల్నల్ చేత, ఇండోనేషియాలోని కులీనులకు చెందిన యూనివర్శిటీల విద్యార్థులకు పారా మిలటరీ శిక్షణలను యిప్పించింది. ఈ కార్యకలాపాల పునాదిపై ఆధారపడే 1965లో జరిగిన కుట్రలో ఇండోనేషియాలోని చట్టబద్ధ ప్రభుత్వాన్ని కూలద్రోయటం జరిగింది. 5 లక్షల మంది కమ్యూనిస్టులను, వారి సానుభూతిపరులను అత్యంత దారుణంగా ఊచకోత కోశారు.

20వ శతాబ్దపు ఆఖరి మూడు దశాబ్దాలలో, లాటిన్ అమెరికా దేశాల్లో నికరాగ్వువా, కొలంబియా, పెరూ లాంటి ఎన్నో దేశాలలో – వేలాది ప్రభుత్వేతర సంస్థలు (ఎన్.జి.ఒ.లు) పుట్టగొడుగుల్లా పుట్టు కొచ్చాయి. వీటిలో మానవహక్కుల ఎన్.జి.ఒలు కూడా ఎక్కువ సంఖ్యలో వున్నాయి. ఒక అభ్యుదయకరమైన మార్పు (వ్యవస్థలో) జరగాలంటే మహిళల సమానత్వం కానీ, పోలీసులు చట్టప్రకారం పనిచేయాల్సిన అవసరం కానీ, వుండనవసరంలేదనే సందేశాన్ని యీ సంస్థలు యిచ్చాయి. ఈ మానవత్వవాద ఎన్.జి.ఒ.లు ఎన్నడూ కూడా, స్థానికంగా జరిగే మానవ హక్కుల ఉల్లంఘనలు జరిపే స్థానిక శక్తులపట్ల అమెరికా వహిస్తున్న పాత్రనుగానీ, ఐరోపా దేశాలు చూపిస్తున్న ఉదాశీనతనుగానీ ఖండించలేదు. ఫౌండేషన్లు సృష్టించిన అమెరికాస్ వాచ్ (హ్యూమన్ రైట్స్ వాచ్ / అమెరికాస్) అమెరికా మద్దతుతో లాటిన్ అమెరికా దేశంలో సాగుతున్న సైనికవాదాన్ని కానీ, ఏర్పాటు చేసిన హత్యాదళాల గురించి కానీ, వారు జరిపే అకృత్యాలు – అత్యాచారాల గురించి కానీ ఎన్నడూ నోరెత్తి మాట్లాడలేదు. కనీసం ప్రస్తావించను కూడా లేదు.

లాటిన్ అమెరికా దేశాల్లోని ఎన్.జి.ఓ.లు ఒక ప్రధాన ఉద్దేశ్యంతో పనిచేశాయనీ, పినోచెట్ పాలనలో చిలీలో జరిగినట్లు సైనిక ప్రభుత్వాల నియంతృత్వాలు లేదా నయా ఉదారవాద ప్రభుత్వాలు ఏర్పడిన లాటిన్ అమెరికా దేశాలలో ఎందరో మేధావులు విశ్వవిద్యాలయాలలోని తమ

ఉద్యోగాల నుండీ, ప్రభుత్వోద్యోగాల నుండి తొలగింపబడ్డారనీ, ఇలా ఉద్యోగాల నుండి తొలగింపబడ్డ మేధావులను, ఫోర్డు, రాక్‌ఫెల్లర్ తదితర ఫౌండేషన్ల మద్దతుతో నడపబడుతున్న ఎన్.జి.ఓ.లు తమలోకి తీసుకొన్నాయని, అందువలన క్రమ క్రమంగా విప్లవవాదం (రాడికలిజం) తగ్గిపోయిందనీ ఆమె తెలియజేశారు.

ఒకనాడు ఎన్‌జిఓల పట్ల విమర్శనాయుతంగా వున్న నార్త్ అమెరికన్ కాంగ్రెస్ ఆన్ లాటిన్ అమెరికా సంస్థ కూడా, ఆఖరుకు ఫోర్డు ఫౌండేషన్ నుండి అధికారికంగా నిధులను స్వీకరించే స్థితికి దిగజారిపోయింది. అదేవిధంగా లాటిన్ అమెరికన్ పరిశోధనా సంస్థలు యిప్పుడు సామ్రాజ్యవాదాన్ని ఎంతమాత్రమూ విమర్శించటల్లేదు. 'పరాధీన సిద్ధాంతాన్ని' చర్చించటంలేదు. ఇప్పుడు రాజ్యహింసకు బదులు గృహ హింసనూ, గృహాలలోని పితృస్వామికవాదాన్నీ లక్ష్యం పెట్టుకొని పనిచేయటమన్నది 'అస్థిత్వవాద రాజకీయాల' కొత్త ఫ్యాషన్‌గా మారింది.

దక్షిణ ఆఫ్రికాలో నెల్సన్‌మండేలా నాయకత్వంతో ఎ.ఎన్.సి. పార్టీ నాయకత్వాన జాతి వివక్షతా వ్యవస్థ రద్దయి ప్రభుత్వం ఏర్పడింది. దక్షిణ ఆఫ్రికాలో సంపన్నవంతమైన బంగారం, వజ్రాల గనులే కాకుండా క్రోమియం, ఫెర్రోక్రోం, మాంగనీస్, ఫెర్రోమాంగనీస్, ప్లాటినం, వనాడియం లాంటి ఖనిజాల గనులున్నాయి.

దక్షిణాఫ్రికాలో మార్పు తీసుకురావటం కోసం 'నల్లజాతి వారి నాయకత్వాన్ని అభివృద్ధిపరచటం, నల్లజాతివారి సంక్షేమాన్ని పెంపొందించటం' కోసం పనిచేసే సంస్థలకు మద్దతును యివ్వాల్సిందిగా, అమెరికా దేశపు ప్రైవేటు సంస్థలను, 1978లో రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ నిర్వహించిన 'దక్షిణాఫ్రికా పట్ల అమెరికా దేశపు విధానం' అన్నదానిని అధ్యయనం చేస్తూన్న ఒక అధ్యయన కమీషన్‌ను కోరింది. మరోవైపు దక్షిణ ఆఫ్రికాలోని ప్రజాప్రయోజన వ్యాజ్య న్యాయసంస్థలకు, నల్లజాతివారి కార్మిక సంఘాలకు, సౌత్ ఆఫ్రికా దేశపు చర్చిల కౌన్సిల్‌కు, నల్లజాతివారు న్యాయవాదులు అవటం కోసం స్కాలర్‌షిప్‌లు మొదలైనవాటికి ఫోర్డు ఫౌండేషన్ సహాయం చేసింది. వీరందరినీ, దక్షిణాఫ్రికాలో జాతి వివక్షత అంతరించేనాటికి, ఎ.ఎన్.సి పార్టీకి బయట, అందుకు భిన్నమయిన 'నూతన నాయకత్వం' అందించటానికి సిద్ధంగా వుంచారు.

తూర్పు యూరోపులో కమ్యూనిస్టు ప్రభుత్వాలు కూలిపోవటానికి చాలా ముందు కాలం నుండే ఫోర్డ్, రాక్ ఫెల్లర్, కార్నెగి, మెక్ ఆర్దర్, బ్రాడ్లే, మైక్‌నైట్ మోట్, సోరోస్, మెల్లన్ ఫౌండేషన్లు తూర్పు యూరోపు దేశాల యూనివర్శిటీల్లోని విద్యార్థులకు మద్దతును యిచ్చాయి. దశాబ్దాల కాలంపాటు ఒక క్రమమైన పద్ధతిలో యీ దేశాలలోని మేధావి కులీనులతో సంబంధాలు ఏర్పాటు చేసుకొనే కృషిసల్పాయి. ప్రైవేటు దాతలు, అమెరికా ప్రభుత్వం పోలెండ్‌లోని సాలిడారిటీ, జెకోస్లోవేకియాలో సివిక్ ఫోరం లాంటి సంస్థలకు, అక్కడి ప్రభుత్వాలను కూలద్రోసే లక్ష్యంతో నిధులను అందజేశారు.

ఈ రకంగా తదుపరి దశలో ఒక కొత్త ఆధిపత్య భావజాలాన్ని కులీనవర్గాన్ని ఫౌండేషన్లు అమెరికా ప్రభుత్వం సంయుక్తంగా సృష్టించారు. సెంట్రల్ యూరోపియన్ యూనివర్శిటీలను నెలకొల్పటంలోనూ, కొత్త రాజకీయ పార్టీలను నెలకొల్పటంలోనూ, కొత్త పార్లమెంటేరియన్‌లకు, మీడియా సంస్థలకు, జర్నలిస్టులకు శిక్షణ యివ్వటంలోనూ, టి.వి., రేడియో స్టేషన్లకు కావల్సిన పరికరాలు సరఫరా చేయటం, లైబ్రరీలు – ఎలక్ట్రానిక్ బేస్‌లు ఏర్పాటు చేసే రూపంలోనూ, ఫౌండేషన్ల కృషి జరిగింది. 1989–1994 మధ్యకాలంలో, తూర్పు యూరోపులో యీ ఫౌండేషన్లు 45 కోట్ల డాలర్లను ఖర్చుపెట్టాయి. అనేక దేశాల్లోని ముఖ్యమైన అధికారులు, సలహాదారులూ యీ ఫౌండేషన్ల నిధులను అందుకొన్నారు. 1995 నాటికి జెక్ రిపబ్లిక్‌లో 29,000 ఎన్.జి.ఓ. సంస్థలున్నాయి. పోలెండ్‌లో 20,000 ప్రభుత్వేతర సంస్థలున్నాయి. మిగతా దేశాలలో కూడా అంతే సంఖ్యలో యీ ప్రభుత్వేతర సంస్థలున్నాయి. ఇంచుమించు యివన్నీ విదేశీ కార్పొరేషన్ల ఫౌండేషన్ల, ప్రభుత్వాల, రాజకీయ పార్టీల, అంతర్జాతీయ సంస్థలయిన యూరోపియన్ యూనియన్, ప్రపంచ బ్యాంకుల మద్దతుతో నడుస్తున్నాయి. 26 తూర్పు యూరోపు దేశాల్లో గతకాలపు సోవియట్ యూనియన్‌కు చెందిన దేశాల్లో సోరస్ ఫౌండేషన్ పనిచేస్తోంది. జార్జియాలో సంభవించిన 'విప్లవం'లోనూ ఉక్రెయిన్‌లో 2004 నాటికి ఏర్పడిన సంక్షోభంలోనూ సోరోస్, ఎన్.ఇ.డి., తదితర ఫౌండేషన్ల హస్తముంది.

స్థానిక చట్టాలకు విరుద్ధంగా ఫౌండేషన్లు నేరుగా రాజకీయ పార్టీలకు నిధులను యిచ్చాయి. అమెరికా దేశపు నేషనల్ ఎండోమెంట్ ఫర్ డెమొక్రసీ అన్న సంస్థ జెకోస్లోవేకియాలోని సంస్థలకు నిధులు, అక్కడి కమ్యూనిస్టు పార్టీ యొక్క ప్రభుత్వాన్ని కూలద్రోయటానికి దారితీసింది.

అమెరికా కూడా ప్రపంచం అంతటా వున్న ప్రభుత్వేతర ఎన్‌జిఓ సంస్థలకు అధికార సంస్థలైన యు.ఎస్.ఎయిడ్ నేషనల్ ఎండోమెంట్ ఫర్ డెమొక్రసీల ద్వారా నిధులను యిస్తుంది. 'మానవహక్కులు', 'మహిళా విమోచన', 'మైనార్టీల పరిరక్షణ' లాంటి నినాదాలను తన సామ్రాజ్యవాద అవసరాలకు వాడుకొంటుంది. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, యుగోస్లేవియా లాంటి దేశాలపై సామ్రాజ్యవాద దండయాత్రలు (దురాక్రమణ యుద్ధాలను) జరపటాన్ని సమర్థించుకోవటానికి అటువంటి ఆకర్షణీయమైన నినాదాలను అమెరికా వాడుకొంది. ఆ రకంగా ఆ నినాదాల స్ఫూర్తిని చాకచక్యంగా వక్రీకరిస్తోంది.

అమెరికన్ సామ్రాజ్యవాదం విదేశాల్లో కుట్రలు జరిపింది. తిరుగుబాట్లను నలిపివేసింది. నిర్బంధ ప్రభుత్వాలకు మద్దతును యిచ్చింది. తనకు సరిపడని, తనతో రాజీపడని దేశాలపై సామ్రాజ్యవాద సైన్యాలు, సామ్రాజ్యవాద ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు లేదా వాటి క్రింద పనిచేసే ఏజెన్సీలు దురాక్రమణ యుద్ధాలు జరిపాయి. 1973లో చిలీలో అలెండీని సైనిక కుట్ర ద్వారా అధికారాన్నుండి కూలద్రోయటానికి పునాది చిలీ దేశపు మేధావులకు ఫౌండేషన్లు నిధులను అందించటం వల్లనే! ఇండోనేషియాలో సుకర్నోను మిలటరీ కుట్ర ద్వారా అధికారం నుండి త్రోసివేయటానికి పునాది ఏర్పడింది ఫోర్డు ఫౌండేషన్ ఆ దేశంలో నిర్వహించిన కార్యకలాపాల వల్లనే.

తన అధ్యయనం ద్వారా రోయెలోఫ్స్ వెల్లడించిన ఫౌండేషన్ల యొక్క విధానాల, కార్యకలాపాల స్వభావం కేవలం అమెరికా దేశానికే పరిమితం కాలేదు. ఇంచుమించుగా ప్రపంచమంతటా ఫౌండేషన్ల

నిధులతో ఎన్.జి.ఓ.లు పనిచేస్తున్న అన్ని దేశాలలోని వీటి కార్యకలాపాల స్వభావం యీ రకంగా సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దోపిడీ, దౌర్జన్యాలకు సమర్థతను, తోడ్పాటునిచ్చేవిగానే వుంది.

ఇటువంటి ఫౌండేషన్లు కేవలం అమెరికా దేశంలోనే ఏర్పాటు కాలేదు. జర్మనీలో ముఖ్యమైన రాజకీయ పార్టీలన్నింటికీ ఫౌండేషన్లతో సంబంధం వుంది. క్రిస్టియన్ డెమోక్రటిక్ పార్టీకి కొన్‌రాడ్ అడెన్యువర్ ఫౌండేషన్‌తోనూ, సోషల్ డెమొక్రాట్స్‌కు ఫ్రెడరిక్ ఎబెర్ట్ ఫౌండేషన్‌తోనూ, గ్రీన్స్‌కు హెన్రిక్ బోల్ ఫౌండేషన్‌తోనూ సంబంధాలున్నాయి.

కెనడాలోని రైట్స్ అండ్ డెమోక్రసీ, బ్రిటన్‌లోని వెస్టమినిస్టర్ ఫౌండేషన్ ఫర్ డెమొక్రసీ, యూరోపియన్ ఫోరమ్ ఫర్ డెమొక్రసీ అండ్ సాలిడారిటీ లాంటి ఫౌండేషన్లు యీ కోవకు చెందినవే!

ఎన్.జి.ఓలకు కేవలం ఫౌండేషన్లేకాక, ప్రత్యక్ష కార్పొరేటు విరాళాల రూపంలో, ప్రభుత్వాలు యిచ్చే రూపంలోనూ ఆదాయం గణనీయంగా వుంటుంది.

నేడు మనదేశంలో అనేక ప్రభుత్వేతర సంస్థలు (ఎన్.జి.ఓ.లు) పుట్టుకొచ్చి పనిచేస్తున్నాయి. అంతేకాక బిల్‌గేట్స్ ఫౌండేషన్, వాల్‌మార్ట్ ఫౌండేషన్ లాంటి సంస్థలు తాము ఏర్పాటుచేసిన దళారీ (మధ్యవర్తి) సంస్థల ద్వారా, సృష్టించిన బూటకపు సంఘాల ద్వారా పనిచేస్తున్నాయి. మనదేశంలో పనిచేస్తున్న ఎక్కువమేర ఎన్‌జిఓలకు అమెరికన్ ఫౌండేషన్ల నుండే నిధులు అందుతున్నాయి.

ఈ ప్రభుత్వేతర సంస్థలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాల, మానవ హక్కుల, మహిళా, దళిత, ఆదివాసీ రంగాలలో పనిచేస్తున్నాయి. అంతేగాక వాల్‌మార్ట్ ఫౌండేషన్ లాంటి సంస్థలు చిన్న, సన్నకారు రైతుల మధ్య చొరబడి తన కార్యకాలాపాలు నిర్వహిస్తున్నాయి. మిలిందా గేట్స్ ఫౌండేషన్ బాలికల ఆరోగ్య పరిరక్షణ, గర్భాశయ కేన్సర్ నివారణ, వేక్సినేషన్ పేరిట పలు రాష్ట్రాలలో ప్రభుత్వాల ఆమోదంతోనే బాలికలపై వ్యాక్సిన్ల ప్రయోగాలు జరుపుతోంది. ఈ సంస్థలన్నీ 'అస్థిత్వవాద' ఉద్యమాలను రెచ్చగొడుతూ, వ్యవస్థకు వ్యతిరేకంగా ఐక్యమై పోరాడవల్సిన పేద, శ్రామిక ప్రజానీకాన్ని విడదీసి, ఐక్యం కాకుండా చేస్తున్నాయి. 'అస్థిత్వవాద', 'స్త్రీవాద', 'దళిత'వాద మేధావులనబడే మధ్యతరగతి విద్యావంతుల ద్వారా భావజాలరంగంలో గందరగోళం సృష్టింపజేసి సామాన్య ప్రజానీకం ఐక్యం కాకుండా నిరోధిస్తున్నారు. ఈ నేపథ్యంలో జోవాన్ రోయెలోఫ్స్, అధ్యయనం వెల్లడించిన విషయాలు, మన దేశంలోని యీ సంస్థల స్వభావ, స్వరూపాలను అర్థం చేసుకోవటానికి ఎంతగానో ఉపయోగకరంగా వున్నాయి. మనదేశంలో కూడా అటువంటి అధ్యయనాలు జరపాల్సిన ఆవశ్యకతను గుర్తుచేస్తున్నాయి. ✺

కవిత

# ఉన్మాదుల శాంతి హోమం

\- నేతాజీ

**కాశ్మీరం** కొలిమిగా మారి
అల్లకల్లోలమైంది!
గుజరాత్ గాయమై
గుర్తొచ్చినప్పుడల్లా
గుండె బరువెక్కుతోంది!..
ఉత్తరాది అంతటా
ఉన్మాద హింసతో
ఉడికి పోతోంది!..
మానభంగాలు జరిగి
మారణహోమాలు పెరిగి
మణిపూర్ మంటల్లో
మసి అవుతోంది!..
పగల సెగలతోటి
ఈశాన్యమంతా
ఈసురో మంటుంది...
అగ్ని గుండమై రగిలి
కార్చిచ్చులామారి
దక్షిణాదికిపాకి
దహించి వేస్తోంది!
దడ పుట్టిస్తోంది!..
కార్పొరేట్ కాల నాగుల
పడగ నీడన చేరి
గాడ్సేని కొలిచేటి
గాంధారి సంతానం
ఉన్మాద శక్తితో
దేశభక్తంటోంది!
నరబలులు అర్పిస్తూ
శాంతి హోమం చేస్తుంటే
విస్తు పోయి విశ్వమంతా
వింతగా చూస్తోంది...
ఆరక రగిలే
అగ్ని జ్వాలలు సోకి
ఆర్త జీవులంతా
కళ్ళెర్ర జేసి
కరకు దేలుతున్నారు
సంక్షోభ సీమలో
సంగ్రామం కోసం
ఎర్ర చీమల దండు
ఏకమై నిలిచింది!
ధనస్వామ్యం పాము
పుట్టలోనే బంధీ అయ్యింది!

(జి20 దేశాల సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ ఇతరదేశాధినేతలతో కలిసి గాంధీ సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించిన సందర్భానికి స్పందనగా) ✺

స్పందన

# శ్రామికవర్గ సంస్కృతిని వికసింపచేయటమే సనాతన ధర్మ పునరుద్ధరణవాదులకు జవాబు

- ప్రసన్న

**"సనాతన** ధర్మాన్ని వ్యతిరేకిస్తే చాలదు. డెంగ్యూ, మలేరియా, కోవిడ్‌లను నిర్మూలించినట్టు సనాతన ధర్మాన్ని కూడా నిర్మూలించాలి." అని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్, తమిళనాడు ప్రోగ్రెసివ్ రైటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ మహాసభలో సెప్టెంబర్ 2న చేసిన వ్యాఖ్యలతో ఈ అంశం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. వాస్తవానికి అతని వ్యాఖ్యల కంటే ఆ వ్యాఖ్యలకు హిందూ మతోన్మాద మూకల స్పందన వల్లే ఈ అంశం ఎక్కువ చర్చలోకి వచ్చింది. RSS-BJPల శక్తివంతమైన సోషల్‌మీడియా విభాగం వారి కృషి వల్లకొంతమంది సాధారణ భారతీయ పౌరులు కూడా సనాతన ధర్మాన్ని వ్యతిరేకించడాన్ని దేశ ద్రోహంతో సమానంగా అర్థం చేసుకుంటున్న పరిస్థితులను చూస్తున్నాం. ఈ కారణం వల్ల, ఈ దురభిప్రాయాన్ని ఎదుర్కోవాల్సిన బాధ్యత దేశవ్యాప్తంగా ఉన్న ప్రగతిశీల శక్తులపై పడింది.

## ఏమిటీ సనాతనం?

సనాతన అనే పదం భారతీయ సాహిత్యంలో మొదటిసారి భగవద్గీతలో ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఆత్మ యొక్క స్వభావాన్ని చెబుతూ అది సనాతనమైనదని వర్ణించారు. సనాతనం అంటే అత్యంత ప్రాచీనమైనదని ఆ సందర్భపు అర్థం. ఈ దృష్టితో చూసినప్పుడు సనాతన ధర్మం అంటే అత్యంత ప్రాచీన ధర్మం అని అర్థం. సమకాలీన సమాజపు అంగీకారం పొందిన సామాజిక విధి-విధానాల మొత్తాన్ని ఆ కాలపు ధర్మంగా భావిస్తారు. ప్రాచీన భారత దేశంలో ధర్మంగా చలామణి ఐన సామాజిక నియమాలను ఈ దేశంలో సనాతన ధర్మంగా అంటుంటారు. చతుర్వేదాలు, అష్టాదశ పురాణాలూ, రామాయణ - భారత - భాగవతాలు, మనుధర్మ శాస్త్రం, కౌటిల్యుని అర్థశాస్త్రం, జీమూతవాహనుని దాయభాగ, యాజ్ఞవల్క్యుని మితాక్షర లాంటి అనేక గ్రంథాలుఈ సనాతన సంస్కృతికి ఆధారాలుగా ఉన్నాయి. మంచి గతమున కొంచెమేనోయ్ అని గురజాడ చెప్పినట్లు ఈ సనాతన సాహిత్యంలో కూడా సమ్మిళిత అభివృద్ధిని కోరుకునే సహనా వవతు, లోకాస్సమస్తా సుఖినోభవంతు లాంటి ప్రస్తావనలు ఉన్నప్పటికీ, అవి వల్లె వేసేందుకు మాత్రమే పరిమితమయ్యాయి. శ్రామిక ప్రజలను, ముఖ్యంగా స్త్రీలను-శూద్రులను అణచి ఉంచే, వారి శ్రమను దోచుకునే, ఆస్తిహక్కుపై నిషేధం, విద్యపై నిషేధం, సతీసహగమనం, దేవదాసి విధానం, సముద్రయానంపై నిషేధం లాంటి అనేక అంశాలుమాత్రం ఆచరణలోకి వచ్చి, కరుడుగట్టి నిన్న మొన్నటి వరకు ఈ దేశాన్ని పట్టి పల్లార్చాయి. మొత్తం శ్రామిక ప్రజలను విభజించి పాలించే, ముఖ్యంగా దళితుల పట్ల అత్యంత అనాగరికంగా వ్యవహరించి ఈ దేశపు పురోగతికి ఆటంకంగా, దేశపు మెడలో గుదిబండగా తయారైన కుల వ్యవస్థ ఈనాటికీ దోపిడీ పాలకవర్గాల ప్రయోజనాల కోసం కొనసాగు తూంది. ముక్కోటి దేవతలు, కర్మ సిద్ధాంతం, పూర్వ జన్మ, పునర్జన్మ, స్వర్గ-నరకాలు, జ్యోతిష్యం, వాస్తు, భూతవైద్యం, శకునాలు లాంటి సనాతన ధర్మపు చిల్లర వేషాలు సరేసరి.

వాస్తవానికి సనాతన ధర్మం అనగానే హిందూ ధర్మం అనే పదానికి పర్యాయపదంగా అర్థం చేసుకుంటున్నారుగానీ, సనాతన అనేది orthodox అనే ఆంగ్ల పదానికి భారతీయ రూపం మాత్రమే. క్రైస్తవులు, ముస్లింలు, యూదులు, ఇలా అన్ని మతాలలో Orthodox అనే పద ప్రయోగం సాధారణంగా జరిగేదే. అన్ని మతాలలో ఈ సనాతన పైత్యం ఉన్నదే. ఐనప్పటికీ, మెజారిటీ ప్రజలు తమనుతాము హిందువులుగా భావించుకునే భారతదేశంలో సనాతన (ప్రాచీన) ధర్మం అంటే హిందూ ధర్మంగానే అందరూ అర్థం చేసుకుంటున్నారు. కానీ ప్రాచీన భారత దేశంలో భావవాదానికి వ్యతిరేకంగా నిలబడ్డ చార్వాకులు, లోకాయతులే కాకుండా హిందువులు నేటికీ షడ్దర్శనాలలో భాగంగా గుర్తించే సాంఖ్య దర్శనకారులు కూడా మన ప్రాచీన (సనాతన!) భారతదేశపు సంస్కృతిలో విడదీయలేని భాగమే. భారతదేశపు సాంస్కృతిక వారసత్వాన్ని రక్షిస్తామని ప్రగల్భాలు పలికేవారు మన గతం యొక్క ఈ భౌతికవాద కోణాన్ని సొంతం చేసుకోగలరా?

## సనాతన ధర్మ నిర్మూలన వల్ల ఎవరికీ నష్టం?

సనాతన ధర్మంగా భారతీయులు భావించే దానిలో అనేక అంశాలు ఇప్పటికే కనుమరుగయ్యాయి. అవి సమకాలీన సమాజంలో ఉనికిలో ఉండటం అసాధ్యం కూడా! అలాంటి సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని అంటే BJP ఎందుకు కంగారు పడుతుంది? సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు, ఈ దేశాన్ని దోచి పెడుతున్న దళారీ పెట్టుబడిదారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా శ్రామిక ప్రజలు సంఘటితం కాకుండా అడ్డుపడుతున్న అనేక అంశాలలో ముఖ్యమైనది సనాతన ధర్మం. జనాన్ని చీల్చి ఉంచుతున్న కుల వ్యవస్థకు పవిత్రతను అంటగడుతున్న ఈ సనాతన ధర్మం నిజమైన అర్థంలో నిర్మూలించబడితే, జనం కర్మ సిద్ధాంతాన్ని వదిలి తమ సమస్యలకు నిజమైన కారణాలను గుర్తిస్తే, ఈ దోపిడీ వ్యవస్థ మనుగడ అసాధ్యం ఔతుంది. కాబట్టి, ఈ వ్యవస్థకు ప్రస్తుతం నాయకత్వం వహిస్తున్న BJPకి సనాతన ధర్మ నిర్మూలన అనగానే వెన్నులో వణుకు పుడుతుంది.

## సనాతన-ఆధునిక సంకర రాజకీయం:

వర్గాలు లేని సమాజంలో ఉమ్మడి ధర్మానికి అవకాశం ఉంటుంది కానీ, వర్గ సమాజంలో ధర్మం పాలకవర్గపు ప్రయోజనాలు నేరవేర్చేదే అవుతుంది. ఐనప్పటికీ మెజారిటీ పాలితుల అంగీకారం దానికి ఉంటుంది. తమకు నష్టం కలిగించే నియమాలను పాలితులైన శ్రామికుల చేత ధర్మంగా అంగీకరింపజేయడంలో మతం ప్రధాన పాత్ర పోషిస్తుంది. అందువల్ల మతానికి పాలకుల మద్దతు ఉంటుంది. పాలకుల మద్దతుతో మతం – మతం మద్దతుతో పాలకులు (క్విడ్ ప్రో కో!) ఎదుగుతూ ఉంటారు. భారతదేశంలో పూజారివర్గం, క్రైస్తవంలో పోప్‌లు, ఇస్లాంలో ఖలీఫాలు మధ్య యుగాలలో సింహాసనానికి ప్రత్యక్షంగా అంటిపెట్టుకుని ఉండడానికి కారణం ఇదే. ఆధునిక యుగంగా పిలవబడే, పారిశ్రామిక విప్లవపు తరువాతి కాలంలో కూడా మతం రాజ్యాన్ని అంటిపెట్టుకునే ఉంటున్నప్పటికీ, ఆయా సమాజాల చైతన్య స్థాయిని బట్టి కొంత హెచ్చుతగ్గులతో మతం తెర వెనక పాత్రను మాత్రమే నిర్వహించటాన్ని చూస్తున్నాం. భారత సమాజం ఇప్పటికీ ఫ్యూడల్ సంబంధాల నుండి పూర్తిగా బయటపడని కారణంగా, మన ప్రజలు ఇప్పటికీ మతం మత్తును కోరుకునే స్థాయిలోనే ఉన్నందువల్ల పాలకులు మతాన్ని తెర ముందుకు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఆ ప్రయత్నాలలో భాగంగానే BJP అధికారం చేపట్టింది.

## సనాతన ధర్మాన్ని ప్రతిఘటించడమే శ్రామిక ధర్మం :

అసలు సనాతన ధర్మం అనే పదబంధమే అసంబద్ధమైనది. మనుషుల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించలేని, వర్ణాల పేరిట మనుషుల మధ్య విభజన రేఖలు గీసే నియమావళి ధర్మం అని ఎలా అనిపించుకుంటుంది? ప్రపంచంలో ఉన్న మతాలన్నీ మానవుణ్ణి నిమిత్త మాత్రున్ని చేసి, లేని భగవంతుడి ముందు మోకరిల్లజేసేవే కావడం చేత, ఆయా మతాల పుట్టుక నాటికి ఉన్న శాస్త్ర సాంకేతిక జ్ఞానం మేరకు తమ గ్రంథాలలో ఉన్న ఊహలకు పవిత్రతను చేకూర్చి, తదనంతర కాలంలో అభివృద్ధి చెందిన జ్ఞానాన్ని నిరాకరించడమే కాక, సైన్సును ప్రచారం చేసిన బ్రూనో లాంటి శాస్త్రవేత్తలకు మరణ శిక్ష విధించిన, డార్విన్ లాంటి వారిని నేటికీ హేళన చేస్తున్న, స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేసిన రచయితలపై ఫత్వాలు జారీ చేస్తున్న, హత్యలు చేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ విషయంలో మతాలన్నిటిదీ ఒకేదారి. ఇది మతాల యొక్క అమానుష సనాతన కోణం. ఇలాంటి సనాతన ధర్మాలన్నింటినీ నిర్మూలించకుండా మానవ సమాజం అభివృద్ధి సాధించే అవకాశం ఏమాత్రం లేదు. కాబట్టి ఈ కోణంలో ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు పూర్తిగా సమర్థించతగ్గవే. ఐతే పాలక వర్గాలలోని ఏదో ఒక ముఠా సనాతనం పేరుతో ఉన్న తిరోగమన సంస్కృతిని వ్యతిరేకించినా, వ్యతిరేకించకపోయినా సామాన్య ప్రజలను మతాల మత్తు నుండి బయటపడవేయడానికి ప్రగతిశీల రచయితలూ, కళాకారులూ నిరంతరం కృషి చేయాల్సి ఉంది. శ్రామిక ప్రజలందరి నడుమ సామరస్యాన్ని, సౌభ్రాతృత్వాన్ని, సమానత్వాన్ని పెంపొందించే శ్రామికవర్గ సంస్కృతిని వికసింపజేయడమే మన కర్తవ్యం.

కవిత

# బ్రతకడం ప్రారంభించినప్పుడు..

- ఏటూరి నాగేంద్రరావు

నా భుజం మీద
నీ చేతి స్పర్శ
ఆనాటి కబుర్లు
చీకటి అలుముకుంటున్న
ఈ సాయంకాలం గుర్తుకొస్తున్నాయి.
మర్చిపోవడానికి తాగడం
గుర్తుకు రావడానికి తాగడం
ఓహ్! ఆనాటి జీవితం
ఎన్ని రంగుల మిశ్రమం!
ఆ కన్నీళ్లూ,
పగలబడి నవ్వుకోవడాలు
కడుపులో ఆకలికి మాస్కేసి
ప్రాపంచిక సుఖాల బహిరంగ రహస్యాల్ని
చర్చిస్తున్నప్పుడు
భాష మనమధ్య ఒళ్ళు గుల్లచేసుకోవడం
బాగా గుర్తుంది నాకు.
నెత్తురు తుళ్ళిపడడం
వెలుతురులో పిడిబాకులు
నాట్యం చేయడం
నాకు, నీకూ మాత్రమే తెలుసు.
ఎన్నో ఏళ్లుగా మనం కలిసున్నా
సాహిత్యంలో జీవించడం మానేసాకే
బతకడం ప్రారంభమైంది.
హఠాత్తుగా మనల్ని ఆవరించిన
చీకటి గోడల్లో
నీ జ్ఞాపకాల అడుగులు కనిపించకపోయినా
నీ శ్వాస నుండి వీస్తున్నగాలి
హోరై
నన్నెప్పుడూ
చుట్టుముడుతుంది.

కవిత

# దారాల్లో దారులు

- లలితానంద్

అదేమిటో వాడు ఎదురొస్తే....
నిలువెత్తు అశోక వృక్షం
కదలివస్తున్నట్లుంటుంది
నిండుకుండ అడుగులో అడుగేసినట్లుంటుంది
ముంగిట్లో మల్లెపొద విరబూసినట్లుంటుంది
మదినిండా ముచ్చట్ల చప్పుడౌతుంది
సాకార సాంకేతికత ఆహార్యమైన ఆధునికత వాడు

★ ★ ★ ★

చూపులు ముంజేతి మణికట్టు తాకగానే....
ఎక్కడో కలుక్కుమంటుంది
మనసు చివుక్కు మంటుంది
ఇంతజేసీ యింతటి ఈ మనిషి....
బాహ్యాంతరాలు అంతగా అతుక్కోని
రంగురంగుల దారప్పోగుల బందీయా!
అనిపిస్తుంది..
ఆవేదన అలుముకుంటుంది
దారప్పోగులకు దాసోహమని
కుత్సితుల కుతంత్రాలకు ఊతమిచ్చే -
డిగ్రీలు హోదాలు అధికారైశ్వర్యాలూ
ఎన్ని వుంటేనేమి?
నీవు - నీ అంత నీవు గాక - నీ వారికీ
వేరెవరికీ చెందనపుడు
నీ జ్ఞాన కర్మేంద్రియాలు కట్టగట్టుకుని,
ఆ పోగుల సంకెళ్ళలో గిలగిల్లాడుతున్నప్పుడు
ఆ రంగుల దారాల వలలో వలయలయలో లోయలో
యుగయుగాల నీ చరిత్రంతా మటుమాయం
విజ్ఞాన వికాసాల విస్మరణ - శాస్త్రానికి శిలువ
సాంకేతికత సమాధి - నాగరికత నగుబాటు
శిలైపోతున్న సజీవ మానవ శిల్పం
తిరోగమనంలో ఆదిమ అడంగుకు అడుగులు
చైతన్యస్పృహా స్వయం హననం
గమ్యాగమనాల గగుర్పాటు
జీవన్మృతుల స్మరణలో
అనువంశికుల అసహజ నమూనా
తాతల తాతల, ముత్తాతల ముత్తాతల
తాయెత్తుల దురాయిల విభూదుల
మంత్ర యంత్ర తంత్ర కుతంత్రాలేకమై
రంగురంగుల దారాల్లోకి.. పరకాయ ప్రవేశం

అశోక వృక్షానికీ మల్లె పొదకీ..
నమ్మకాల వేరుపురుగు సోకింది
హరించిన హరిత దారాల్లో మూఢత్వం దూరి
సదాలోచన దూరాల పాలైంది
నిండు కుండ కళ్ళముందే భళ్ళున బద్దలైంది
చిన్నబోయిన సాంకేతికత - అపహాస్యపాలైన అత్యాధునికత
జీవన సత్యాల జవసత్వాలు -
పరివర్తనా పరిణతినొదలి పాతాళానికి
విశ్వాసపు గుప్పిట.. వివేకం విలవిల
నరుని నట్టింటి దీపం కావాల్సిన జ్ఞానం -
తలచివరి కొడగట్టిన ప్రమిద కావటం
ఏ ప్రగతి ప్రమాణ ప్రతీక?
ఏ ప్రతిబింబపు స్మృతిబింబం?
అపార స్వేచ్ఛా సోపానాలకు -
సూత్రాల సంకెళ్ళు.. ఇంకెన్నాళ్ళు?

★ ★ ★ ★

పరస్పరం ప్రాణిపోగు రాగం తెగుతున్నప్పుడు
ధాత్రి దారులన్నీ బీటలువారి -
ఎడతెగని రాత్రికి రహదారుల్లా....
రంగురంగుల దారాల రాళ్ళమోళ్ళు పరచుకొన్నప్పుడు
ఈ చీకట్ల కనుమరుగుకు - అంధానుకరణ మరుగుకు
ఇంకెన్ని యుగాలు గడవాలో?
ఇంకెందరు మహనీయులు రావాలో?
ఒంటిపై నూలుపోగు లేనివారే
దారాలకు దారకం పోసే దాతృత్వం లేనివారే
మనిషి మతినీ గతినీ అతిగా మార్చిందని -
ఎప్పటెప్పటి దారుల్నో దూరాల్నో దారాల్లో
వెతుక్కునే వారెరుగుదురో! ఎదుగుదురో!

★ ★ ★ ★

అప్పుడెప్పుడో అర్ధశతాబ్దం క్రిందటే -
హైస్కూల్లో.. ఒకే రంగు చేతిదారాలన్నిట్నీ
కోసేయించిన 'కనక సుందరం' మాస్టారిప్పుడెక్కడో?*
ఇపుడీ పనికి చాలని ప్రపంచ యంత్రాలన్నీ
కుహరాల్లో కునారిల్లే కృత్రిమ మేధోమధనాలన్నీ
సత్యం వైపు నడవాలంటే ఇప్పటికిప్పుడు కాకున్నా -
ఎప్పటికో అప్పటికైనా సాధ్యమా?

*(55 సంవత్సరాల క్రితం గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామ హైస్కూలులో 'కనక సుందరం'గారు లెక్కల మాష్టారు)

కవిత :

# నిప్పుల వంతెన

- ఈతకోట సుబ్బారావు

ఆరిన చితిలో అస్తికలు వెతికినట్టు
కారిన కన్నీళ్ల లోనే
చిరునవ్వుల్ని కెలుకుతున్నాను.
నిన్నా మొన్నటి కన్నీళ్లు
ఏదో ఓ నాటి చిరునవ్వుల పుడకలు
అశ్రువుల్లో కరిగిపోయినట్టున్నాయి.
మనుషులు నడిచిన ఎడారి వనాల్లో
మొక్కలు పూలు పూయటం లేదు
చుక్కలు నిండిన ఆకాశం
చేతికందని పుల్లని ద్రాక్ష
ఎవడికి వాడొక ఏకముఖి రుద్రాక్ష
ఎవడి ప్రాణవాయువు వాడు మోసుకుంటూ
సంతలో వొంటరి వొంటెలా
ఏకాకి ప్రయాణం సాగిస్తున్నాడు
మంచుపూల దోసిలితో
నిప్పుల వంతెన పక్కనే నిలుచున్నాను.
ఒక్కడూ పలకరించడు
పక్కనున్న చలివేంద్రాన్ని నిర్లక్ష్యం చేస్తూ
దాహం కొరకు మరీచిక వెనక
ఎవడి అవసరం వాడు మోసుకుంటూ
పక్కవాడి పూసుపట్టని పరుగు.
మొలకెత్తిన పచ్చని పాదాలతో నటించిన వాళ్ళు
అడుగెత్తిన ప్రతి చోటా పక్షుల పాటలైన వాళ్ళు
సాముహికంగా పుష్కర స్థానాలై ప్రవహించిన వాళ్ళు
వీళ్లేనా నాటి ఆనవాళ్ళు?
స్వార్థాన్ని ప్రాణ శ్వాసగా మార్చుకున్నవాళ్లు
నాలుగు గోడల మధ్య ఆత్మ ఖైదీలుగా
మతాలుగా కులాలుగా గోత్రాలుగా మొలిచిన వాళ్ళు
చరిత్ర ముఖపత్రంపై చీకట్లై ముసురుకున్న వాళ్ళు
వీళ్లంతా మానవతా విధ్వంసకులే కదా!
మనిషికి మనిషి పరిచయం లేని శాల్తిలా
మారిపోయిన ఋతువును మార్చక తప్పదు!
ఆశల ఇంద్రధనస్సులోకి
ఒక ప్రణయాంతర ఉజ్వల భవిష్యత్తులోకి
మనిషి ప్రయాణం కొనసాగాలి!
ఆత్మకు రెక్కలిద్దాం
మనిషికి మాటలిద్దాం
పెదవుల మీద ఒక చిరునవ్వు విత్తు నాటుదాం.
అందుకే మంచుపూల దోసిలితో
నిప్పుల వంతెన పక్కనే నిల్చున్నాను!!

పాట :

# సంరక్షణ చట్టం పేరుతొ భక్షించే చట్టం

- ఉప్పెన

అటవి సంరక్షణ చట్టంరో ఒరె నాయన
అడవులని భక్షించే చట్టంరో ఒరె నాయన
ఆదివాసులను శిక్షించే చట్టంరో ఒరె నాయన "అటవి"

నూతన అటవి సంరక్షణ నియమాల పేరుతోనిర
అడవిని ఆదివాసులను అంతం చేసే చట్టంరన్న
అడవకి ఆపద వచ్చెనురో ఒరె నాయన
ఆదివాసులకు ముప్పె వచ్చెనురో ఒరె నాయన
అందరేకమై పోరును చేయాలి ఒరె నాయన "అటవి"

అడవులనన్ని కట్టకట్టి అంబానికి అప్పచెప్పుటకు
ఖనిజ సంపదను మూటనుకట్టి అదానికి ముట్టచెప్పుటకు
సంరక్షణ చట్టం పేరుతొ బక్షించే చట్టాన్ని తెచ్చి
అటవి సంపద దోచుక పోతుండ్రో ఒరె నాయన
అడవులనన్ని ధ్వంసం చేస్తుండ్రో ఒరె నాయన
ఆనవాళ్లు కూడా మిగలవురో ఒరె నాయన "అటవి"

ఎన్నో త్యాగాలను చేసి తెచ్చుకున్నా చట్టాలను
రక్తాలను దారబోస్తే వచ్చినట్టి మన హక్కులను
అటవీ సంరక్షణ చట్టం నామ మాత్రం చేసేస్తుంది
కోరలు పీకిన పాముల తీరుగా ఒరె నాయన
మన చట్టాలన్ని మారిపోతయిరో ఒరె నాయన
దోపిడి దొంగల చుట్టాలైతయిరో ఒరె నాయన "అటవి"

వన్ సెవంటిని అడ్డును తీసి రాచ బాటలు వేసుకుంటరు
పీసా చట్టం పీకను పిసికి తీవాచీలుపరుచుకుంటరు
అటవి రక్షణ చట్టాలను ఆసొంతము ధ్వంసం చేసి
దోపిడి దొంగల చేతుల్లోన ఒరె నాయన
అటవి సంపదను పెట్టె చట్టంరో ఒరె నాయన
హక్కుల దెబ్బ కొట్టె చట్టంరో ఒరె నాయన "అటవి"

అడవుల నుండి ఆదివాసులను వెళ్ళగొట్టుటకు వేసిన ఎత్తుల
కేంద్రం రాష్ట్రం ఒక్కటి అయ్యి కూడపలుక్కొని చేసిన కుట్రల
ఆదివాసీ సమాజమంతా ఏకతాటిపై కదిలి ముందుకు
హక్కుల కోసం ఆయుధమెత్తాలీ ఒరె నాయన
చట్టాల రక్షణకు సాయుధమవ్వాలీ ఒరె నాయన
మరో పోరుతో చరిత్ర రాద్దాము ఒరె నాయన "అటవి"

బతుకు నేర్పినది అడవి తల్లిర పోరు నేర్పినది అడవి తల్లిర
తిరుగుబాట్లకు పురుడు పోసినది అడవి తల్లి ఆయుధమేర
అమర వీరుల త్యాగాలను గుండెల నిండా తలుచుకోని
అడవి తల్లిని ఆదుకుందాము ఒరె నాయన
హక్కుల కోసం పోరును చేద్దాము ఒరె నాయన
ఆదివాసుల సత్తా చాటుదము ఒరె నాయన "అటవి"

# చైతన్యవాహిని

**09-09-2023, తెనాలి :** 9-9-2023 సాయంత్రం తెనాలి సాహితీ మిత్రుల నిర్వహణలో బొల్లిముంత వీరయ్య రచన కవితా సంపుటాల ఆవిష్కరణ సభ రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) నాయకులు బొల్లిముంత సాంబశివరావు అధ్యక్షతన జరిగింది. తరువూరు కాకర్లమూడి వాడైన వీరయ్య 1980లలో గ్రామంలోని యువకులతో కలిసి భూస్వామ్య, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నాటకాలు రాసి ప్రదర్శించేవాడని చెప్పారు. వీరయ్య కవితా సంపుటి 'ప్రకృతి ఒడి'ని బొల్లు లలితానంద ప్రసాద్ ఆవిష్కరించి సమీక్షిస్తూ రైతు కుటుంబానికి చెందిన వీరయ్య ప్రకృతిలో మమేకమై అనేక కవితలు రాశారన్నారు. మరో కవితా సంపుటి 'అరుణ రాగం'ను కొత్తపల్లి రవిబాబు సమీక్షిస్తూ వచన కవితా ప్రక్రియ మెలకువలను వివరించారు. తన కవితలలో వీరయ్య మార్క్సిజాన్ని ప్రశంసించారనీ, నూతన ప్రజాతంత్ర విప్లవ ఆవశ్యకతని స్ఫురింప చేశారనీ చెప్పారు. కనపర్తి బెన్‌హర్ వీరయ్య కవితలను ప్రస్తావిస్తూ ప్రసంగించారు. దివికుమార్ తన ప్రసంగంలో వీరయ్య తన సాహిత్య కృషిలో మొదట్లో రైతుల సమస్యలపై కథలు రాశారన్నారు. చందు నాగేశ్వరరావు రచయితలు ప్రజాపక్షపాతులుగా వుండాలన్న గోర్కీ సూచనలను పాట రూపంలో వివరించారు. చివర్లో రచయిత వీరయ్య తమ గ్రామానికే చెందిన బొల్లిముంత శివరామకృష్ణ ప్రభావం తన లాంటి యువకులపై పడిందనీ, ఆనాటి యువబృందం సమాజం గురించి తీవ్రంగా ఆలోచించి ఉద్యమాలలో పాల్గొనేదని గుర్తుచేసుకున్నారు. కోవిడ్ కల్పించిన ఏకాంతం ఫేస్‌బుక్‌లో కవితా రచనకు దారితీసిందనీ వివరించారు.

**17-9-2023, హైదరాబాద్ :** జనసాహితి జంట నగరాలశాఖ ఆధ్వర్యంలో "తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్ర – పాలకవర్గాల వక్రీకరణలు, సాహితీ సాంస్కృతికోద్యమ కర్తవ్యాలు" అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని సెల్లార్ హాల్లో 17.09.2023న సభ జరిగింది. సభ 'ధరిత్రీ క్రియేషన్స్' నిర్మాణంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిన తీరుతెన్నులపై నిర్మించిన 'ఎర్రెర్రని తెలంగాణా...' లఘు చిత్ర ప్రదర్శనతో ప్రారంభమైంది. బిడియల్ సత్యనారాయణ టీము సహకారంతో ఈ చిత్రాన్ని రూపొందించారు. ఎన్నో మాటల్లో కానీ చెప్పలేని విషయాలను 10 నిమిషాల నిడివి గల ఈ లఘు చిత్రం ద్వారా చెప్పగలిగారు.

సభకు జంటనగరాల శాఖ అధ్యక్షులు కె.రామ్మోహన్ అధ్యక్షత వహించారు. సభను ప్రారంభిస్తూ నిజాం ప్రభువుల సంస్థానం ఏర్పాటు ఎలా జరిగిందో, నిజాం రాజులు బ్రిటిష్ పాలకులకు తొత్తులుగా ఎలా మారారో చెప్తూ ప్రాథమిక సమాచారాన్ని సభకు వచ్చినవారితో పంచుకున్నారు.

సభలో జనసాహితి జంటనగరాల శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ భట్టు లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ప్రజలని సన్నద్ధం చేయడానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఆంధ్ర మహాసభ (సంఘం) ద్వారా సాగించిన కృషిని వివరించారు. వెట్టిచాకిరీకి, లెవీలకు వ్యతిరేకంగానూ, జమీందారుల, దొరల కుటుంబాలలో జరిగే వివిధ పండుగలకు, పెళ్ళిళ్ళకు, పుట్టిన రోజులతో పాటు, ఆ కుటుంబాలలో ఏ చిన్న సంతోష సంబరాలకైనా పల్లెలపై బడి వసూలు చేసే కప్పాలకు వ్యతిరేకంగా సంఘం నాయకత్వంలో సంఘటితమై పోరుకు సిద్ధపడిన ప్రజల పోరాట స్ఫూర్తిని స్వీకరించాలన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంపై జనసాహితి సంస్థ ప్రచురించిన సాహిత్యాన్ని సభికులకు పరిచయం చేసారు. ఈనాడు పాలకవర్గాలు ఆ పోరాటాన్ని తమదిగా చూపుకునేందుకు అబద్ధాలు ప్రచారంలో పెడుతున్నారని, చరిత్రను వక్రీకరిస్తున్నారని కొన్ని వాస్తవ ఘటనలను వివరించారు.

విశ్రాంత అధ్యాపకులు శ్యామ్ మాట్లాడుతూ అప్పటి భారత ప్రభుత్వంలో భారత అంతర్గత భద్రత వ్యవహారాల శాఖా మాత్యులు సర్దార్ వల్లభాయ్ పటేల్ దిశానిర్దేశంలో, నాటి నిజాం నవాబు మూడు రోజుల్లోనే లొంగిపోయినా కానీ మరో రెండు సంవత్సరాలు హైదరాబాద్ సంస్థానం పాలనా వ్యవహారాలను చూడమని తిరిగి అదే నిజాం పాలకులకే అప్పజెప్పిన కాంగ్రెస్ పాలకుల లాలూచీని వివరించారు. తాము అసలు ప్రమాదంగా భావించిన రైతాంగ పోరాటాన్ని నెత్తుటేరుల్లో ముంచి అణచివేసే దాక ఇండియన్ యూనియన్ సైన్యం ఇక్కడే ఉండి మిలటరీ ఇనుప బూట్ల కింద అణచివేసిందని చెప్పారు. అప్పట్లో జైళ్లలో వున్న వారికి కనీసంగా నైనా స్వేచ్ఛ లేకుండా ఉద్యమాన్ని అణచివేసారని, ఆనాడు పోలీసులు సాగించిన దమనకాండ అకృత్యాలను, అప్పటి కుట్రకేసుల గూర్చి అర్ధమయ్యే రీతిలో వివరించారు. స్త్రీ సంఘటన పత్రిక సంపాదకులు ఎం.లక్ష్మి మాట్లాడుతూ 'బాంచెన్ దొరా, నీ కాల్మొక్తా అన్న స్థాయి నుంచి మట్టి మనుషులను మహోన్నతులుగా, పోరాట యోధులుగా తీర్చిదిద్దిన తెలంగాణా పోరాటం నేటికీ స్ఫూర్తినిస్తూనే వుందన్నారు. పోరాటంలో కష్ట జీవులను, మహిళలను కమ్యూనిస్టులు సంఘటితపరచిన తీరుని, నిర్మాణాత్మక కృషిని వివరించారు. పోరాట కాలంలో వివిధ రచనలు, కళారూపాల ద్వారా సాగించిన కృషిని వివరించారు. ఆంధ్ర మహాసభ ద్వారా విశాల జనబాహుళ్యంలో కృషి చేస్తూ ప్రజలను మెట్టు మెట్టుగా చైతన్య పరిచి నిజాం పీడన, దొరల దోపిడీనుంచి విముక్తి కలగాలంటే దున్నేవానికే భూమి ప్రాతిపదికపై భూమి పంపకం జరగాలని పోరాటాన్ని నడిపి మూడువేల గ్రామాల్లో తమ ప్రజా పరిపాలన స్థాపించుకున్నారని చెప్పారు. భారతీయులనే కాకుండా ప్రపంచ ప్రజలను ఆకర్షించిన ఈ పోరాటంపై గొప్ప సాహిత్యం వెలువడిందని, పోరాట చరిత్రను భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత సాహితీ సాంస్కృతికోద్యమ రంగాలపై వుందన్నారు. ఇంకా ఈ సభలో పెసర రవీంద్రారెడ్డి మాట్లాడుతూ వారి తల్లి గారైన పెసర సత్తెమ్మగారి జ్ఞాపకాలను, పోరాటంలో ఆమెతోపాటు కుటుంబం ఏవిధంగా నిలబడిందీ వివరించారు.

ప్రముఖ సాహితీ విమర్శకులు నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటానికి అండగా నిలబడిన అందరి జీవితాలనూ నేటి యువతరం ఆదర్శంగా చూడాలన్నారు.

నాటి ఆంధ్రమహాసభ పోరాటంలో చాలా త్యాగం ఇమిడి ఉందన్నారు. నేడు సమాజంలో ఎన్నో సమస్యలతో ప్రజలు కష్టాలకు కారణాలు తెలుసుకోవాలని, నిస్తేజంలోకి జారుకోకుండా నేటి యువత త్యాగాలకు సిద్ధంగా ఉండాలనీ ప్రజలకు, వారి పోరాటాలకు సంఘీభావంగా ఉండాలన్నారు.

సభాధ్యక్షులు చివరిగా ప్రజల పోరాటాలకు సంఘీభావంగా నిరంతర సాహిత్య సృజన, కళారూపాల ఆవిష్కరణ జరగాల్సిన అవసరం ఉందన్నారు.

**24-09-2023, శ్రీకాకుళం :** జనసాహితి రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన కామ్రేడ్ ఛాయరాజ్ 11వ వర్ధంతి (సెప్టెంబర్ 20) సమావేశం పి.ఎస్.ఎన్. ఎం.సి. ఉన్నత పాఠశాల, శ్రీకాకుళంలో 24 సెప్టెంబర్, ఆదివారంనాడు జనసాహితి, శ్రీకాకుళం జిల్లా శాఖ నిర్వహించింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన పసిడిమొగ్గ మోహనరావు మాట్లాడుతూ ఛాయరాజ్ సాహిత్యం లోతైన భావజాల సంపదను కలిగి ఉందనీ, ఆదివాసీలు, రైతులు మొ॥ పీడిత వర్గ ప్రజా సమస్యలపై ఆయన కలం పోరాటం సాగించిందనీ, ఆ సాహితీ సంపదకు మనమంతా వారసులం దాన్ని కొనసాగించవలసిన కర్తవ్యం నేటి వర్తమానంలో తక్షణ అవసరమై ఉంది అని తెలియజేశారు. కవి, రచయిత చింతాడ తిరుమలరావు మాట్లాడుతూ ఛాయరాజ్‌తో తనకున్న సాహితీ సంబంధాన్ని, సాన్నిహిత్యాన్ని, కవితలు రాసే విధానాన్ని చాలా అర్థవంతంగా చెప్పేవారని గుర్తుచేసుకున్నారు. 'ప్రజాసాహితి' ఎడిటర్ నాగరాజు మాట్లాడుతూ ప్రజాకవులుగా, తెలుగు సాహిత్య వారసులుగా చరిత్రలో నిలిచిపోదగిన వారు తిక్కన, వేమన, గురజాడ, శ్రీశ్రీ, ఛాయరాజ్ అని, ఛాయరాజ్ వర్ధంతి సమావేశ వేదికను నేటి సామాజిక, రాజకీయ, ఆర్థిక వైపరీత్యాలపై చర్చా కార్యక్రమముగా నిర్వహించుకోవలసిన అవసరం ఉందని హాజరైన సభ్యులకు సూచించారు.

ఈ సమావేశంలో జనసాహితి సభ్యులు చావలి శ్రీనివాస్, ఎస్. శంకరరావు, నవీన్ కుమార్, రామ్మోహన్‌రావు, ప్రసన్న, భుజంగరావు పాల్గొన్నారు. మొదట ఛాయరాజ్ చిత్రపటానికి ఛాయరాజ్ శిష్యుడు టి. చంద్ర మనోహర్ అభిమానంతో తీసుకువచ్చిన పూలమాలను విశ్వసాహితి పి.వి. నరసింహులు మాష్టారు అలంకరించారు. ప్రారంభ గీతముగా ఛాయరాజ్‌పై ప్రజాసాహితి ఎడిటర్ నాగరాజు రాసిన ఒక గీతాన్ని తవిటమ్మ ఆలపించారు. ప్రజాసాహిత్యం – కర్తవ్యాలు – ఛాయరాజ్ నిబద్ధత – ఆ స్ఫూర్తి సమావేశం పొడవునా కొనసాగింది.

**24-9-2023, అనకాపల్లి :** సెప్టెంబరు 24 సాయంత్రం 4 గంటలకు అనకాపల్లి జిల్లా చోడవరంలో 'స్మరించుకుందాం....' శీర్షికన జనసాహితి నిర్వహణలో సాహిత్య సమావేశం ఏర్పాటు చేయటం జరిగింది. సాహిత్య, సాంస్కృతిక రంగాలలో విశేషమైన కృషి చేసి సామాజిక పురోగమనానికి తోడ్పడిన సెప్టెంబర్ నెలలో జయంతులు / వర్ధంతులు గల మహనీయులను పరిచయం చేయడం ఈ సమావేశపు ఉద్దేశ్యం.

మొదట ప్రజాసాహితి రచయిత కె. గౌరీశంకర్‌గారు పెరియార్ రామస్వామి జీవితాన్ని గురించి పరిచయం చేశారు. బ్రాహ్మణాధిపత్యాన్ని సవాలు చేస్తూ ఆయన చేసిన సంఘర్షణాత్మక కృషి సారాంశంలో ఫ్యూడల్ దోపిడిపైన ఎక్కుపెట్టినదేనని అన్నారు. జనసాహితి ఉమ్మడి విశాఖజిల్లా కార్యదర్శి ఎస్. నూకాచారి గురజాడ గురించి మాట్లాడారు. తన కాలపు సాహిత్యకారుల కంటే గురజాడ ఎంతో ముందుచూపు ఉన్నవాడని, స్త్రీలు దళితులపట్ల ఆయన సానుకూల వైఖరి, హేతుదృష్టి, లౌకికతత్వపు ఆలోచన, శాస్త్రీయ దృక్పథం మొదలగు అనేక అంశాలలో గురజాడ నేటికీ మనందరకూ ఆదర్శమని అన్నారు. స్త్రీ విముక్తి సంఘటన కన్వీనర్ లక్ష్మీకుమారి, తాపీ ధర్మారావుగారు రచించిన ఇనుప కచ్చడాలు, పెళ్ళి దాని పుట్టుపూర్వోత్తరాలు పుస్తకాల గురించి మాట్లాడారు. స్త్రీ పురుష సంబంధాలు ఎలా పరిణామం చెందాయో తెలుసుకుని, ఎలా ప్రజాస్వామీకరించబడాలో తెలుసుకునేందుకు తాపీ వారి రచనలు చక్కని సాధనాలని అన్నారు. నూకాచారిగారు అబ్రహాం. టి. కోవూర్ గురించి మాట్లాడుతూ పుట్టపర్తి సాయిబాబా వంటి అసాంఘిక శక్తులు ప్రజలను మౌఢ్యంలో ముంచివేసే కాలంలో కోవూర్ శాస్త్రీయ చింతనకై చేసిన కృషి అద్భుతమైన ఫలితాలను యిచ్చిందని, ఎన్టీఆర్ వంటివారు సినిమాలలో సైతం సాయిబాబాను ఎండగట్టారంటే కారణం అబ్రహాం. టి. కోవూర్ కంటె ముందే తెలుగునాట హేతువాద భావజాల వ్యాప్తి ప్రభావం కల్పించిన వంటివారి వాతావరణమేనన్నారు. చివరగా జనసాహితి సంయుక్త కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ జనసాహితి ఛాయరాజ్ అంటే దీర్ఘకవితల ఛాయరాజు అనవచ్చని అన్నారు. ఆయన రచించిన శ్రీకాకుళం, తొలెరుక, రసస్పర్శ, దర్శని, నిరీక్షణ, దుఃఖేరు మొదలైన దీర్ఘ కవితలను చూపారు. 'దర్శని' దీర్ఘకవితలో ఆయన జీవపరిణామాన్ని, సమాజ పరిణామాన్ని ఎలా కవిత్వీకరించారో వివరించారు.

పెద్ద వర్షము, కరెంటు లేకపోవడం వంటి సమస్యలు అధిగమిస్తూ సమావేశం విజయవంతంగా జరిగింది.

**28-9-2023, ఒంగోలు :** గురజాడ, జాషువా, భగత్‌సింగ్ జయంతులను పురస్కరించుకొని స్థానిక మల్లయ్య లింగం భవన్లో సనాతన సంస్కృతి ప్రజా సంస్కృతి అనే అంశంపై జనసాహితి, ప్రజాతంత్ర మేధావుల వేదిక ఏర్పాటు చేసిన సభకు జనసాహితి జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఎం. ఏసుదాసు అధ్యక్షత వహించారు.

ఈ సభలో జనసాహితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవీ కృష్ణయ్య ప్రసంగిస్తూ ప్రాచీన భారతదేశంలో అమల్లో ఉన్న సతీసహగమనాలు, దేవదాసి వ్యవస్థ, బాల్యవివాహాలు అంటరానితనం లాంటి దుస్సాంప్రదాయాలను ఈరోజు దేశంలో ఎవరూ ఆమోదించడంలేదని, వీటన్నిటికీ మూలంగా ఉన్న సనాతన సంస్కృతిని రద్దు చేయడం ద్వారా ఇంకా సమాజంలో కొనసాగుతున్న కులవ్యవస్థ లాంటి దారుణ పరిస్థితులను తొలగించుకోగలుగుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. సనాతనం పేరిట హిందూ మతానికి రక్షకులుగా తమను ప్రకటించుకున్న పాలకులు సాధారణ హిందువులు పూజించే గ్రామ దేవతలను అంగీకరించరనీ, దీన్ని బట్టి సనాతనానికి సాధారణ హిందువులకు

సంబంధం లేదన్న విషయం తేటతెల్లం అవుతుందని ఆయన స్పష్టం చేశారు.

ఈ సభలో ప్రముఖ రచయిత నూకతోటి రవికుమార్ మాట్లాడుతూ ఈ దేశానికి ఉన్న బహుళత్వ, సామరస్య, సౌభ్రాతృత్వ సంస్కృతిని రద్దుచేసి సనాతన సంస్కృతిని మన మీద రుద్దాలని ప్రయత్నిస్తున్న బిజెపిని మనందరం ఎదుర్కోవాల్సి ఉందని పిలుపునిచ్చారు. బిజెపి జాతీయత నినాదం వరకేనని, విధానాలన్నీ పెట్టుబడిదారుల కోసమేనని ఆయన స్పష్టం చేశారు. సనాతన సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడిన చార్వాకులు, బౌద్ధుల నుండి ఫూలే, అంబేద్కర్ వరకు మనకు మార్గదర్శకులుగా ఉన్నారని, వారి అడుగుజాడల్లో మనందరం సనాతన వాదాన్ని ఎదుర్కోందామని తెలియజేశారు.

సభలో ప్రజాతంత్ర మేధావుల వేదిక కన్వీనర్ పంగులూరి గోవిందయ్య మాట్లాడుతూ దేశంలో అడుగడుగునా రాజ్యాంగం ఉల్లంఘించబడుతున్నా కూడా రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అధికారం చేపట్టిన మన పాలకులు ఏ రోజూ స్పందించ లేదనీ, సనాతన ధర్మం గురించి వచ్చిన ఒక వ్యాఖ్య మీద దేశవ్యాప్తంగా రగడ చేస్తున్నారని, సనాతన ధర్మం అంటే ఏమిటో నిర్వచించకుండా – సనాతనం పేరుతో ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దీని వెనక దోపిడి వర్గాల ఆర్థిక రాజకీయ ప్రయోజనాలు మాత్రమే ఉన్నాయని మనందరం అర్థం చేసుకోవాలని అన్నారు. సామాన్య ప్రజలకు వ్యతిరేకంగా పాలక వర్గాలు సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయని, మనందరం సమైక్యంగా తిరోగమనవాదంపై పోరాడాలని పిలుపునిచ్చారు.

అనంతరం ఆంధ్ర కేసరి యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ హర్షప్రీతందేవ్ కుమార్ మాట్లాడుతూ సనాతన సంస్కృతిలోని అపసవ్యతలపై పోరాడిన రాజా రామ్మోహన్‌రాయ్, దయానంద సరస్వతి, అంబేద్కర్, పెరియార్, గురజాడ, భగత్‌సింగ్ లాంటి వాళ్ళందరినీ, వారి పోరాటాలను మనం మననం చేసుకోవాలని గుర్తు చేశారు. రాజ్యాంగం నుండి సెక్యులర్, సోషలిస్ట్ పదాలను తొలగించే సాహసం భారత పాలకులు చేస్తున్నారంటే ప్రజా ఉద్యమాల పట్ల వారికి ఎంత చిన్నచూపు ఉందో అర్థం చేసుకోవాలని తెలియజేశారు.

ఈ సభలో నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు శ్రీమతి తేళ్ళ అరుణ, ప్రజాతంత్ర మేధావుల వేదిక నాయకులు కామ్రేడ్ కారుమంచి సుబ్బారావు ప్రసంగించారు.

జనసాహితి రాష్ట్ర నాయకులు కామ్రేడ్ శాంతికుమార్ జనసాహితి కార్యవర్గసభ్యులు కామ్రేడ్ డి.వి. ప్రసన్న, జిల్లా నలుమూలల నుంచి అనేకమంది మేధావులు, విద్యావంతులు, ప్రజాసంఘాల నాయకులు సభకు హాజరయ్యారు. ✺

## సాహిత్య సాంస్కృతిక సామాజికాంశాలు

# మోదీపై ఒక సాధారణ మహిళ ఆగ్రహజ్వాల!

**'మోదీ** లేడు – గీదీ లేడు! రెండు నెలల నుంచీ మోదీని ఎవరైనా చూశారా? ఇండియాలో వుంటున్నాడా మోదీ అసలు! అతడు విదేశాల మోదీ – ఇండియా వాడు కాదు' అని ఉగ్ర స్వరంతో అంటున్నది – రాంచీ టీ.వీ. ఛానల్లో రిపోర్టర్ ముందు మండిపడుతున్న ఆమె 62 ఏళ్ళ జ్యోతి ఖెంగ్రా!

మణిపూర్‌లో ఇద్దరు మహిళలపై జరిగిన అఘాయిత్యాన్ని నిరసిస్తూ జరిగిన ప్రదర్శన సందర్భంగా రాంచీ లైవ్ అనే ఛానెల్లో ఆమె ఆగ్రహ లావాను వెళ్ళగక్కారు. ఆమె కోపోద్రిక్త ప్రసంగం నచ్చి ప్రసిద్ధ చరిత్రకారుడు, రచయిత రామచంద్ర గుహా ఈ వీడియోని ప్రస్తావించి, 'ప్రధానమంత్రి, దేశ అధ్యక్షురాలు, మహిళామంత్రులూ, ఆదివాసీ మంత్రులు – అందరిపై నేరారోపణ చేస్తున్న న్యాయబద్ధమైన, శక్తిమంతమైన ఈ వీడియో తప్పక చూడండి' అని తన ట్విట్టర్‌లో వ్యాఖ్యానించాడు.

బామ్‌సెఫ్ (BAMCEF)కు చెందిన స్త్రీల విభాగమైన రాష్ట్రీయ మూలవాసీ మహిళాసంఘంతో సంబంధం వున్న ఖెంగ్రా టెలిగ్రాఫ్‌తో మాట్లాడుతూ, 'ఇద్దరు ఆదివాసీ స్త్రీలను నగ్నంగా వూరేగించడం చూసిన రాత్రి తనకు నిద్ర పట్టలేదనీ, ఆ తర్వాత రోజు తిండి కూడా తినలేకపోయా'నని చెప్పారు. నాకు ఇద్దరు కూతుళ్ళు. చిన్నకూతురు రోడ్డు ప్రమాదంలో మరణించింది. నా పెద్దకూతురు ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తూంటుంది. ఈ అనాగరిక చర్య నా కూతుర్లకే జరిగితే అన్న భావం నన్ను కలతకు గురిచేసింది. రాజకీయ నాయకులపట్లే కాదు – ప్రధాన స్రవంతి మీడియా పట్ల కూడా నాకు ఆగ్రహం కల్గుతోంది. ఏ ఛానల్‌వారూ ఆ దుర్ఘటన జరిగిన చోటుకు పోకపోవడం, విదేశీ యాత్రలో వున్న మోదీని పొగడటం నాకు దుర్భరమనిపించింది" అన్నారామె. ఆమె 5వ షెడ్యూలు ఏరియా యాక్షన్ ప్లాన్‌కు రాష్ట్ర అధ్యక్షురాలు కూడా. బెజిపివారి ట్రోల్ సైన్యమంటే నాకేమీ భయంలేదు. నాకు చావంటే భయంలేదు.

ఆమె జంషెడ్‌పూర్‌లోని టాటా స్టీల్ హాస్పిటల్‌లో 18 ఏళ్ళపాటు మంత్రసానిగా చేశారు. ఆ తర్వాత బొకారోలోని భారత కుటుంబ నియంత్రణ సంస్థ అనే స్వచ్ఛంద సంస్థలో నర్సుగా చేశారు. ప్రస్తుతం జార్ఖండ్‌లోని 13 జిల్లాలలో పర్యటిస్తూ, గ్రామసభల ప్రాముఖ్యతను తెలియచేస్తూ, తమను దోచుకుంటున్నవారిని అడ్డుకోమని ఆదివాసులను చైతన్యపరిచే కార్యక్రమంలో నిమగ్నమై వున్నారు. ✺




**అరుణరాగం – ప్రకృతి ఒడి : (కవితా సంపుటులు)** రచయిత : **బొల్లిముంత వీరయ్య**

'ప్రజాసాహితి' తొలి సంచికలలో రైతు జీవితాలను చిత్రిస్తూ వీరయ్య కథలు రాశారు. ఆ తర్వాత రచనారంగం నుండి దూరమై జీవన పోరాటంలో వివిధ రకాల వృత్తులు చేసి ఇప్పుడు ఇంటిపట్టునే వుండి హోమియోపతి వైద్యం చేస్తున్నారు.

ఇటీవల కరోనా విధించిన ఏకాంతవాసంలో వారు ఫేస్‌బుక్‌లో రాసిన రచనలన్నిటినీ ఈ రెండు సంపుటాలుగా విడుదల చేశారు. వీటిలో కొన్ని ఆయన 'విడదీలో అలలు' కాగా మరికొన్ని కవితలున్నాయి. వచన కవిత రాస్తున్నవారు రకరకాల పద్ధతుల్లో వివిధ అలంకార ద్వారా తమ భావాలను స్ఫురింపచేయడం కాక, కేవలం వచనంలో నేరుగా విషయాన్ని చెప్పేస్తున్నారు. వీటిని ఆయా రచయితల ఆలోచనా వీచికలుగా వుంటున్నాయి కాని అసలు సిసలు కవిత్వ స్వభావం సంతరించుకోవడంలేదు. వీరయ్య మరల కథా రచనను చేపట్టడం అవసరం.

(1/8 డెమ్మీలో 196, 222 పుటలు వున్న ఈ సంపుటుల వెల : రూ. 125/–; రూ. 150/– ప్రథమ ముద్రణ : ఆగస్టు 2023. ప్రతులకు : 2–36–1, పరుచూరివారి వీధి, గాంధీనగర్, తెనాలి – 522201. ఫోన్ : 9290002687. మైత్రీబుక్‌హౌస్, జలీల్‌వీధి, అరండల్‌పేట, కారల్‌మార్క్స్‌రోడ్, విజయవాడ–520002.

**ఆకుపచ్చని దేశం ★ నల్ల మిరియాల చెట్టు – నవలలు;** రచయిత : **డా॥ వి. చంద్రశేఖరరావు**

డా॥ వి. చంద్రశేఖరరావు నాలుగు కథాసంపుటాలు జీవని (1994), లెనిన్ ప్లేసు (1998), మాయాలాంతరు (2003), ద్రోహవృక్షం (2011) ముగింపుకు ముందు. అలాగే ఐదు హంసలు (1999), ఆకుపచ్చని దేశం (2009), నల్ల మిరియం చెట్టు (2011) అనే మూడు నవలలు రాశారు. ఆయన సాహిత్యం అంతా ప్రజల జీవితాలను ప్రతిఫలిస్తాయి. చదివే పాఠకుడిని ఆ, ఆ సాహిత్యాలలో భాగం చేస్తూ పరిష్కార దిశగా ఆలోచింపచేస్తాయి, కదిలిస్తాయి. ఈ ఆకుపచ్చని దేశం & నల్ల మిరియం చెట్టు నవలలను జూలై 8, 2017న డా॥ చంద్రశేఖర్ 5వ వర్ధంతి సందర్భంగా రెండవసారి ముద్రించారు.

'ఆకుపచ్చని దేశం' నవలలో వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ నేపథ్యంలో ముంపుకు గురౌతున్న చెంచు గూడాలు – చెంచు జాతుల చరిత్ర సంస్కృతులను రికార్డు చేయగా 'నల్ల మిరియం చెట్టు' నవల మూడు దశాబ్దాల కాలంలో తెలుగు రాష్ట్రాలలో సాగిన కమ్యూనిస్టు ఉద్యమాలు, ప్రపంచీకరణ ప్రభావంతో సాగిన అస్తిత్వ ఉద్యమాలు ముఖ్యంగా దళిత ఉద్యమాలు గురించీ, గ్రామాల్లో వర్గాలకి, కులాలకీ ఉన్న సంబంధం, వారి పరిణామాలను చిత్రించింది. ప్రచురణ : డా॥ వి. చంద్రశేఖరరావు సాహితీ కుటుంబం; పుటలు : 307, వెల : రూ. 300/– ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలో; నవచేతన పబ్లిషింగ్ హౌస్ హైదరాబాద్ అన్ని బ్రాంచీలలో; నవోదయ బుక్‌హౌస్ హైదరాబాద్; నవతెలంగాణ పబ్లిషర్స్ హైదరాబాద్ అన్ని బ్రాంచీలలో; అనల్ప బుక్స్ హైదరాబాద్ మరియు అమెజాన్‌లో.

**జమిడిక (కవిత్వం) :** రచయిత – **కందుకూరి అంజయ్య**

పెట్టుబడి నిర్దేశంతో వలసపోతున్న శ్రమ, మారుతున్న జీవన విధానాలు, సమష్టి జీవనం నుండి వ్యష్టివాద తత్త్వాలు, అస్తిత్వ ఉద్యమాలు, సబ్బండ వర్గాల జీవితాల నేపథ్యంలో రాసిన కవితల సంకలనం ఇది. కందుకూరి అంజయ్య 2013లో 'కట్టెపల్క' అనే తొలి కవితా సంకలనాన్ని వెలువరించారు. 55 కవితలతో కూడిన జమిడిక సంకలనం రెండవది. పుటలు : 140; వెల : రూ. 100/– మొదటిముద్రణ : ఏప్రిల్ 2023. ప్రచురణ : తెలంగాణ రచయితల వేదిక, కరీంనగర్. ప్రతులకు : కందుకూరి సుహాసిని, #10–4–311, సుభాష్‌నగర్, కరీంనగర్ – 505001. ఫోన్ : 94902 22201. మరియు అన్ని ప్రముఖ పుస్తక దుకాణాల్లో.

**దేశమంతా వాళ్ళ ఊరు (కవిత్వం) :** రచయిత – **వైష్ణవిశ్రీ**

కరోనా కల్లోలకాలం (2020–2021)లో వివిధ పత్రికల్లోనూ, ఫేస్బుక్‌లోనూ వచ్చిన 20 కవితల సంకలనం ఇది. "అందరికీ ఇది కష్టకాలమే అయినా బడుగు జీవులకు మాత్రం ఇది జీవన్మరణ కాలం. బతుకుదెరువులు స్తంభిస్తే నిలబడ్డ నేల హఠాత్తుగా పరాయిదైపోతే అంతకు మించిన కష్టం ఏమున్నది? కరోనా కాలంలో ఇదే జరుగుతున్నది" అని కవయిత్రి ఈ కవితా సంకలనానికి ముందుమాటలో రాశారు. ఈ కవితలన్నీ కరోనా కల్లోల కాలంలో ఛిద్రమైన సామాజిక పరిస్థితులను, పేద శ్రమజీవుల పరిస్థితులను తెలియచేసాయి.

పుటలు : 62; వెల : రూ. 100/– మొదటిముద్రణ : 2021.

**ఏడవ రుతువు (కవిత్వం) :** కవయిత్రి – **వైష్ణవిశ్రీ**

ప్రజాశక్తి, సూర్య, ఆంధ్రభూమి, నవతెలంగాణ, ప్రస్థానం పత్రికలలో ప్రచురించిన 78 కవితల సంకలనమే. ఈ ఏడవ రుతువు. వైష్ణవి శ్రీ మొదటి కవితాసంకలనం ఇది.

పుటలు : 152; వెల : రూ. 150/– మొదటిముద్రణ : జనవరి 2019.

**అటుగా వంగిన ఆకాశం (కవిత్వం) :** కవయిత్రి – **వైష్ణవిశ్రీ**

తన చుట్టూ వున్న జీవితాన్ని అర్థం చేసుకుంటూ రాసిన ఈ కవిత్వం నిండా ముఖ్యంగా స్త్రీలపై జరుగుతున్న అన్యాయాలు, దౌర్జన్యాలు, హింసను తెలియచేశారు. 50 కవితలతో కూడిన ఈ కవితా సంకలనాన్ని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) ప్రచురించింది.

పుటలు : 120; వెల : రూ. 120/– మొదటిముద్రణ : జనవరి 2022. ప్రతులకు : పై మూడు పుస్తకాలు దొరుకు చోటు : అమృతశ్రీ రాజీవ్ పబ్లికేషన్స్, తాళం రుద్రయోగేశ్వరరావు, సన్నాఫ్ తాళం మాధవరావు, #6–143, వీరవల్లి కృష్ణాజిల్లా – 521110. వైష్ణవిశ్రీ – 80742 10263.

**(ఇంకా వున్నాయి)**

## SSC CHSL Recruitment 2023 :

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పింది. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి ఉద్దేశించిన కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్-2023 (CHSL) నోటిఫికేషన్‌న ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా పోస్టుల సంఖ్య పెంచినట్లు సెప్టెంబరు 26న ఒక ప్రకటనలో వెల్లడించింది. మొదట ప్రకటించిన పోస్టులకు అదనంగా 162 పోస్టులను చేర్చింది. దీంతో గతంలో ఖాళీల సంఖ్య 1,600 ఉండగా, తాజాగా మొత్తం ఖాళీల సంఖ్య 1,762కి చేరింది.

వివిధ కేంద్రప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలు, మంత్రిత్వ శాఖలు, రాజ్యాంగ సంస్థలు, ట్రైబ్యునళ్లు మొదలైనవాటిలో లోయర్ డివిజనల్ క్లర్క్, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ పోస్టుల భర్తీకి మే నెలలలో ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్ విడుదల చేయగా ఆగస్టులో టైర్-1 పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. టైర్-1, టైర్-2 పరీక్షలు, కంప్యూటర్ టెస్ట్/ టైపింగ్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల అనంతరం అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. అభ్యర్థులు పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్ https://ssc.nic.in/లో చెక్ చేసుకోవచ్చు.

## ESIC జాబ్ నోటిఫికేషన్ విడుదల....

పలు విభాగాల్లో 47 ఉద్యోగాల భర్తీ.. పూర్తి వివరాలివే

ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) తాజాగా 47 స్పెషలిస్ట్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా హిమాచల్‌ప్రదేశ్, ఒడిశా, అస్సాం, తమిళనాడు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ గ్రేడ్-2 (Senior Scale & Junior Scale) పోస్టులను భర్తీ చేయనుంది.

అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://www.esic.nic.in/recruitmentsలో ఉన్న దరఖాస్తు ఫామ్‌లను పొందవచ్చు. అభ్యర్థులు స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తులను పంపించాల్సి ఉంటుంది. అభ్యర్థులు నవంబర్ 1 లోగా దరఖాస్తు చేసుకోవాలి.

అస్సాం, మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరాం, మణిపూర్, నాగాలాండ్, త్రిపుర, సిక్కిం, లడఖ్, లాహౌల్, హిమాచల్‌ప్రదేశ్, అండమాన్, నికోబార్ దీవులు, లక్షద్వీప్‌లోని చంబా జిల్లాలో నివసిస్తున్న అభ్యర్థులకు నవంబర్ 8 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. సెలక్షన్ బోర్డు నిర్వహించే ఇంటర్వ్యూ ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక ఉంటుంది.

**ముఖ్య సమాచారం :**

ఈఎస్ఐసీ నిబంధనల ప్రకారం ఆసక్తి గల అభ్యర్థులు స్థానిక భాషలో మాట్లాడగలగాలి. సీనియర్ స్కేల్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయసు నవంబర్ 1 నాటికి 45 సంవత్సరాలు మించకూడదు.

ఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు రూ.78,800 ప్రారంభ వేతనం ఉంటుంది. గుర్తింపు పొందిన మెడికల్ క్వాలిఫికేషన్ కలిగి ఉండాలి. జాబ్ నోటిఫికేషన్ ప్రకారం సంబంధిత స్పెషాలిటీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉండాలి.

జూనియర్ స్కేల్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు నవంబర్ 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు. వీరికి ప్రారంభ వేతనం రూ.69,700 ఉంటుంది. వీరు తప్పనిసరిగా లాంగ్వేజ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో లోకల్ లాంగ్వేజ్ తెలిసిన ఉద్యోగాలు పొందొచ్చు. అదనపు సమాచారం కోసం లింక్ పై క్లిక్ చేయవచ్చు.

# మణిపూర్ కూకీ మహిళ మాట్లాడుతుంటే ఎలా వుంటుందో తెలుసా?

### మంటలతో మాట్లాడుతూ, రక్తంతో రాగాలాపన చేస్తున్న డా।। మదూసా

గౌరవనీయులైన మహామనిషి రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్మూజీ నమస్కారం!

నేను డా।। మదాసాని. ఈ దేశపు ఒక సాధారణ మహిళను, ఈరోజు ఈ వీడియో ద్వారా మీకు ఒక విజ్ఞప్తి చేయదలిచాను. ఒక మహిళగా, ఒక మనిషిగా, ఒక పౌరురాలిగా ఈ విన్నపాన్ని చేస్తున్నాను.

మనదేశంలోని ఒక రాష్ట్రమైన మణిపూర్, గడచిన రెండున్నర నెలలుగా జాతుల హింసా జ్వాలల్లో మండుతోంది. ఈ మంటల్లో ఇప్పటికి 150కు పైగా పురుషులు, స్త్రీలు, పిల్లలు సజీవ దహనం అయ్యారు. ఈరోజు జరిగిన ఒక అమానవీయమైన సంఘటనను చూసి నా ఆత్మ వణికిపోయింది. హింసను ప్రోత్సహిస్తూ, శవాల గుట్టల మీద అధికారాన్ని నిలబెట్టుకుంటూ, మనుషుల తెగిన తలలతో సింహాసనాన్ని అలంకరించుకుంటున్న ఒక దుర్మార్గపు ప్రభుత్వం ఎంతగానో భయపెడుతున్నప్పటికీ నేను నోరు తెరచి మాట్లాడక తప్పడంలేదు.

కూకీ తెగకి చెందిన ఇద్దరు మహిళల్ని వందలమంది చూస్తుండగా కొందరు మగాళ్ళు వీధుల్లో ఈడ్చుకొని వెళ్ళారు. ఆ మహిళల శరీరాల్తో రక్కసుల్లా ప్రవర్తించారు. ఆ నిస్సహాయ మహిళలు చనిపోయేంతవరకు వారి రాక్షస క్రీడ కొనసాగింది. ఈరోజు కొన్ని వేలమంది ఆ వీడియోను చూశారు. మానవత్వం లేనివారు అది చూసి వేడుకలు చేసుకుంటున్నారు. ప్రభుత్వ బలగాల సాక్ష్యంగా మహిళల శరీరాల మీద సాగుతున్న ఈ వికృత క్రీడను చూసి వారు కేరింతలు కొడుతున్నారు.

మీరు కూడ ఒక మహిళే! పైగా మీరు ఆదివాసీ మహిళ కూడా! మన దేశ చరిత్ర శతాబ్దాలుగా మూలనివాసి మహిళల మీద సాగుతున్న హింసకు ఈ సంఘటన సాక్షీభూతంగా వుంది. ఈ దేశపు సర్వోన్నత అధికారపీఠాన్ని మీరు అధిష్టించడం దేశ మహిళలందర్నీ గర్వపడేట్లు చేసింది. వారిలో వారి భద్రత గురించి గొప్ప నమ్మకాన్ని కలిగించింది.

మరి మీరు ఎందుకు మౌనంగా వున్నారు? మీ దగ్గర అధికారం వుంది. శక్తి వుంది. అలాంటి శక్తి, అధికారాలు మాలాంటి మహిళల వద్ద వుండవు. సామాన్య ప్రజల వద్ద కూడా వుండవు. మీరు ఒక్కసారి ఒక శాంతి పిలుపు ఇస్తే దేశంలో విభిన్న సముదాయాల మధ్య ద్వేషాన్ని రగిలించి పాలన సాగిస్తున్న ప్రభుత్వాధినేతల డిన్నర్ టేబుల్ నుండి జారి కిందపడే మనుషుల మాంసపు ముద్దల కోసం కక్కుర్తి పడుతున్న ఈ దేశ మీడియాకు అప్పుడైన మణిపూర్ గుర్తుకు రావచ్చు! భారత్ వెలిగి పోతోందని, ప్రపంచవ్యాప్తంగా ఊదుతున్న బాకాల రణగొణ ధ్వనుల మధ్య ఆ ఇద్దరు మహిళల ఆర్తనాదం మీకు వినిపించవచ్చు. మన ప్రభుత్వానికి కూడా చెవుడు తగ్గి ఆ చావు కేకలు వినిపించవచ్చు. ఈ దేశంలో అత్యంత చవకైన మాంసం స్త్రీల శరీరం. ఆ ఇద్దరునగ్న నిస్సహాయ మహిళల కోసం చేతులు జోడించి మీకు మొక్కుతున్నాను. మణిపూర్‌ని కాపాడండి! మణిపూర్ మహిళల్ని కాపాడండి!!

– దానీ తెలుగు టీవీ వీడియో ఆధారంగా

కవిత

# తదాత్మానం సృజామ్యహమ్

- ఎ.కె. ప్రభాకర్

**నువ్వు** ధర్మం గురించి మాట్లాడినప్పుడల్లా
నాకు నువ్వు సృష్టించిన చాతుర్వర్ణ్యం
అది నిర్మించిన అంటరాని వెలివాడలూ గుర్తొస్తాయి
నువ్వు ధర్మం గురించి ఆక్రోశించినప్పుడల్లా
అందలం యెక్కి వూరేగడానికీ వూళ్ళేలడానికీ
నువ్వు తయారుచేసిన నిచ్చెన మెట్లు
కళ్ళముందు కనపడతాయి
కింది మెట్టు మీదే అణగారిన శ్రమజీవుల
దుఃఖాక్రందనలు వినపడతాయి
నువ్వు ధర్మ రక్షణ గురించి హెచ్చరించినప్పుడల్లా
నువ్వు నా నోటికట్టిన ముంతా
ముడ్డికట్టిన చీపురూ గుర్తుకొస్తాయి
నువ్వు ధర్మం గురించి బెంగపడినప్పుడల్లా
నాకు నీ మలాన్ని నెత్తిన మోసిన తట్టలే జ్ఞాపకం వస్తాయి
నువ్వు ధర్మం గురించి తపించినప్పుడల్లా
నన్ను గుడిచేటిని చేసి భోగ వస్తువుగా మార్చిన
స్మృతులే గునపాలై పొడుస్తూ వుంటాయి
నడి బజార్లో వెలకట్టి వేలం వేసిన పురాణ గాథలే గుర్తొస్తాయి
వూరి చివర యిప్పటికీ మిగిలి వున్న
లంజ దిబ్బలూ సూళె బజార్లూ
ఇల్లాళ్ళ శీలం చుట్టూ బిగించి కట్టిన యినప కచ్చడాలూ
వెక్కిరిస్తూ విరగబడి నవ్వే నవ్వులు వినిపిస్తున్నాయి
రంగమెక్కి నీ సుందర భవిష్యత్తుకు హామీ పడే
జోగినుల నిత్య నరకాలు కలవరపెడతాయి
నువ్వు ధర్మం గురించి ప్రవచించినప్పుడల్లా
సజీవంగా చితిమంటల్లో దహించిన
తల్లులు రోదనే చెవుల్లో ప్రతిధ్వనిస్తుంది
పాలిచ్చి పెంచిన తల్లుల రొమ్ములపై
విధించిన పన్ను యాదికొస్తుంది
యిప్పుడు నా ముందున్నది వొకే ప్రశ్న
యెవరి ధర్మం యెవరిని రక్షిస్తుంది యెవరిని భక్షిస్తుంది
యే సూక్తం యెంత కాలం యే పాపుల్ని శిక్షిస్తుంది

★ ★ ★ ★

నాకు తెలుసు
నీ ధర్మం నీకెప్పుడు ఆసరా అవుతుందో
నేను సామాజిక న్యాయం అని యెలుగెత్తినప్పుడల్లా
నీకు సనాతన ధర్మం అవసరమవుతుంది
నీ అధికార పీఠం కూసాలు కదిలినప్పుడు
ధర్మం నిన్ను కాపాడే ఆయుధమౌతుంది
నువ్వు సృష్టించిన బానిస సమాజం తిరగబడ్డప్పుడు
ధర్మం నీకు అణిచివేత సాధనమౌతుంది
నాకు తెలుసు
నీ ఆధిపత్యాన్ని ప్రశ్నించినప్పుడు
నీ అబద్ధాల పునాదులు కుంగిపోయినప్పుడు
ధర్మం నీకు రక్షణ కవచమౌతుంది
నేను జ్ఞానానికీ నైపుణ్యానికీ సన్నిహితమైనప్పుడు
నా తలనో బొటనవేలినో ఖండించడానికి
నీ ధర్మం రెండంచుల ఖడ్గమౌతుంది
చెవిలో సీసమౌతుంది
ఆంక్షల పర్వం మొదలౌతుంది
శిక్షా స్మృతులు పదునెక్కుతాయి
నీ ద్విజాతి సిద్ధాంతమో విజాతి రాద్ధాంతమో
వేయి పడగల నాగరాజై కాటేస్తుంది

★ ★ ★ ★

అసమానతల్నీ ఆధిపత్యాల్నీ పెంచి పోషించే ధర్మం
యెంత సనాతనమైనా యెంత అధునాతనమైనా
నిర్మూలించక తప్పదని నినదించిన మరుక్షణం
నువ్వు నా తలకు వెల కడతావు
నా వునికిని నిర్మూలించడానికి పథకం వేస్తావు
విద్వేష విషం గుమ్మరిస్తావు
ఫత్వాలు జారీ చేస్తావు
భక్త భైరవుల్ని వుసిగొల్పుతావు
అప్పుడు నీ పరమ ధర్మం పరమార్థం నాకు యెరుకవుతుంది
విశ్వగురు ముసుగు వెనక దాగిన
నీ వంచనాశిల్పం ఆవిష్కారమౌతుంది
తరతరాలుగా నా మీద రుద్దుతూ
నువ్వు రక్షిస్తూ వచ్చిన
ధర్మానికి గ్లాని గలిగిందన్న
నీ పెడబొబ్బల నిజరూపం బహిర్గతమౌతుంది
అప్పుడు.. సరిగ్గా అప్పుడే....
నన్ను నేను సృజించుకుంటాను
నా అస్తిత్వాన్ని పునర్నిర్వచించుకుంటాను
నన్ను నేను చూపుడు వేలుతో ఆవిష్కరించుకుంటాను
మరుగున పడ్డ నా చరిత్రని తవ్వి తలకెత్తుకుంటాను
నా లోపలి మనిషిని పైకెత్తి దివిటీలా వెలిగించుకుంటాను
చీకటి రాత్రుల్లో వెలుతురు గానమై మొలుచుకొస్తాను
విద్వేషానికి విరుగుడుగా ప్రేమైక భాషను నిర్మిస్తాను
విధ్వంసానికి ప్రతిగా సామూహిక సృజనను విరచిస్తాను

PRAJA SAAHITI October 2023 (TELUGU) Rs. 20/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023
No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month



చిత్రకారుడు : శీలా వీర్రాజు

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI